ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుల గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 314 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | మంగళవారం 10 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

### ప్రభుత్వానికి టెలికాం కంపెనీలు చెల్లించాల్సిన బకాయి రూ. 1.77 లక్షల కోట్లు

2024–25 ఆర్థిక సంవత్సరం నాటికి భారత ప్రభుత్వానికి టెలికాం కంపెనీలు చెల్లించా ల్సిన సర్దుబాటు చేసిన స్థూల రాబడి(ఏజీఆర్) బకాయిలు రూ. 1.77 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి. ఈ మేరకు అధికారి క డేటా వివరాలను ప్రభుత్వం పార్లమెంటుకు

### వాణిజ్య ఒప్పంద ప్రభావం పడొచ్చు

మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై వెలువడిన భారత్–అమెరికా సంయుక్త ప్రకటన ప్రభావం ఈవారం మన స్టాక్ మార్కెట్లపై ఉంటుంది. మన వస్తువులపై అమెరికా టారిఫ్‌లు 50% నుంచి 18 శాతానికి తగ్గుతాయి. సముద్ర ఉత్పత్తులు, జౌళి, ఇతర కార్మిక ఆధారిత రంగాలకు ప్రయోజనం కలగనుంది. సాంకేతికంగా చూస్తే నిఫ్టీ–50కి 25,500 పాయింట్ల వద్ద మద్దతు, 25,750 వద్ద నిరోధం కనిపించొచ్చు.

## రేవంత్ రెడ్డి మెదక్‌కు వచ్చేందుకు
# భయపడుతున్నాడు

- రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ లేదు కానీ..
- స్కామ్ క్యాలెండర్ అయితే ఇచ్చిండని
- దుబ్బాక ప్రచారంలో హరీశ్‌రావు
- మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని పిలుపు
- తెలంగాణను తెచ్చిన కేసీఆర్‌ను రేవంత్ తిడుతున్నాడు
- తెలంగాణ రాష్ట్రం తెచ్చి అభివృద్ధి పథకాలు అమలు చేయడం కేసీఆర్ తప్పా



**హైదరాబాద్**
రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ విమర్శించారు. 420 హామీలు ఇచ్చి ఒక్క హామీని అమలు చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. మహిళలకు ఫ్రీ బస్సు ఇచ్చారు.. కానీ రేవంత్ పాలన అంత తుస్సే అని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీలో హరీశ్‌రావు పర్యటించారు. చెల్లాపూర్ వార్డులో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. మున్సిపల్ - మిగతా3లో



## సెషెల్స్‌కు భారత్ భారీ ఆర్థిక చేయూత

- రూ.1500 కోట్ల స్పెషల్ ప్యాకేజీ ప్రకటించిన మోదీ
- సామాజిక గృహ నిర్మాణం, ఆరోగ్యం, రక్షణ, సముద్ర భద్రతకు నిధులు
- కొలంబో సెక్యూరిటీ కాన్‌క్లేవ్‌లో పూర్తి సభ్యత్వం పొందిన సెషెల్స్
- బ్లూ ఎకానమీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, పునరుత్పాదక శక్తిలో సహకారం విస్తరణ


# దక్షిణాదిపై కేంద్రం వివక్ష



- బీజేపీకి లైఫ్ లైన్ అసదుద్దీన్ ఒవైసీయే.. ఆయనే వారికి దేవుడు: రేవంత్ రెడ్డి
- మజ్లిస్ పార్టీని చూపించి ఇంకా ఎంతకాలం ఓట్లు అడుగుతారని ప్రశ్న
- తెల్లారితే బీజేపీ అసదుద్దీన్‌ను తలుచుకుంటుందని వ్యాఖ్య
- రెండేళ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో చేసిందన్న ముఖ్యమంత్రి
- తెలంగాణ కేంద్రానికి రూపాయి చెల్లిస్తే 42 పైసలు వస్తున్నాయి
- అదే బీహార్ రూపాయి చెల్లిస్తే ఆరు రూపాయలు వెళుతున్నాయి
- తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారం, కవిత అంశాలపై రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు
- తిరుమల లడ్డూ వ్యవహారం ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిందన్న ముఖ్యమంత్రి
- తెలంగాణలో అన్ని దేవాలయాల్లో విజయ డెయిరీని ఉపయోగిస్తున్నట్లు స్పష్టీకరణ
- కవిత జైలుకు వెళ్తే కేటీఆర్, హరీశ్ రావు సీఎం కావాలని చూస్తున్నారని వ్యాఖ్య
- పంపకాల్లో తేడా రావడంతో కొట్టుకుంటున్నారన్న ముఖ్యమంత్రి


**హైదరాబాద్**
బీజేపీకి లైఫ్‌లైన్ అసదుద్దీన్ ఒవైసీయేనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెరపడుతోంది. ఈ నేపథ్యంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, బీజేపీ నాయకులు అసదుద్దీన్ ఒవైసీ పేరును ఎన్నిసార్లు తలుచుకుంటారోనని ఎద్దేవా చేశారు. మజ్లిస్ పార్టీని చూపించి ఇంకా ఎంతకాలం ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. బీజేపీ తెల్లారితే అసదుద్దీన్‌నే తలుచుకుంటారని, ఆయనే వారికి దేవుడు అన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై తీవ్రంగా మండిపడ్డారు. మోదీని చూసి ఓటు వేయాలని బీజేపీ నాయకులు చెబుతున్నారని, గల్లీ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధమని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికలు వచ్చాయని ఇప్పుడు బీజేపీ నేతలు వచ్చి కేంద్రం నుంచి నిధులు తీసుకు వస్తామని చెబుతున్నారని - మిగతా3లో

## ఆర్‌ఎస్‌ఎస్ వల్లే బీజేపీకి 'అచ్ఛే దిన్'



- శతాబ్ది ఉత్సవాల్లో మోహన్ భగవత్ వ్యాఖ్య
- రామాలయం నిర్మాణంపై ఆర్‌ఎస్‌ఎస్ పట్టుదలగా వ్యవహరించిందని వెల్లడి
- ఆలయ నిర్మాణానికి సహకరించిన పార్టీలు లాభపడ్డాయని వివరణ

## డిజిటల్ మోసాల కేసులను ఎదుర్కోవడానికి ఎస్‌ఓపీని రూపొందించండి



- కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం
- డిజిటల్ మోసాలపై సుమోటోగా సుప్రీం కోర్టు విచారణ
- అనుమానాస్పద లావాదేవీలపై కస్టమర్లకు బ్యాంకులు అప్రమత్తం చేయాలని ఆదేశం
- "బ్యాంకులు కేవలం లాభాపేక్షతో, వ్యాపార ధోరణిలో ఉండి, నేరగాళ్లు సులభంగా దోపిడీ సొమ్మును తరలించడానికి వేదికలుగా మారుతున్నాయి"



## తొలి ఎన్నికల బరిలో విజయ్

- రెండు నియోజకవర్గాల నుంచి పోటీ!
- చెన్నైలోని విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు స్థానాలపై విజయ్ గురి
- పట్టణ, ప్రాంతీయ ఓటర్లను ఆకట్టుకునేందుకు పక్కా వ్యూహం
- రెండు స్థానాల్లోనూ అధికార డీఎంకేతోనే విజయ్ ప్రధాన పోటీ

# ముగబోయిన మైకులు!



- ప్రచార పర్వం ముగిసింది
- తాయిలాల పంపిణీ జోరందుకుంది!
- పురపాలక ఎన్నికలకు విస్తృతంగా ప్రచారం చేసిన రాజకీయ పార్టీలు
- ఫిబ్రవరి 11న పోలింగ్
- ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఎన్నికల అధికారుల ఏర్పాట్లు
- పోలింగ్‌తో పాటు ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలి
- రాష్ట్రవ్యాప్తంగా 8,203 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు
- ప్రతి కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ సౌకర్యం
- ఈసారి బ్యాలెట్ పేపర్ల ద్వారానే ఓటింగ్ జరగనుంది

**హైదరాబాద్:**
తెలంగాణలో పురపోరు ఎన్నికల ప్రచార పర్వం ముగిసింది. నగదు, మద్యం, తాయిలాల పంపిణీ జోరందుకుంది. మరోవైపు పోలీసులు, ఎన్నికల బృందాలు మరింత అప్రమత్తమయ్యాయి. పోలింగ్‌కు రాష్ట్ర ఎన్నికల సంఘం తుది సన్నాహాలు చేస్తోంది. పోలింగ్ సిబ్బంది, పోలీసు అధికారులతో ఎస్‌ఈసీ రాణికుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓట్ల లెక్కింపు ముగిసే వరకు పకడ్బందీగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే 14మంది పోటీ లేకుండా ఎన్నిక కాగా 12,930 మంది భవితవ్యం తేలనుంది. రాష్ట్రవ్యాప్తంగా 2982 వార్డుల్లో ఓట్లు వేసేందుకు 8, 203 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థల్లో సాయంత్రం ప్రచారం ముగియడంతో తాయిలాల పంపిణీ జోరందుకుంది. దీంతో పోలీసులు, ఎన్నికల యంత్రాంగం అప్రమత్తమైంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని పోలింగ్ సిబ్బంది, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్‌తో పాటు ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. - మిగతా3లో



## బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒప్పందం కుదుర్చుకున్నాయి

- బండి సంజయ్, గంగుల తీరుతో కరీంనగర్ అవినీతిమయమైంది
- కరీంనగర్ కార్పొరేషన్‌లో బీజేపీ, బీఆర్ఎస్ ఒప్పందం కుదర్చుకున్నాయి
- రెండు పార్టీల అవగాహనతో అభ్యర్థుల ఎంపిక జరిగిందని ఆరోపణ
- పదేళ్లలో కరీంనగర్ నిర్లక్ష్యానికి గురయిందని విమర్శ



## ఎస్ఐఆర్ ప్రక్రియకు అడ్డంకులు రానివ్వం

- అవసరమైతే ఆదేశాలు జారీ చేస్తాం: సుప్రీంకోర్టు
- ఎస్ఐఆర్ ప్రక్రియను ఎవరూ అడ్డుకోవద్దని స్పష్టమైన ఆదేశాలు
- మాస్ ఎక్స్‌క్లూజన్ జరగకూడదన్న వాదనపై కోర్టు స్పందన

## చంద్రయాన్-4 దిగేది... అచ్చోటనే!

- చంద్రుడిపై 'విక్రమ్' ల్యాండర్
- దిగేది 'మోన్స్ మౌటన్' పర్వతం వద్దనున్న చదునైన ప్రదేశంలో..
- 'చంద్రయాన్–2' ఉపగ్రహంలోని కెమెరా తీసిన ఛాయాచిత్రాలను విశ్లేషించి వారు ల్యాండింగ్ ప్రాంతంపై తాజా నిర్ణయం



# సంపాదకీయం

## సుప్రీం తీర్పు.. టీచర్స్‌పై ప్రభావం


2011 కంటే ముందు ఉపాధ్యాయులుగా చేరిన వారికి రెండు సంవత్సరాల లోపు టెట్ పరీక్షను ఉత్తీర్ణత సాధించాలని లేకుంటే ఉద్యోగాన్ని వదులుకోవాల్సి వస్తుందని దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి, మానసిక సంఘర్షణకు గురవుతున్నారు. తెలంగాణ లోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్, ఎయిడెడ్, ఇతర పాఠశాలలలో పనిచేసే టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్)తో భయాందోళనకు గురవుతున్నారు. సుప్రీంకోర్టు 31 ఆగస్టు, 2025 న ప్రతి ఒక్క టీచర్ టెట్ ఉత్తీర్ణత సాధించాలని లేదా ఉద్యోగం వదులుకోవాల్సి వస్తుందని ఉత్తర్వులు జారీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఏ రకమైన విధానం అనుసరిస్తుందో అని టీచర్స్ ఎదురుచూస్తున్నారు. 2009లో విద్యా కమిషన్ వచ్చిన తర్వాత 2010 నుండి టెట్ అమలులోకి వచ్చింది. టెట్ అమలులోకి వచ్చిన తరువాత 2012, 2017, 2024 మూడుసార్లు టీచర్స్ రిక్రూట్‌మెంట్ జరిగింది. టెట్ వారికి అమలులోకి వచ్చింది. అంతకు ముందు జరిగిన టీచర్స్ రిక్రూట్‌మెంట్‌లో టెట్ అమలులో లేదు. సుప్రీంకోర్టు తీర్పులో ఐదు సంవత్సరాల లోపు పదవీ విరమణకు దగ్గర ఉన్న వాళ్ళకు మినహాయింపు ఇచ్చారు. 1996 నుండి టీచర్స్‌గా ఉన్న వాళ్ళకు, 30 సంవత్సరాలు కావస్తున్న 50 సంవత్సరాలు దాటిన వాళ్ళు అనేక మంది ఉన్నారు. వాళ్ళలో కంటి చూపు, మోకాళ్ళనొప్పులు, ఇతర అనారోగ్యాలతో బాధపడుతున్న వాళు ౣ అనేక మంది ఉన్నారు. 50 సంవత్సరాలు దాటిన వారికి మినహాయింపు ఇవ్వడం కనీస న్యాయం. ప్రధానోపాధ్యాయ పదోన్నతిలో 50 సంవత్సరాలు దాటిన వారికి డిపార్ట్‌మెంట్ పరీక్ష నుండి మినహాయింపు ఉంది. 2024 సంవత్సరంలో ఎన్‌సిటిఇ కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వివరణ కోరితే 2010 కంటే ముందు టీచర్స్‌కు టెట్ అవసరం లేదని వివరణ ఇచ్చారు. ప్రస్తుతం సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పు 30 నుండి 40 వేల మంది టీచర్స్‌పై ప్రభావం పడుతుంది. భాషోపాధ్యాయులు ఉర్దూ, కన్నడ ఇతర దేశ భాషలలో బోధించే ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్‌లో పేపర్ 3 నిర్వహిస్తున్నారు. తెలంగాణలో భాషోపాధ్యాయులకు సాంఘిక శాస్త్రం 60 మార్కులకు కేటాయించడం వలన అనేక మంది తెలుగులో ఉత్తీర్ణత సాధించడం లేదు. ముఖ్యంగా తెలుగు భాషలో నిర్వహించాలని అన్ని ఉపాధ్యాయ సంఘాలు కోరుకుంటున్నారు. బయాలజీ ఉపాధ్యాయులకు గణితం, భౌతిక శాస్త్రంలో పరీక్షలు నిర్వహించడం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను, వారి మానసిక వేదనను అర్థం చేసుకొని పేపర్ 3 నిర్వహించి భాషోపాధ్యాయులకు న్యాయం చేయాలి. ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులకు 60 మార్కులు, బిసిలకు 75 మార్కులు, ఒసిలకు 90 మార్కులు రావాలనడం సమంజసంగా లేదు. ఏ పరీక్షలలోనైనా 35 మార్కులకే ఉత్తీర్ణత ఉంటుంది. అలాంటిది టెట్‌లో 90 మార్కులు రావాలన్న నియమం ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తుంది. కులప్రాతిపదికన మార్కులు కేటాయించడం ఏ పరీక్షలలోనూ లేదు. ఒక పాఠశాలలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి నలుగురు ఉపాధ్యాయులు ఉంటే నలుగురిలో ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయులకు 65% మార్కులు, బిసి ఉపాధ్యాయుడికి 77 మార్కులు, జనరల్ (ఒసి) ఉపాధ్యాయుడికి 89 మార్కులు అందరి కంటే ఎక్కువ వచ్చినప్పటికీ ఎస్‌సి, ఎస్‌టి, బిసి ఉపాధ్యాయులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రకటించి జనరల్ ఉపాధ్యాయుడు ఉత్తీర్ణత కాలేదు అనడం విశేషం. సమాజం దృష్టిలో, విద్యార్థుల తల్లిదండ్రుల దృష్టిలో, వారి భార్యాబంధువుల దృష్టిలో టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించని ఉపాధ్యాయుడిగా చిన్నచూపు. టెట్ పరీక్ష అంటే ఉపాధ్యాయ అర్హత పరీక్ష 25, 30 సంవత్సరాల నుండి పదవ తరగతి విద్యార్థులకు బోధించి, ఉత్తమ పౌరులను తయారు చేసి కొంత మంది విద్యార్థులే ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించేటట్లు సలహాలు, సహకారం అందించి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం చేత, స్వేచ్ఛంద సంస్థల చేత ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మానింపబడి టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించనంత మాత్రాన ఉపాధ్యాయ వృత్తికి పనికి రాడనడం ఏ రకమైన నీతి, న్యాయం, ధర్మమో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సిఆర్‌టిఇ) ఆధ్వర్యంలో పుస్తక రచయితలుగా ఉన్నవారు టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించలేదు కాబట్టి ఉపాధ్యాయుడిగా అర్హత లేదు అనడం సమంజసమేనా? భాషోపాధ్యాయులు (తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడం, తమిళం ఇతర దేశీయ భాషలు)బయోలజీ బోధించే ఉపాధ్యాయులకు వారు బోధించే సబ్జెక్టులో టెట్ పరీక్షను నిర్వహించకుండా వారికి సంబంధం లేని ఆంగ్లం, సాంఘికశాస్త్రం, గణితం, భౌతిక శాస్త్రం, మానసిక శాస్త్రంలో పరీక్షలను నిర్వహించి ఉత్తీర్ణత సాధించాలని అనడం విచారించదగిన విషయంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెట్ పరీక్ష ఉపాధ్యాయ అర్హత పరీక్ష మాదిరిగా డాక్టర్ అర్హత పరీక్ష, న్యాయవాద అర్హత పరీక్ష, ఇంజినీర్ అర్హత పరీక్ష అంటూ ఏ వృత్తిలో లేని అర్హత పరీక్ష ఉపాధ్యాయులకు మాత్రమే నిర్వహించడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెట్ ఉత్తీర్ణత సాధించకుంటే పదోన్నతి రాదనడం, ఉద్యోగం వదులుకోవలనడం ఇదేమి న్యాయమని అనేకమంది ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారు. విద్య ఉమ్మడి జాబితాలో ఉండడంవల్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏ రకమైన విధానం అమలు చేస్తుందో అని ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టీచర్స్‌గా 2010 కంటే ముందు ఉన్న వాళ్ళకు టెట్‌నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుకుంటున్నారు. గతంలో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్‌టిఎఫ్) ఆధ్వర్యంలో దేశరాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు శ్రీపాల్ రెడ్డి కేంద్ర విద్యాశాఖ మంత్రిని కలిసి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పదవీవిరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు నగదు రహిత హెల్త్ కార్డుల కోసం ఒక కమిటీని ఏర్పాటు చేయడం గొప్ప పరిణామంగా వారు భావిస్తున్నారు.

# ప్రత్యేక వ్యూహంతోనే గిరిజన వికాసం



తెలంగాణ విజన్ 2047, సమగ్ర అభివృద్ధి, మానవ వనరుల వికాసం, సమాన అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఈ లక్ష్యాలను సాధించడంలో గిరిజన యువతపై రాష్ట్రం చేసే పెట్టుబడి చాలా కీలక పాత్ర పోషించనుంది. ఇప్పటివరకు తగిన విధంగా వినియోగించుకోని, అపార సామర్థ్యం కలిగిన గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం విజన్-2047 అమలులో ప్రధాన అంశంగా మారాల్సిన అవసరం ఉంది. జనగణన, రాష్ట్ర అంచనాల ప్రకారం తెలంగాణలో గిరిజనుల జనాభా 32.70 లక్షలు ఉంది. ఇది రాష్ట్ర జనాభాలో సుమారు 10 శాతం. ఇందులో 70 శాతం కంటే ఎక్కువ మంది షెడ్యూల్డ్ ప్రాంతాల్లో, మైదాన ప్రాంతాలలో నివసిస్తున్నారు. ముఖ్యంగా గిరిజన జనాభాలో 55 శాతం పైగా 30 సంవత్సరాల లోపు యువత ఉండటం రాష్ట్రానికి ఒక పెద్ద వరంగా చెప్పవచ్చు. అయితే విద్య, ఉపాధి వంటి రంగాల్లో ఉన్న నిర్మాణాత్మక అసమానతల వల్ల ఈ మానవ వనరు పూర్తిగా సత్ఫలితాలుగా మారడం లేదు. తెలంగాణలో గిరిజనుల అక్షరాస్యత రేటు సుమారు 63 శాతమే ఉండగా, రాష్ట్ర సగటు అక్షరాస్యత 72 శాతానికి పైగా ఉంది. అలాగే మాధ్యమిక స్థాయిలో గిరిజన ప్రాంతాల్లో పాఠశాల విడిచిపెట్టే గిరిజన విద్యార్థుల శాతం ఇంకా ఎక్కువగానే ఉంది. గిరిజన యువతలో సుమారు 70 శాతం మంది వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలపై ఆధారపడుతూ, రైతులుగా లేదా దినసరి కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. దీనివల్ల ఆదాయ భద్రత లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. గిరిజన యువతలో దాదాపు 15 శాతం కన్నా తక్కువ మందికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వివిధ నైపుణ్య శిక్షణ లభించిందన్న అంచనాలు ఉన్నాయి. తయారీ, సేవలు, సాంకేతిక రంగాల్లో వారి భాగస్వామ్యం చాలా తక్కువ. ఇది రాష్ట్ర దీర్ఘకాలిక అభివృద్ధికి సవాలుగా ఉండగా, వ్యూహాత్మక గిరిజనుల సుస్థిర అభివృద్ధికి ప్రాధాన్యత అంశాలు: తెలంగాణ విజన్ -2047 రాష్ట్రాన్ని ఆవిష్కరణలు, హరిత వృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, జ్ఞానాధారిత పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలోని ప్రతి పౌరుడిని సాధికారతకు, ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల సమగ్ర అభివృద్ధి, జీవన ప్రమాణాల మెరుగుదల, స్థిరమైన జీవనోపాధుల సాధనకు ఆరోగ్య సంరక్షణ, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సాధికారత అనే మూడు ప్రధాన రంగాలు కీలకం. వీటి ద్వారా వారి దీర్ఘకాలిక అభివృది, సుస్థిర జీవనం సాధ్యమై, భరోసా కలుగుతుంది. ఈ భవిష్యత్ ఆర్థిక వ్యవస్థకు గిరిజన యువతను అనుసంధానించాలంటే, సంప్రదాయ వృత్తులకే పరిమితం కాకుండా పునరుత్పాదక ఇంధనం, అగ్రి-ప్రాసెసింగ్, ఆహార విలువ గొలుసులు, ఆరోగ్య సేవలు, నిర్మాణ రంగం, లాజిస్టిక్స్, డిజిటల్ సేవలు, ఎకో-టూరిజం వంటి కొత్త రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించాలి. ప్రతి ఏడాది కనీసం లక్ష మంది గిరిజన యువతకు ఉపాధి కలిగించే నైపుణ్యాలు అందిస్తే, కుటుంబ ఆదాయాలు గణనీయంగా పెరగడమే కాకుండా స్థానిక ఉపాధి కల్పించడం ద్వారా షెడ్యూల్డ్ ప్రాంతాల నుంచి వలసలు పూర్తిగా తగ్గించవచ్చు. సంప్రదాయ జీవనోపాధి బలోపేతం ఆవశ్యకత: స్థానిక పరిస్థితులకు, గిరిజన సంస్కృతి, జీవన విధానాలకు అనుగుణమైన శిక్షణా కార్యక్రమాలు అవసరం. గిరిజన ప్రాంతాల్లో సహజ వనరులు, మానవ వనరులు సమృద్ధిగా ఉన్నాయి. చిన్న అటవీ ఉత్పత్తులు, వెదురు, ఔషధ మొక్కల ఆధారిత ఉత్పత్తులు, హస్తకళలు, సంప్రదాయ కళలలో విలువ జోడింపు చేయగలిగితే స్థిరమైన జీవనోపాధులు ఏర్పడతాయి. ఆధునిక నైపుణ్యాలు, నాణ్యత ధ్రువీకరణ, బ్రాండింగ్, మార్కెట్ అనుసంధానం కల్పిస్తే అటవీ ఉత్పత్తుల ద్వారా వచ్చే ఆదాయం 30 -50 శాతం వరకు పెరిగే అవకాశం ఉంటుంది. తద్వారా గిరిజన యువతతోపాటు గిరిజన మహిళలకు కూడా ప్రత్యక్ష లాభం చేకూరుతుంది. గిరిజన యువతకు డిజిటల్ విద్య: ప్రభుత్వ పాలన, విద్య, ఉపాధి రంగాలు డిజిటలైజ్ అవుతున్న తరుణంలో డిజిటల్ భాగస్వామ్యం అత్యంత కీలకం. డిజిటల్ విద్య లేమి గిరిజన యువతను వెనుకబాటుకు నెట్టే ప్రమాదం ఉంది. గిరిజన గ్రామాల్లో ఇంటర్నెట్ వినియోగం, డిజిటల్ పరిజ్ఞానం రాష్ట్ర సగటుతో పోలిస్తే తక్కువగా ఉంది. ప్రాథమిక డిజిటల్ నైపుణ్యాలు, ఐటి సేవలు, మౌలిక సదుపాయాలు అందిస్తే మారుమూల గిరిజన ప్రాంతాల్లో డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఆధారిత ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఇదివిజన్- 2047లో ఊహించిన జ్ఞాన ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా ఉంటుంది. నైపుణ్యాభివృద్ధి ఫలితాలు సాధించాలంటే అనుబంధ కార్యక్రమాలు కూడా కీలకం. ప్రాథమిక, మాధ్యమిక విద్య బలోపేతంచేయడంతో పాటు, పోషణ, ఆరోగ్యం, భాషా మాధ్యమం, ఆర్థిక చేకూర్పు వంటి అంశాలు శిక్షణను ఉపాధిగా మారుస్తాయి. గిరిజన మహిళలు,ఆదిమ గిరిజన తెగలు (పివిటిజిఎస్)పై ప్రత్యేక దృష్టి పెట్టడం అత్యవసరం. ఎందుకంటే వారు అనేక స్థాయిల్లో వెనుకబాటుకు గురవుతున్నప్పటికీ సమాజ స్థిరత్వంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. తెలంగాణ విజన్- 2047 విజయవంతం కావాలంటే అభివృద్ధి ఫలాలు అత్యంత మారుముల, ఏజెన్సీ ప్రాంతాలలోన ఉన్న, అట్టడుగు వర్గాల వరకు చేరాలి. గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడం కేవలం సంక్షేమ చర్య కాదు, ఇది దీర్ఘకాలిక ఆర్థిక అభివృద్ధి వ్యూహం. డేటా ఆధారిత ప్రణాళిక, బలమైన సంస్థాగత వ్యవస్థలు, పరిశ్రమలకు అనుగుణమైన శిక్షణతో గిరిజన యువతను నైపుణ్యవంతులైన ఉద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా, ఆవిష్కర్తలుగా తీర్చిదిద్ద గలదు. అలా గిరిజన యువతను రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో క్రియాశీల భాగస్వాములుగా 2047 నాటికి సమృద్ధి, సమానత్వం, స్థిరత్వం కలిగిన తెలంగాణను నిర్మించవచ్చు.

# ఎక్స్ కిరణాల ఆవిష్కర్త రాంట్జెన్



19 వ శతాబ్దం సంచలనాత్మక శాస్త్రీయ ఆవిష్కరణలకు స్వర్ణ యుగం. అలాంటి యుగంలో భౌతిక శాస్త్ర ప్రొఫెసర్ విల్హెల్మ్ కాన్రాడ్ రాంట్జెన్ ఒక వింతను కనుగొన్నాడు, దానిని చాలా మంది నమ్మలేదు. రాంట్జెన్ యొక్క ఆవిష్కరణ వార్తలు జనవరి 1896 ప్రారంభం నుండి ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించాయి. శాస్త్రవేత్తలు సైతం నివేదికలను ప్రాక్టికల్ జోకర్ ఉపాయం అని కొట్టి పారేశారు.రోగ నిర్ధారణకు కొత్త ఒరవడిని సృష్టించి, ప్రపంచంలో వైద్య రంగంలో రోగ నిర్ధారణకు (రేడియోగ్రఫీ), రోగ నిర్మూలనకు (రేడియో థెరఫీ) కొరకు ఉపయోగించే ఎక్స్ కిరణాలను కనుగొన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త విల్హెల్మ్ కన్రాడ్ రాంట్జెన్. ఆయన కనుగొన్న ఎక్స్ కిరణాలు వైద్యరంగం లోనె కాక భద్రతా రంగంలో ఉపయోగ పడుతున్నాయి. విల్హెల్మ్ కన్రాడ్ రాంట్జెన్ (మర్చి 27,1845 – 1923 ఫిబ్రవరి 10) జర్మన్ దేశ భౌతిక శాస్త్ర శాస్త్రవేత్త. 1895 నవంబరు 8 న విద్యుదయస్కాంత తరంగాలలో వివిధ తరంగ దైర్ఘ్యలుల అవధులలో గల ఎక్స్- కిరణాలను కనుగొన్నాడు. ఈ పరిశోధన వల్ల 1991 లో భౌతిక శాస్త్రంలో మొదటి సారి నోబెల్ బహుమతి పొందాడు. ఆయన చేసిన కృషికి గాను ఆవర్తన పట్టిక లో 111 పరమాణు సంఖ్య గల మూలకానికి రాంట్ జీనియమ్ అనిపేరు పెట్టి గౌరవించారు. రాంట్జన్ 1845 మార్చి 27 న జర్మనీలోని లెన్నెస్ లో జన్మించాడు. ఈయన తండ్రి ఒక రైతు. తల్లి ఒక డచ్ మహిళ. హాలెండ్ లో విద్యాభ్యాసం జరిగింది. 1865 లో యుట్రెచ్ యూనివర్సిటీ లో చేరుటకు ప్రయత్నాలు ప్రారంభించాడు. కాని జూరిచ్ లో గల ఫెడెరల్ పాలిటెక్నిక్ సంస్థలో చేరి పరీక్షలను ఉత్తీర్ణుడయ్యాడు. అక్కడ మెకానికల్ ఇంజనీరుగా చేరాడు. 1869లో తత్వ శాస్త్రములో జూరిచ్ విశ్వ విద్యాలయం నుండి పి.హెచ్.డి పట్టాను పొందాడు. ఆ విశ్వ విద్యాలయంలో ప్రముఖ ప్రొఫెసర్ అయిన ఆగస్టు కుండ్ట్ కు ప్రియమైన శిష్యుడయ్యాడు. 1874 లో స్ట్రాస్ ఫర్డ విశ్వ విద్యాలయంలో అధ్యాపకునిగా నియమించ బడ్డాడు. 1875 లో హోహెనీం విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్ గా, తర్వాత 1876 లో స్ట్రాస్ ఫర్డ విశ్వ విద్యాలయంలో మరల అధ్యాపకునిగా, 1888 లో గీసన్ విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర ఆచార్యునిగా, తర్వాత వుర్జ్ బర్గ్ విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో విధులు నిర్వర్తించాడు. 1900లో ప్రభుత్వ అభ్యర్థనపై మంచ్ యూనివర్సిటీలో చేరాడు. ఆయన కుటుంబం యు.ఎస్.ఎకు వలస వెళ్ళాలని నిర్ణయించు కున్నారు. న్యూయార్క్ లో కొలంబియా యూనివర్సిటీ వారు అవకాశం యిచ్చినప్పటికీ మొదటి ప్రపంచ యుద్ధం కారణంగా తన శేష జీవితాన్ని మునిచ్ నందే గడిపాడు. 1895 వరకు ఉత్సర్గనాళ ప్రయోగాలలో హెర్ట్జ్, జాన్ హిటార్ఫ్, విలియం క్రూక్స్, టెస్లా,లీనార్డో లతో పని చేశాడు. ఎక్స్ కిరణాలను రాయింట్ జన్ కిరణాలని అంటారు. కాని రాంట్జెన్ స్వయంగా వాటిని ఎక్స్ కిరణాలని పిలిచాడు. ఈ కిరణాలను కనుగొని లోకానికి పరోపకారం చేసినందుకు కృతజ్ఞతగా ఆయనకు 1901 లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభ్యమయింది. ఈ ఎక్స్ రే వెనుక ఎంతో ఆసక్తి కరమైన కథ ఉంది. రాయింట్ జన్ కేథోడ్ రే ట్యూబ్ (శూన్య గాజు నాళం) తో పరిశోధనలు చేసేవాడు. గది అంతా చీకటిగా ఉన్నప్పుడు యీ ట్యూబ్ గుండా కాంతి కిరణాలను పంపడం జరిగింది. పైగా ట్యూబ్ చుట్టూ నల్లని కాగితాన్ని కాంతి కిరణాలు ఏ కొంచెం కూడా వెలువడ కుండా కప్పి ఉంచాడు. ఇలా చేసినప్పటికి కాథోడ్ ట్యూబ్ కు సమీపంలో ఉన్న బేరియం ప్లాటినో సైనైడ్ స్ఫటికం వింత మెరుపులతో ప్రకాశించ సాగింది. నల్లటి కాగితాన్ని కప్పి ఉంచినప్పటికీ కాథోడ్ ట్యూబ్ నుంచి ఏవో అజ్ఞాత కిరణాలు వెలువడి బేరియం ప్లాటినో సైనైడ్ స్ఫటికం మీద పడి అది మెరిసేటట్లు చేసిందని ఆయన ఊహించగలిగాడు. ఈ కిరణాలను కాగితం గుండా, చెక్కగుండా, లోహపు పలకల గుండా ప్రయాణం చేయగలవని యీయన కనుగొన్నాడు. ఈ కిరణాలు కూడా ఓ రకమైన కాంతి కిరణాలే అని అయితే వీటి తరంగ దైర్ఘ్యం చాలా తక్కువ కావటం వల్ల మనుషుల కళ్ళకు కనిపించవని రాయింట్జన్ వెల్లడించాడు. మామూలు కాంతి కిరణాలే ఫోటోగ్రాఫిక్ ప్లేట్ల మీద ప్రభావం చూపుతూ ఉండగా, యీ కిరణాలు మాత్రం చూపకుండా ఉంటాయా అనే ఆలోచన రాయింట్ జెన్ కి రావటం – శాస్త్ర ప్రపంలో ఒక సరికొత్త అధ్యాయానికే కారణ భూతమైనది. ప్రయోగం చేయటం కోసం రాంట్జెన్ ఫోటో గ్రాఫిక్ ప్లేటు మీద తన భార్య చేతిని ఉంచి యీ కిరణాలను ప్రసారం చేసి ఫోటోను డెవలప్ చేసి చూసి ఆశ్చర్య పోయాడు. చేతి ఎముకలు ఉంగరంతో సహా ఆ ఫోటో లో వచ్చింది. చుట్టూ మాంసం ఉన్నట్లు మసక మసకగా ఉంది. అంటే సజీవంగా ఉన్న మనిషి కంకాళాన్ని ఈ కిరణాల ద్వారా ఫోటో తీయవచ్చని స్పష్టంగా తేలింది. దురదృష్ట వశాత్తు రాంట్జెన్, ఆయనతో కలిసి పనిచేసిన మరో ఇద్దరు పరిశోధకులు యీ ఎక్స్ కిరణాల తాకిడికే క్రమ క్రమంగా మరణించాడు. ఈ ఎక్స్-కిరణాల వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతున్నప్పటికీ వాటిని మితిమీరి వాడితే మాత్రం ప్రమాదం తప్పదని,యీ కారణంగానే ఎక్స్-కిరణాలను నిరంతరం గురి కాబట్టే రాంట్జెన్ ఆ కిరణాల ప్రభావంగానే చని పోయాడని రుజువైంది. రేడియో ధార్మికత నుండి రక్షించు కొనుటకు సీసపు కవచాలు వాడే కొద్దిమంది మార్గ నిర్దేశకులో ఆయన ఒకరు. ఆయన చేసిన ఆవిష్కరణలకు పేటెంట్ హక్కులు కూడా తీసుకోలేదు. నోబెల్ బహుమతిగా వచ్చిన ధనమును వర్జ్ బర్గ్ విశ్వ విద్యాలయమునకు విరాళంగా యిచ్చాడు. మొదటి ప్రపంచ యుద్ధం వల్ల యేర్పడే ద్రవ్యోల్బణం వల్ల రాంట్జెన్ చాలా పేదరికంలో మగ్గాడు. తన శేష జీవితాన్ని మునిచ్కి సమీపంలో గల విల్ హెల్మ్ లో గల యింటిలో గడిపాడు. ఆయన కోరిక ప్రకారం ఆయన వ్యక్తిగత, శాస్త్రమునకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఆయన మరణం తర్వాత నాశనం చేయటం జరిగింది. 1901 లో రాంట్జెన్ కు మొదటి భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి వచ్చింది. ఈ బహుమతి ఆయన ఎక్స్ కిరణాలు కనుగొని విశేష సేవలందించినందుకు గాను యివ్వ బడింది. కాని రాంట్ జెన్ ఆ బహుమతికి వచ్చిన ఆర్థిక ప్రతిఫలాన్ని తన విశ్వ విద్యాలయమునకు దానమిచ్చాడు. పియరీ క్యూరీ వలే రాంట్జెన్ తన పరిశోధనకు పేటెంట్ హక్కులను తిరస్కరించాడు. మానవాళికి తన పరిశోధన యొక్క ఫలితాలు ఉపయోగకరంగా ఉండాలని, ఈ కిరణాలకు తన పేరు కూడా పెట్టరాదని కోరుకున్నాడు.

### ఇంటర్‌నెట్ వినియోగంలో తగు జాగ్రత్తగా తీసుకోలేమా !

ఆధునిక మానవుడు అంతర్జాల వలయంలో మునిగి తేలుతున్నాడు. స్మార్ట్‌ఫోన్ రాకతో అతి సామాన్యుల ముంగిట్లో కూడా ఇంటర్నెట్ ప్రవేశించింది. మితిమీరిన వాడకంతో ఇంటర్నెట్ దురలవాటు బారిన కూడా యువత, పిల్లలు పడడం చూస్తున్నాం. అంతర్జాల రాకతో విశ్వ విజ్ఞానం మన అరచేతిలో ఇమిడి పోయింది. అంతర్జాలంతో అసంఖ్యాక ప్రయోజనాలు ఉన్నప్పటికీ దాని పట్ల జాగ్రత్తగా ఉండని యెడల పలు ప్రమాదకర నష్టాలు కూడా మన అనుభవంలోకి వస్తున్నాయి. అసభ్యకర అవమానకర మాటలను వినవలసి వస్తున్న వేళ సురక్షిత ఇంటర్నెట్ పట్ల అవగాహన కల్పించాల్సిన అగత్యం ఏర్పడింది. అంతర్జాలం వాడడం తప్పనిసరి అవుతున్న దాని పట్ల కనీస పరిజ్ఞానం, తగు జాగ్రత్తలు తీసుకోవడం కనీస అవసరం అవుతున్న వేళ ఇంటర్నెట్‌ను సురక్షితంగా వినియోగించుకునే మార్గాలను అవగాహన పరచడానికి 2004 నుంచి ప్రతి ఏట 10 ఫిబ్రవరిన ప్రపంచ దేశాలు "సురక్షిత అంతర్జాల దినం" లేదా "సేఫర్ ఇంటర్నెట్ డే"పాటించడం ఆనవాయితీగా మారింది. నేటి సమాజంలో విద్యాలయాలు, కుటుంబాలు, బంధు మిత్రులు, సహచర వర్గాలు, పౌర సమాజాల్లో సురక్షితంగా అంతర్జాలాన్ని ఎలా వినియోగించాలో ప్రజలకు, విద్యార్థులకు తెలుపవలసిన అవసరం వచ్చింది. ఆన్‌లైన్‌లో గౌరవంగా మాట్లాడడం, సత్ప్రవర్తనతో వినియోగించడం, సహానుభూతి ప్రదర్శించడం, హానికరమైన చర్యలకు దూరంగా ఉండడం లాంటివి మనం ఆచరణలో పెట్టాలి. సురక్షిత అంతర్జాల దినం-2026 ఇతివృత్తంగా "అందరు కలిసి సురక్షిత అంతర్జాలాన్ని నిర్మించుకుందాం" అనబడే అంశాన్ని తఈసుకున్నారు. అంతర్జాల ప్రధాన దుర్వినియోగాల్లో సైబర్ బుల్లీయింగ్, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, ఫిషింగ్ స్కామ్, డాటా బ్రీచింగ్, అనధికారిక చొరబాట్లు, మాల్‌వేర్, ఆన్‌లైన్ గేమింగ్, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, ఆన్‌లైన్ ప్రిడేటర్స్, సెక్స్టింగ్, రాన్సమ్‌వేర్, సైబర్ క్రైమ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు, ఆన్‌లైన్ అప్పుల వేధింపులు, డిజిటల్ అరెస్టులు, వ్యక్తిగత సమాచారాన్ని దోచేసి వేధించడం లాంటి పలు అంశాల పట్ల తగు జాగ్రత్తగా ఉండడం అనివార్యం అయ్యింది. వీటి పట్ల అవగాహన లేని యెడల పలు చిక్కులను ఎదుర్కోవలసి వస్తుందని తెలుసుకోవాలి.

# ఆర్ఎస్ఎస్ వల్లే బీజేపీకి 'అచ్ఛే దిన్'

దేశంలో బీజేపీ అప్రతిహత విజయాలకు ఆర్ఎస్ఎస్ విధానాలే కారణమని, సంఘ్ వల్లే బీజేపీకి అచ్ఛే దిన్ వచ్చాయని మోహన్ భగవత్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముంబైలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడంతో ఆర్ఎస్ఎస్ కు అచ్ఛే దిన్ వచ్చాయన్న వ్యాఖ్యలపై భగవత్ స్పందించారు. నిజానికి బీజేపీ అధికారంలోకి రావడానికి, ఆ పార్టీకి మంచి రోజులు రావడానికి కారణం ఆర్ఎస్ఎస్ అని చెప్పారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం విషయంలో సంఘ్ పట్టుదలగా వ్యవహరించడం, ఈ ఉద్యమానికి సహకరించిన పార్టీలకు ప్రయోజనం కలిగిందని పేర్కొన్నారు. దీంతోపాటు స్వయంసేవకుల కఠోర శ్రమ కూడా ఉందని భగవత్ స్పష్టం చేశారు.

**సావర్కర్‌కు భారతరత్నపై..**

హిందుత్వ సిద్ధాంతకర్త వీర్ సావర్కర్‌కు 'భారతరత్న' ఇవ్వాలనే డిమాండ్‌పై భగవత్ స్పందించారు. అవార్డు



కమిటీలో తాను లేనని చెబుతూ.. ఆ కమిటీలో ఉన్న వారిని కలిస్తే ఈ విషయం తప్పకుండా ప్రస్తావిస్తానని చెప్పారు. నిజానికి సావర్కర్ కు భారతరత్న ఇస్తే ఆ అవార్డుకే ఖ్యాతి పెరుగుతుందని చెప్పారు. ఎలాంటి పురస్కారాలు పొందకున్నా కూడా సావర్కర్ కోట్లాది భారతీయుల హృదయాల్లో చక్రవర్తిగా నిలిచారని భగవత్ కొనియాడారు.

**ఉపాధి కల్పనపై..**

భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి 'మాస్ ప్రొడక్షన్' (భారీ ఉత్పత్తి) కంటే 'ప్రొడక్షన్ బై మాసెస్' (ప్రజల భాగస్వామ్యంతో ఉత్పత్తి) జరగాలని భగవత్ పిలుపునిచ్చారు. ఒకేచోట భారీగా ఉత్పత్తి చేయడం కంటే ఎక్కువ చోట్ల చిన్న తరహా ఉత్పత్తి జరిపితే వస్తువుల ధరలు తగ్గుతాయని చెప్పారు. అప్పుడు కంపెనీల మధ్య పోటీ ధరలపై కాకుండా వస్తువుల నాణ్యతపైకి మారుతుందని వివరించారు. నాణ్యత బాగుండేలా జాగ్రత్త పడితే మన వస్తువులకు విదేశాల్లోనూ డిమాండ్ పెరుగుతుందని తెలిపారు.

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై..**

మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతలను స్వాగతించాల్సిన అవసరం ఉందని మోహన్ భగవత్ చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి వాటిపై పట్టు సాధించాలని సూచించారు. అయితే, టెక్నాలజీ అనేది ఉద్యోగాలను హరించేదిగా ఉండకూడదని, ఉపాధికి భంగం కలగకుండా ఏఐని ఎలా ఉపయోగించుకోవాలో మనం నేర్చుకోవాలని ఆయన హితవు పలికారు.

# సెషెల్స్‌కు భారత్ భారీ ఆర్థిక చేయూత

హిందూ మహాసముద్ర ప్రాంతంలో వ్యూహాత్మకంగా కీలకమైన సెషెల్స్‌కు భారత్ భారీ ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. దీంతో రెండు దేశాల మధ్య సంబంధాలు బలపడుతున్నాయి. అయితే ప్రధాని నరేంద్ర మోదీ, సెషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ మధ్య ఢిల్లీలో తాజాగా జరిగిన ద్వైపాక్షిక చర్చల అనంతరం 175 మిలియన్ అమెరికన్ డాలర్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించారు. ఆ నిధులతో సెషెల్స్‌లో అభివృద్ధి, భద్రత, మౌలిక సదుపాయాల రంగాల్లో కీలక ప్రాజెక్టులు చేపట్టనున్నారు.

**సెషెల్స్ భారత్‌కు కీలక సముద్ర పొరుగుదేశం**

అయితే ఆరు రోజుల భారత పర్యటనలో భాగంగా హెర్మినీ మోదీతో సోమవారం మధ్యాహ్నం విస్తృతంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వాణిజ్యం, ఆర్థికాభివృద్ధి, సముద్ర భద్రత, సస్టైనబిలిటీ, వాతావరణ మార్పులకు అనుగుణ చర్యలు వంటి అంశాల్లో సహకారాన్ని పెంచుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. సెషెల్స్ భారత్‌కు కీలక సముద్ర పొరుగుదేశమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

**భౌగోళిక సంబంధమే కాదు!**

"భారత్- సెషెల్స్ బంధం భౌగోళిక సంబంధమే కాదు, చరిత్ర, విశ్వాసం, భవిష్యత్ దృష్టితో కూడిన భాగస్వామ్యం. సెషెల్స్ అవసరాల ప్రకారం అభివృద్ధి సహకారం అందిస్తున్నాం" అని మోదీ తెలిపారు. ప్రకటించిన 175 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.15,87,43,37,500) ప్యాకేజీ ద్వారా సామాజిక గృహ నిర్మాణం, ఈ-మొబిలిటీ, వృత్తి శిక్షణ, ఆరోగ్య సేవలు, రక్షణ, సముద్ర భద్రత రంగాల్లో ప్రాజెక్టులు అమలు చేయనున్నట్లు ప్రధాని చెప్పారు.

**ఇరు దేశాల సంబంధాల్లో ప్రధాన స్తంభాలు**

రక్షణ సహకారం, సముద్ర భద్రత ఇరు దేశాల సంబంధాల్లో ప్రధాన స్తంభాలని మోదీ స్పష్టం చేశారు. సెషెల్స్‌ను కొలంబో సెక్యూరిటీ కాన్క్లేవ్‌లో పూర్తి సభ్యదేశంగా స్వాగతించారు. దీని



వల్ల హిందూ మహాసముద్రంలో శాంతి, స్థిరత్వం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. బ్లూ ఎకానమీ రంగంలో భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు నిర్ణయం తీసుకున్నారు. సముద్ర పరిశోధన, డేటా షేరింగ్, సామర్థ్యాభివృద్ధి రంగాల్లో భారత్ తన నైపుణ్యాన్ని పంచుకోనుంది. పునరుత్పాదక శక్తి, వాతావరణ అనుకూల పరిష్కారాల్లో కూడా సహకారం పెంచాలని నిర్ణయించారు.

**అ అంశాల్లో ఒప్పందాలు ఖరారు**

డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో భారత్ సాధించిన విజయాలను సెషెల్స్‌తో పంచుకుంటామని ప్రధాని మోదీ చెప్పారు. చౌకగా నాణ్యమైన ఔషధాల సరఫరా, ఆరోగ్య మౌలిక సదుపాయాల అభివృద్ధి, మెడికల్ టూరిజం ప్రోత్సాహం వంటి రంగాల్లో కలిసి పనిచేయనున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాలు పలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఫార్మాకోపియల్ సహకారం, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, డిజిటల్ పరిష్కారాల జ్ఞాన భాగస్వామ్యం, ఆహార సరఫరా ఒప్పందాలు తదితర అంశాల్లో ఒప్పందాలు జరిగాయి.

**గాంధీజీ సిద్ధాంతాలు భారత్ సెషెల్స్ భాగస్వామ్యానికి మార్గదర్శకం**

ప్రజల మధ్య సంబంధాలే ఇరు దేశాల బలమని మోదీ అన్నారు. సెషెల్స్‌లో నివసిస్తున్న భారతీయులు అక్కడి సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. తరతరాలుగా స్నేహబంధాన్ని వారు మరింత బలపరుస్తున్నారని తెలిపారు. పర్యటనలో భాగంగా అధ్యక్షుడు హెర్మినీ రాజ్‌ఘాట్‌లో మహాత్మా గాంధీకి నివాళులు అర్పించారు. గాంధీజీ సిద్ధాంతాలు భారత్ సెషెల్స్ భాగస్వామ్యానికి మార్గదర్శకంగా ఉన్నాయని విదేశాంగ శాఖ పేర్కొంది.

**దౌత్య సంబంధాలకు 50 సంవత్సరాలు**

కాగా, 2025 అక్టోబరులో పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత హెర్మినీకి ఇదే తొలి భారత పర్యటన. అంతేకాకుండా ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలకు 50 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంలో ఆయన పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. తాజా ఆర్థిక ప్యాకేజీ, కొత్త ఒప్పందాలతో భారత్ సెషెల్స్ దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడుతూ కొత్త దశలోకి అడుగుపెడుతున్నట్లు తెలుస్తోంది.

# డిజిటల్ మోసాల కేసులను ఎదుర్కోవడానికి ఎస్ఓపీని రూపొందించండి

దేశంలో డిజిటల్ మోసాల ద్వారా రూ.54వేల కోట్లకు పైగా సొమ్ము దోపిడీకి గురికావడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది ముమ్మాటికీ "పచ్చి దోపిడీ, డెకాయిటీ" అని వ్యాఖ్యానించింది. ఇలాంటి కేసులను ఎదుర్కోవడానికి ఆర్‌బీఐ, బ్యాంకులు, టెలికాం శాఖలతో సంప్రదించి, ఒక పక్కా 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్' (ఎస్ఓపీ) రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించింది.

**చిన్న రాష్ట్రాల బడ్జెట్ కంటే ఎక్కువే!**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం సుమోటోగా ఈ కేసు విచారణను చేపట్టింది. "బ్యాంకులు కేవలం లాభాపేక్షతో, వ్యాపార ధోరణిలో ఉండి, నేరగాళ్లు సులభంగా దోపిడీ సొమ్మును తరలించడానికి వేదికలుగా మారుతున్నాయి" అని జస్టిస్ బాగ్చీ అన్నారు. 2021 ఏప్రిల్ నుంచి 2025 నవంబర్ మధ్య మన దేశంలో ఏకంగా రూ.52వేల కోట్ల సైబర్ మోసాలు జరిగినట్లు హోంశాఖ నివేదిక పేర్కొన్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇది 'అనేక రాష్ట్రాల వార్షిక బడ్జెట్ కంటే ఇది చాలా ఎక్కువ మొత్తం' అని సీజేఐ సూర్యకాంత్ అన్నారు. కాగా, ఈ డిజిటల్ మోసాలు బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్ల లేదా నేరగాళ్లతో సహకరించడం వల్ల జరిగి ఉండవచ్చని ధర్మాసనం అనుమానం వ్యక్తం చేసింది. డిజిటల్ అరెస్టుల పట్ల ఆర్‌బీఐ, బ్యాంకులు సకాలంలో స్పందించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది.

**సుప్రీంకోర్టు ఆదేశాలు**

ఆర్‌బీఐ, టెలికాం శాఖ రూపొందించిన నిబంధనలను పరిగణనలోకి తీసుకుని, ఈ నేరాలను సమర్థవంతంగా అరికట్టడానికి నాలుగు వారాల్లోగా ఒక ముసాయిదా ఒప్పందాన్ని సిద్ధం చేయాలని హోం మంత్రిత్వ శాఖను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. అలాగే దేశవ్యాప్తంగా నమోదైన డిజిటల్ అరెస్ట్ కేసులను గుర్తించాలని సీబీఐని ఆదేశించింది. అలాగే, ఈ కేసుల్లో విచారణ జరిపేందుకు సీబీఐకి అవసరమైన అనుమతులను వెంటనే మంజూరు చేయాలని ఢిల్లీ, గుజరాత్ ప్రభుత్వాలకు స్పష్టం చేసింది.



డిజిటల్ అరెస్ట్ బాధితులకు పరిహారం అందించే విషయంలో ఉదారంగా, ఆచరణాత్మక దృక్పథంతో వ్యవహరించాలని సుప్రీంకోర్టు సూచించింది. పరిహారం చెల్లింపుపై ఒక ఫ్రేమ్‌వర్క్ సిద్ధం చేయడానికి ఆర్‌బీఐ, టెలికాం శాఖ సంయుక్తంగా సమావేశం కావాలని ఆదేశించింది.

**బ్యాంకులపై ధర్మాసనం ఆగ్రహం**

సైబర్ మోసాల నివారణలో బ్యాంకులు క్రియాశీలక పాత్ర పోషించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. "కోట్లాది రూపాయల టర్నోవర్ ఉన్న వ్యాపార సంస్థల ఖాతాల్లో భారీ లావాదేవీలు జరిగితే అనుమానం రాకపోవచ్చు. కానీ కేవలం రూ.15-20 వేల పెన్షన్ తీసుకునే వ్యక్తి ఖాతా నుంచి ఒక్కసారిగా రూ.50 లక్షలు లేదా కోటి రూపాయలు విత్‌డ్రా అవుతుంటే, మీ ఏఐ టూల్స్ ఎందుకు అలర్ట్ చేయడం లేదు?" అని సీజేఐ సూర్యకాంత్ ప్రశ్నించారు.

**ఏఐ వాడండి!**

ఈ కేసులో అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ అడ్వకేట్ ఎన్.ఎస్.నప్పినై తన వాదనలు వినిపిస్తూ, "అనుమానాస్పద లావాదేవీలను గుర్తించడానికి బ్యాంకులు కృత్రిమ మేధ (ఏఐ)ని ఉపయోగించాలి" అని సూచించారు. కేవలం ఆర్‌బీఐ సర్క్యులర్లు జారీ చేస్తే సరిపోదని, నిబంధనలు పాటించని బ్యాంకులపై జరిమానాలు విధిస్తేనే ఫలితం ఉంటుందని ఆమె అన్నారు.

**డిజిటల్ అరెస్ట్ అంటే ఏమిటి?**

డిజిటల్ అరెస్ట్ అనేది ప్రస్తుతం వేగంగా విస్తరిస్తున్న ఒక సైబర్ నేరం. ఇందులో నేరగాళ్లు తాము పోలీస్ ఆఫీసర్లమని, కోర్టు లేదా ప్రభుత్వ అధికారులమంటూ బాధితులను నమ్మిస్తారు. ఆడియో లేదా వీడియో కాల్స్ ద్వారా బాధితులను బెదిరించి, వారిని గృహ నిర్బంధంలో ఉన్నట్లు భ్రమ కలిగిస్తారు. తీవ్రమైన ఒత్తిడికి గురిచేసి వారి నుంచి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేస్తారు.

## తొలి ఎన్నికల బరిలో విజయ్..



నటుడు, తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ తన రాజకీయ అరంగేట్రానికి పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్నారు. రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. చెన్నైలోని విరుగంబాక్కం, మధ్య తమిళనాడులోని తిరుచ్చి తూర్పు స్థానాల నుంచి ఆయన బరిలోకి దిగనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇది పార్టీ విస్తరణతో పాటు వ్యవస్థాపకుడైన విజయ్‌కు బలమైన ఆరంభం ఇచ్చేందుకు రూపొందించిన వ్యూహమని టీవీకే నేతలు చెబుతున్నారు. చెన్నైలోని విరుగంబాక్కం నియోజకవర్గం పట్టణ ఓటర్లు, మొదటిసారి ఓటు వేయనున్న యువతలో విజయ్‌కు మంచి ప్రచారం కల్పిస్తుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు తిరుచ్చి తూర్పు నుంచి పోటీ చేయడం ద్వారా పార్టీ కేవలం చెన్నైకే పరిమితం కాదనే సంకేతాన్ని రాష్ట్రవ్యాప్తంగా పంపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వాస్తవానికి వెలచ్చేరి, విక్రవాండి, నాగపట్టణం వంటి నియోజకవర్గాలను కూడా పరిశీలించినా, ఓటర్లతో ఉన్న పరిచయం, క్షేత్రస్థాయిలో పార్టీ సన్నద్ధత ఆధారంగా విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు స్థానాలను ఖరారు చేసినట్లు సమాచారం. విజయ్ తొలిసారి ఎన్నికల్లో పోటీ చేస్తుండటం, అధికార డీఎంకే బలంగా ఉండటంతో గెలుపు అవకాశాలను పెంచుకునేందుకే రెండు చోట్ల పోటీ చేయాలనే జాగ్రత్తతో కూడిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు నియోజకవర్గాలకు డీఎంకే ఎమ్మెల్యేలు ఏ.ఎం.వి. ప్రభాకర రాజా, ఇనిగో ఎస్. ఇరుదయరాజ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఈ రెండు చోట్లా పోటీ ఆసక్తికరంగా మారనుంది. త్వరలోనే విజయ్ తన ప్రచార వ్యూహాలను ప్రకటించి, బహిరంగ సభలను ముమ్మరం చేయనున్నారు.

## చంద్రయాన్-4 దిగేది... అచ్చోటనే!




జాబిలి దక్షిణ ధ్రువంపై 2028లో 'విక్రమ్' ల్యాండర్ సురక్షితంగా దిగేందుకు చదరపు కిలోమీటరు విస్తీర్ణంలో ఉండే సమతల ప్రదేశాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు ఎంపిక చేశారు. 'చంద్రయాన్-2' ఉపగ్రహంలోని కెమెరా తీసిన ఛాయాచిత్రాలను విశ్లేషించి వారు ల్యాండింగ్ ప్రాంతంపై తాజా నిర్ణయం తీసుకున్నారు. చంద్రుడి ఉపరితలంపై ల్యాండర్ దిగాల్సిన ప్రదేశానికి సంబంధించి ఇస్రో శాస్త్రవేత్తలు ఐదు పారమితులు పెట్టుకున్నారు. అవి... ఆ ప్రదేశంలోని నేల వాలు 10 డిగ్రీల కంటే తక్కువ ఉండాలి. పెద్ద శిలలు అంతగా ఉండకూడదు. 11-12 రోజులపాటు నిరంతర సూర్యకాంతి అందుబాటులో ఉండాలి. అక్కడ బిలాలు (గోతులు) కూడా ఎక్కువగా ఉండరాదు. భూమితో నేరుగా రేడియో కమ్యూనికేషన్స్ అవకాశం ఉండాలి. ఇందుకోసం వారు చంద్రుడిపై 'మోన్స్ మౌటన్' పర్వతం చుట్టూ గల ఐదు ప్రదేశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఆ ఐదింటిలో ఒకటి శాశ్వత చీకటి ప్రదేశం కావడంతో దాన్ని పక్కనపెట్టారు. మిగతా నాలుగు స్థలాలకు ఎంఎం-1, ఎంఎం-3, ఎంఎం-4, ఎంఎం-5 అని పేర్లు పెట్టారు. వారి పరిశీలనలో వాటిలో ఎంఎం-4 సురక్షిత, ఆశాజనక స్థలంగా తేలింది. అందుకే చివరికి దాన్ని ఎంపిక చేశారు. ఈ స్థలం చంద్రుడి ఉపరితలంపై 84.289 డిగ్రీల దక్షిణ అక్షాంశం, 32.808 తూర్పు రేఖాంశం నడుమ ఉంది. దీని నేలపై సగటు వాలు 5 డిగ్రీలు మాత్రమే. అంటే దిగేటప్పుడు ల్యాండర్ పడిపోయే, దొర్లే అవకాశాలు తక్కువ. పైగా, ఈ ప్రదేశంలో చుట్టూ గల కొండల తాలూకు నీడ పడే అవకాశాలూ పరిమితం. తద్వారా విద్యుదుత్పత్తి కోసం ల్యాండర్ సౌరఫలకాలకు చాలినంత సూర్యకాంతి దొరుకుతుంది. ల్యాండింగ్ ప్రదేశం 'ఎంఎం-4'కు సంబంధించిన ఓవరాల్ రిస్క్ స్థాయిని 9.89 శాతంగా శాస్త్రవేత్తలు అంచనా వేశారు. ఎంఎం-1, ఎంఎం-3 ప్రదేశాల రిస్క్ స్థాయి 12 శాతం కంటే ఎక్కువ ఉంది. ఇక 'ఎంఎం-5' స్థలంలో ల్యాండింగ్ విషయంలో సేఫ్ గ్రిడ్స్ చాలా తక్కువగా ఉన్నాయి.అందుకే అంతిమంగా 'ఎంఎం-4'ను ఎంపిక చేశారు. చంద్రుడి ఉపరితలం నుంచి మట్టి, శిలలు సేకరించి వాటిని భూమికి తీసుకురావడం చంద్రయాన్-4 మిషన్ లక్ష్యం! ఇందుకోసం రోబోటిక్ ఆర్మ్స్, చోదక వ్యవస్థలను ఇస్రో అభివృద్ధి చేస్తోంది.

## ఎస్ఐఆర్ ప్రక్రియకు అడ్డంకులు రానివ్వం

బంగాల్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై నెలకొన్న వివాదాల వేళ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎస్ఐఆర్ ప్రక్రియను ఎవరూ అడ్డుకోవడానికి అనుమతించబోమని, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలు సహించబోమని అత్యున్నత న్యాయస్థానం హెచ్చరించింది. ఆ విషయంలో అవసరమైతే తగిన ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొంది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ ఎన్‌వీ అంజారియా నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహా పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై కోర్టు విచారణ జరిపింది. ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా పెద్ద ఎత్తున ఓటర్ల పేర్లు తొలగించే ప్రమాదం ఉందని, అర్హులైన ఓటర్లు తమ హక్కు కోల్పోయే అవకాశముందని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా భారీగా ఓట్ల తొలగింపు జరగొచ్చన్న అభిప్రాయాన్ని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన సీజేఐ, ఎస్ఐఆర్ ప్రక్రియకు ఎటువంటి అడ్డంకి రానివ్వమని, ఇది రాష్ట్రాలన్నీ గమనించాలని స్పష్టం చేశారు. విచారణ సందర్భంగా ఎన్నికల సంఘం (ఈసీ) సమర్పించిన అఫిడవిట్‌ను కోర్టు పరిశీలించింది. ఎన్నికల అధికారులు జారీ చేసిన నోటీసులను కొందరు దుండగులు కాల్చివేశారని ఈసీ ఆరోపించింది. ఇప్పటివరకు ఆ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని కూడా తెలిపింది. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఆ విషయంపై వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని బంగాల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)కు కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, "భారత రాజ్యాంగం దేశంలోని అన్ని రాష్ట్రాలకు సమానంగా వర్తిస్తుంది. ఎన్నికల ప్రక్రియను ఎవరూ దెబ్బతీయకూడదు" అని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సహకారం అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఇక, ఎస్ఐఆర్ ప్రక్రియలో సహాయంగా ఉపయోగించేందుకు బంగాల్ ప్రభుత్వం 8,505 గ్రూప్-బి అధికారుల జాబితాను ఎన్నికల సంఘానికి అందజేసింది. వీరికి శిక్షణ ఇచ్చి అవసరమైన చోట వినియోగించవచ్చని కోర్టు సూచించింది. అయితే తుది నిర్ణయాలు మాత్రం ఎన్నికల రోల్ అధికారుల చేతుల్లోనే ఉంటాయని బెంచ్ స్పష్టం చేసింది.

# రేవంత్ రెడ్డి మెదక్‌కు వచ్చేందుకు భయపడుతున్నాడు

-మొదటిపేజీ తరువాయి

ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణను తెచ్చిన కేసీఆర్‌ను రేవంత్ తిడుతున్నాడని హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం తెచ్చి అభివృద్ధి పథకాలు అమలు చేయడం కేసీఆర్ తప్పా అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్‌ను తిడితే ఓట్లు రావని.. పథకాలు అమలు చేస్తే వస్తాయని హితవుపలికారు. బూతులు మాట్లాడే రేవంత్‌కు పోలింగ్ బూత్‌లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పంద్రాగస్టుకల్లా రుణమాఫీ పూర్తి చేస్తానని దేవుళ్లపై రేవంత్ రెడ్డి ఒట్లు పెట్టిండని హరీశ్‌రావు గుర్తుచేశారు. మెదక్ రావాలంటే రేవంత్ రెడ్డికి భయం పట్టుకుందని హరీశ్‌రావు అన్నారు. అన్ని జిల్లాలు తిరుగుతున్న రేవంత్ రెడ్డి ఉమ్మడి మెదక్‌కు వచ్చేందుకు ముఖం లేదని విమర్శించారు. ఇక్కడ హరీశ్‌రావు ఉన్నాడని భయపడుతున్నాడని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, గ్యారంటీలు, గారడీలపై మెదక్ ప్రజలు నిలదీస్తారని ఇటువైపు చూడటం లేదని పేర్కొన్నారు. మెదక్‌లో రేవంత్ రెడ్డి ఒక్క వార్డులో కూడా గెలవడని తెలిపారు. రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ లేదు కానీ.. స్కామ్ క్యాలెండర్ అయితే ఇచ్చిండని విమర్శించారు. ప్రతి నెల ఏదో



ఒక కుంభకోణం తెరపైకి తీసుకొచ్చాడని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో రేవంత్ రెడ్డికి సురుకుపెట్టాలని అన్నారు. దుబ్బాక ఓటర్ల దెబ్బకు రేవంత్ రెడ్డికి దిమ్మ తిరగాలని అన్నారు. అలా కాకుండా కాంగ్రెస్‌కే ఓటేస్తే.. పథకాలు ఎగబెట్టినా నాకే ఓట్లు వేశారని రేవంత్ రెడ్డి అంటారని తెలిపారు. దుబ్బాకలో కాంగ్రెస్ ఏదైనా అభివృద్ధి చేస్తే చూపించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో డబ్బులు పంచి గెలవాలని రేవంత్ రెడ్డి అనుకుంటున్నాడని తెలిపారు. కేసీఆర్ ఇచ్చిన పథకాలు, అభివృద్ధితో పోలిస్తే ఈ డబ్బులు ఎంత అని ప్రశ్నించారు. దుబ్బాకలో బడి కట్టింది.. గుడి కట్టింది.. ఆస్పత్రి కట్టింది కేసీఆర్ అని గుర్తుచేశారు. రెండేళ్లలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. దుబ్బాకను ఇంకా అభివృద్ధి చేసే బాధ్యత తమదేనని హామీ ఇచ్చారు. ఆరు గ్యారంటీలు అమలు కావాలంటే రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి నోరు విప్పితే బూతులు తప్ప మంచిమాట రాదని అన్నారు. కేసీఆర్ హయాంలో భూముల విలువ పెరిగిందని హరీశ్‌రావు తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక భూముల ధరలు తగ్గడమే కాదు.. తెలంగాణ ప్రతిష్ట కూడా దిగజారిందని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి చేతిలో మోసపోని మనిషే లేదని పేర్కొన్నారు. హామీలు, గ్యారంటీల పేరుతో మోసం చేసి కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చారని విమర్శించారు. తెలంగాణ భవిష్యత్ గురించి ఆలోచించి ఓటేయాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డికి చురుకు తగిలితేనే పథకాలు అమలవుతాయని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృ ద్ధికి కారు గుర్తుపై ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

# కమిషనర్ల ఏర్పాటుకు కసరత్తు

**హైదరాబాద్ :** అధికారికంగా గ్రేటర్ హైదరాబాద్? మున్సిపల్ కార్పొరేషన్ మూడు మహా నగరపాలక సంస్థలుగా ఏర్పాటు కాలేదు గానీ పరిపాలన మాత్రం ఆ మేరకు మెల్లగా పట్టాలెక్కుతున్నట్లు కనబడుతుంది. మూడు జోన్లకు ఓ అదనపు కమిషనర్ చొప్పున నియమించిన ఆ ఇద్దరు అధికారులకు శనివారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ పరిపాలన బాధ్యతలపై స్పష్టమైన వివరాలను ఇచ్చారు. మీకు కేటాయించిన జోన్లకు సంబంధించిన పరిపాలన వ్యవహారాలను చక్కదిద్దుకోవాలని, జోనల్ కమిషనర్లతో పని చేయించుకోవడం మీ బాధ్యతే అని టెలీ కాన్ఫరెన్స్‌లో వారికి పలు రకాల సూచనలు చేశారు. కొనసాగింపుగా ఆయా జోన్ల పరిపాలన, ఆర్థిక, టౌన్ ప్లానింగ్ విభాగాలకు ఉన్నతాధికారులను సైతం నియమించారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీలో 12 జోన్లు, వాటి పరిధిలో 60 సర్కిళ్లు ఉన్నాయి. జీహెచ్ఎంసీ పరిధి శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, ఖైరతాబాద్, సికింద్రాబాద్, గోల్కొండ జోన్లకు పరిమితం కానుంది. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్లతో గ్రేటర్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీసీఎంసీ), మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్బీనగర్ జోన్లతో గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(జీఎంఎంసీ) ఏర్పాటవుతాయని తెలుస్తోంది. జీఎంఎంసీ పరిధి అదనపు కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, జీసీఎంసీ పరిధికి ప్రస్తుత అదనపు కమిషనర్ సృజనని కమిషనర్లుగా నియమిస్తూ పాలకమండలి పూర్తయ్యాక ఉత్తర్వు వెలువడుతుందని విశ్వసనీయ వర్గాల సమాచారంనూతన గ్రేటర్ కార్పొరేషన్ల టౌన్ ప్లానింగ్ వ్యవహారాల నిర్వహణను ఇద్దరు డైరెక్టర్ హోదాలో ఉన్న అధికారులకు అప్పగిస్తూ కమిషనర్ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై ఆయా జోన్ల పరిధిలోని నిర్మాణ అనుమతుల దరఖాస్తులు వారి ద్వారానే కమిషనర్ పర్మిషన్?కు వెళ్లనున్నాయి. విలీనంతో 300 డివిజన్ల పరిధిలోని నగరానికి 20శాతం మేర ఉద్యోగుల కొరత ఏర్పడింది. పారిశుద్ధ్య, టౌన్‌ప్లానింగ్ విభాగాల్లో ఎక్కువ ఖాళీలు ఉన్నాయని అధికారులు లెక్కలను తేల్చారు. మరో 1,500 మంది అవసరమని, ఉన్నతాధికారులతో తక్షణమే కమిటీ వేయాలని నిర్ణయించారు. జీహెచ్?ఎంసీ పాలకమండలి గడువు వచ్చే ఫిబ్రవరి 10తో ముగియనుంది. తర్వాత 300 డివిజన్లను మూడు భాగాలుగా చేసే ప్రక్రియ అధికారికంగా




మొదలుకానుంది. మార్చి లేదా ఏప్రిల్‌లో ఎన్నికలు ఉంటాయనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. జులై నాటికి నిర్వహించకపోతే 2027 వరకు జరిగే అవకాశం ఉండదని సంబంధిత అధికారులు పలు విశ్లేషణలు చేస్తున్నారు. జనగణన పూర్తవుతుందని, కొత్త జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన చేపట్టి ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని చెబుతున్నారు. వంద, రెండు వందలు కాదు. ఏకంగా 4 వేలకుపైగా ఫిర్యాదులు జీహెచ్?ఎంసీ విస్తరణ సమస్యపై బుట్ట దాఖలయ్యాయి. డివిజన్లు పెంచండి, హద్దులు మార్చండంటూ రాజకీయ నేతలు, శివారు ప్రాంత ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను జీహెచ్ఎంసీ నిర్మొహమాటంగా తిరస్కరించడం పట్ల వారిలో ఆందోళన నెలకొంది. అందులో 90 శాతం అర్జీలు వేర్వేరు రాజకీయ పార్టీల నేతలవి కావడం గమనార్హం. ముందుగా నిర్ణయించుకున్నట్లుగానే డివిజన్ల పునర్విభజనను పూర్తి చేశారనే విమర్శలు పెద్ద ఎత్తున వినిపస్తున్నాయి. జనాభా, విస్తీర్ణం దృష్ట్యా సమతూకం పాటించలేదని కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలే కాకుండా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కూడా జీహెచ్?ఎంసీ విస్తరణను సవరించాలని కోరుతున్నారు. ఈ విస్తరణతో జీహెచ్ఎంసీ పరిధితో సరిపడా భూలభ్యత, రవాణా, నివాసం, వర్షపు నీటి పారుదల, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో సమగ్ర మెట్రోపాలిటన్ ప్రణాళికలు అమలు చేసే అవకాశం ఉంది. అలాగే కొత్తగా విలీనమైన ప్రాంతాలకు జీహెచ్ఎంసీ నిధులు, సాంకేతిక నైపుణ్యం, పారిశుధ్యం, దోమల నివారణ, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్రజారోగ్యం, అత్యవసర సేవలు వంటి ప్రామాణిక పౌర సేవలు మరింత మెరుగ్గా అందే అవకాశం ఉంది. ప్రపంచస్థాయి మెట్రోపాలిటన్ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే దిశగా ఈ ప్రక్రియ కీలక ఘట్టమని ప్రభుత్వం భావిస్తోంది.

# పోటీలోనూ..ఆమెదే రాజ్యం... 50 శాతానికి మించి బరిలో మహిళలు

**హైదరాబాద్ :** తెలంగాణలో మరోసారి ఎన్నికల సందడి మొదలైంది. రాష్ట్రంలో 11వ తేదీన జరగనున్న ఏడు నగర పాలక సంస్థలు, 116 పురపాలక సంఘాల ఎన్నికల్లో మొత్తం 12,944 (ఏకగ్రీవాలతో కలిపి) మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. పురపాలక ఎన్నికల్లో పురుష అభ్యర్థుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు. మొత్తం పోటీదారుల్లో 6,508 మంది (50.27శాతం) మహిళా అభ్యర్థులు ఉన్నారు. పురుష అభ్యర్థులు 6,436 (49.73 శాతం) మంది.

నగరపాలికల్లో అత్యధికంగా కరీంనగర్‌లో 66 డివిజన్లకు 398 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు.

పురపాలికల్లో ఆదిలాబాద్‌లో అత్యధికంగా 49 వార్డులకు 314 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అత్యల్పంగా కొడంగల్ మున్సిపాలిటీలో 12 వార్డులకు 34 మంది మాత్రమే ఎన్నికల బరిలో నిలిచారు.

నగరపాలికల పరంగా పరిశీలిస్తే మహబూబ్‌నగర్‌లో అత్యధికంగా 127 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. పురపాలికల్లో ఆదిలాబాద్‌లో 93 మంది పోటీలో నిలిచారు. ఈ మేరకు అభ్యర్థుల జాబితాను తెలంగాణ ఎన్నికల సంఘం విడుదల చేసింది. పార్టీల వారీగా పోటీ చేసే స్థానాలు : రాష్ట్రవ్యాప్తంగా ఏ పార్టీ ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తోందనే వివరాలను కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. 2,948 (98.3 శాతం) స్థానాల్లో అధికార కాంగ్రెస్? పార్టీ పోటీచేస్తోంది. భారత రాష్ట్రసమితి? 2,878 స్థానాల్లో (96 శాతం), బీజేపీ 2,634 (87.3 శాతం), ఇండిపెండెంట్ అభ్యర్థులు 2,786 (94 శాతం), జనసేన పార్టీ 332 స్థానాల్లో (11.1 శాతం), మజ్లిస్ 282 (9.4శాతం), ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ 288 (11.1శాతం), బీఎస్పీ 213 (7.1శాతం), సీపీఐ 168 (5.6 శాతం), సీపీఎం 108 ( 4.2శాతం), ఆప్ 38 (1.2 శాతం), ఐయూఎంఎల్ 9 (0.3శాతం) స్థానాలకు పోటీ చేస్తున్నాయి.



**కార్పొరేషన్లు, పురపాలికలవారీగా :** ఏడు కార్పొరేషన్ల పరిధిలో 414 డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 2,225 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. పురపాలికల వారీగా చూస్తే 116లో 10,719 మంది పోటీ చేస్తున్నారు.

**అభ్యర్థుల విద్యార్హతలు :** నగర, పురపాలక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వారిలో కొంతమంది నిరక్షరాస్యులున్నారు. ఆ వివరాలు ఇవే

| విద్యార్హత | సంఖ్య |
|---|---|
| పోస్టు గ్రాడ్యుయేట్లు | 775 |
| గ్రాడ్యుయేట్లు | 2,903 |
| అండర్ గ్రాడ్యుయేట్లు | 7,917 |
| నిరక్షరాస్యులు | 1,291 |

: నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల ఎన్నికల్లో 14 మంది ఏకగ్రీవమైనట్లుగా ఎస్?ఈసీ( రాష్ట్ర ఎన్నికల సంఘం) ప్రకటించింది. ఇందులో ఇద్దరు నగరపాలికల పరిధిలోని వారు కాగా 12 మంది పురపాలికల్లోని అభ్యర్థులు. మొత్తం 14లో 12 మంది అధికార కాంగ్రెస్ అభ్యర్థులు కాగా ఇద్దరు బీఆర్ఎస్? పార్టీకి చెందిన వారని ఎస్?ఈసీ పేర్కొంది. హస్తం పార్టీకి రెండు డివిజన్లు ఏకగ్రీవమయ్యాయి. మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లోని 58వ డివిజన్‌లో రమాదేవి, రామగుండం కార్పొరేషన్‌లోని ఒకటో డివిజన్‌లో మాడిపల్లి విజయలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పలుచోట్ల పురపాలికల్లో అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్?ఈసీ) ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ తరఫున చౌటుప్పల్‌లో చింత ఉమామహేశ్వరి అనే అభ్యర్థి (17వవార్డు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హాలియాలో పిల్లి చంద్రకళ(10), ఎదులాపురంలో తమ్మినేని మంగతాయి(15), హుజూర్‌నగర్‌లో నాగలక్ష్మి(3), కోదాడలో దేవరపల్లి మల్లేశ్వరి(11), వై.కుసుమకుమారి(31), కట్టెబోయిన జ్యోతి(21), మెదక్‌లో గొడల మానస(32), వికారాబాద్‌లో అనంతరెడ్డి(1), యాదగిరిగుట్టలో గుండిపల్లి వాణి (10)లు ఎన్నిక ఏకగ్రీవమైంది. బీఆర్ఎస్? తరఫున అలంపూర్‌లో విక్రం(10), వికారాబాద్‌లో విజయలక్ష్మి (15వ వార్డు) ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎస్?ఈసీ వెల్లడించింది.

## ముగబోయిన మైకులు!

-మొదటిపేజీ తరువాయి

గత నెల 27న ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఇప్పటికే పోలీసులు 2 కోట్ల రూపాయలకు పైగా సొత్తు జప్తు చేశారు. నగలు, నగదు, మద్యం, మత్తుపదార్థాలు, ట్యాబ్‌లు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ కోసం 8,203 పోలింగ్ కేంద్రాలు, 16,031 బ్యాలెట్ బాక్సులు, 137 స్ట్రాంగ్‌రూమ్‌లు, 136 ఓట్ల లెక్కింపు కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. అలాగే 742 మంది జోనల్ అధికారులు, 279 ఫ్లయింగ్ స్క్వాడ్, 381 స్క్వాడ్ బృందాలు, 1,370 రిటర్నింగ్ అధికారులు, 1,547 ఏఆర్‌వోలు, 9వేల 560 పోలింగ్ అధికారులు, 31 వేల 428 మంది సిబ్బందిని నియమించి శిక్షణ ఇచ్చారు. పురపాలక, నగరపాలక సంస్థల ఎన్నికల కోసం సుమారు 25 వేల మంది పోలీసు సిబ్బందిని సిద్ధం చేశారు. పోలీసులతో పాటు ఎక్సైజ్, ఫారెస్టు సిబ్బందిని భద్రతలో వినియోగించనున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేశారు. ఎక్కడైనా రీపోలింగ్ అవసరమైతే మరుసటి రోజున నిర్వహిస్తారు. ఈనెల 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్లు లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు.

**ఏ పార్టీ నుంచి ఎంతమంది పోటీచేస్తున్నారంటే**

రాష్ట్రవ్యాప్తంగా 2982 వార్డుల్లో 12,930 మంది భవితవ్యం తేలనుంది. రాష్ట్రవ్యాప్తంగా 22,519 మంది అభ్యర్థులు 29,742 నామినేషన్లు వేశారు. అయితే నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తర్వాత 12,944 మంది బరిలో మిగిలారు. అందులో రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది మున్సిపాల్టీలు, రెండు కార్పొరేషన్లలో 14 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పన్నెండు మంది కాంగ్రెస్ ఇద్దరు బీఆర్ఎస్ అభ్యర్థులు ఏకగ్రీవాలు సాధించారు. కోదాడ మున్సిపాల్టీలో ముగ్గురు వికారాబాద్‌లో ఇద్దరు ఎన్నిక లేకుండానే కౌన్సిలర్లయ్యారు. మహబూబ్‌నగర్, కరీంనగర్ కార్పొరేషన్‌లలో ఒకరు చొప్పున ఏకగ్రీవమయ్యారు. ఆలంపూర్, వికారాబాద్ మున్సిపాల్టీల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలవగా మిగతా 12 చోట్ల కాంగ్రెస్ నాయకులకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లలోని 2,996 వార్డుల్లో కాంగ్రెస్ 2,948, బీఆర్ఎస్ 2,634, బీజేపీ 2,634 వార్డుల్లో పోటీలో ఉంది. రాష్ట్రంలోని అన్ని వార్డుల్లో కలిపి 2,786 మంది ఇండిపెండెంట్లు బరిలో నిలిచారు. ఆమ్ ఆద్మీ పార్టీ 38, బీఎస్పీ 213, సీపీఎం 128, ఎంఐఎం 282, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ 288, సీపీఐ 168, జనసేన 332 స్థానాల్లో పోటీలో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు యాభైరెండున్నర లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో పురుషుల కంటే మహిళ ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. 32 జిల్లాల్లోని 7 కార్పొరేషన్లు, 116 కార్పొరేషన్లలోని 2,996 వార్డుల్లో కలిపి పురుష ఓటర్లు 25 లక్షల62 వేల 369 ఉండగా మహిళలు 2680014 మంది, థర్డ్‌జెండర్లు 640 ఓటర్లు ఉన్నట్లు ఎస్ఈసీ వెల్లడించింది. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో 52 లక్షల 43023 మంది ఓటర్లు ఉన్నారు.

## దక్షిణాదిపై కేంద్రం వివక్ష

-మొదటిపేజీ తరువాయి

ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకు రావాల్సిన నిధులు సహజంగానే వస్తాయని, వీరు తేవడమేమిటని అన్నారు. ప్రత్యేకంగా వారు ఏమైనా నిధులు తెస్తే చెప్పుకోవాలని అన్నారు. తెలంగాణ కేంద్రానికి రూపాయి చెల్లిస్తే 42 పైసలు వస్తున్నాయని, అదే బీహార్ రూపాయి చెల్లిస్తే ఆరు రూపాయలు వెళుతున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. దక్షిణాదిను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఉత్తరాది రాష్ట్రాలకు అధిక నిధులు ఇస్తున్నారని, ఈ వివక్షపై కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. భారీ ప్రాజెక్టులు అన్నీ ఉత్తరాదికే వెళుతున్నాయని ఆరోపించారు. కేంద్రం కొత్తగా ఇచ్చిన ప్రాజెక్టులు ఏవీ లేవన్నారు.

పన్నెండేళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలో ఉన్నారని, 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ తెలంగాణను పాలించిందని, కానీ వారు చేసిందేమిటని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటేస్తే మోరీని తీయడానికి మోదీ వస్తారా? బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే కేసీఆర్ వస్తారా? అని ప్రశ్నించారు. తాము రెండేళ్లలోనే ఎన్నో పనులు చేశామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తేదీనే వేతనాలు ఇస్తున్నామని, ఆరోగ్యశ్రీని రూ.10 లక్షలకు పెంచి అమలు చేస్తున్నామని, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించామని, పదేళ్లు ఇవ్వని రేషన్ కార్డులను ఇచ్చామని, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని ముఖ్యమంత్రి అన్నారు. మరోమారు కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి వస్తుందని, కాబట్టి మున్సిపల్ ఎన్నికల్లో చేతి గుర్తుకే ఓటు వేయాలని కోరారు. తమకు ఓటు వేస్తే అభివృద్ధి పూచీ మాదే అన్నారు.

**తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారం, కవిత అంశాలపై రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు**

తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారం, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికరంగా స్పందించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమల శ్రీవారి లడ్డూ వ్యవహారంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, అది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యవహారమని ముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారు. కానీ తెలంగాణలోని అన్ని దేవాలయాలలో విజయ డెయిరీ నెయ్యినే ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. కల్వకుంట్ల కుటుంబం గురించి కూడా ఆయన మాట్లాడారు. కవిత జైలుకు వెళితే కేటీఆర్, హరీశ్ రావు ముఖ్యమంత్రి అవుదామని చూస్తున్నారని వ్యాఖ్యానించారు. మన ఇంటి బిడ్డను బాగా చూసుకుంటే ఏ సమస్య ఉండదని అన్నారు. ఇంటి సమస్యను కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. కలిసి సంపాదించారు, పంపకాల్లో తేడా రావడంతో ఇప్పుడు కొట్టుకుంటున్నారని విమర్శించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే మనకు నష్టం వాటిల్లుతుందని ముఖ్యమంత్రి అన్నారు. తాను ఏ ఎన్నికైనా సీరియస్‌గానే తీసుకుంటానని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు గురించి మాట్లాడుతూ, ఈ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కీలక వ్యక్తి అన్నారు. అతడు 20 నెలలు విదేశాల్లో ఉన్నారని, భారత్‌కు తీసుకు రావడానికి కేంద్రం సహకరించలేదని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రభాకర్ రావును స్వదేశానికి తీసుకు వచ్చామని అన్నారు. ఆ తర్వాతే కేసు విచారణ వేగవంతమైందని ముఖ్యమంత్రి తెలిపారు.

## బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒప్పందం కుదుర్చుకున్నాయి



కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. వీరి తీరుతో కరీంనగర్ అవినీతిమయమయిందని అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఎంఐఎంతో కాంగ్రెస్ పార్టీ రూ. 100 కోట్ల డీల్ చేసుకుందంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. కరీంనగర్ కార్పొరేషన్ లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒప్పందం కుదుర్చుకున్నాయని పొన్నం మండిపడ్డారు. ఈ పార్టీల పరస్పర అవగాహనతోనే అభ్యర్థుల ఎంపిక జరిగిందని ఆరోపించారు. బండి సంజయ్, గంగుల కమలాకర్ తీరుతో జిల్లా అవినీతిమయంగా మారిందని అన్నారు. పదేళ్లలో కరీంనగర్ జిల్లా పూర్తిగా నిర్లక్ష్యానికి గురయిందని చెప్పారు. జిల్లా పరిధిలోని కొండగట్టు, వేములవాడ ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

ధర్మఘంట

# నగరాభివృద్ధి , మౌలిక సదుపాయాల పెంపు ధ్యేయంగా జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ప్రతిపాదనలు







**నగరాభివృద్ధి, క్రీడా మౌలిక వసతులపై నిర్ణయాలు**
**20 ప్రతిపాదనలకు స్టాండింగ్ కమిటీ అమోదం**

**ధర్మఘంట. హైదరాబాద్, 09 ఫిబ్రవరి, 2026 :**

జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ 12వ సాధారణ సమావేశం సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం నిర్వహించారు.

ఈ సమావేశంలో నగరాభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు.

ఎజెండా అంశాలలోని 9 ప్రతిపాదనలకు, 11 అదనపు ఐటమ్ లకు మేయర్ అధ్యక్షతన గల స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది.

**అజెండా అంశాలు**

1.వార్డు నెం.134, అల్వాల్ సర్కిల్-27లోని లక్ష్మీనగర్‌లో శ్రీ లక్ష్మీ కళామందిర్ థియేటర్ ఎదుట బాక్స్ డ్రెయిన్ నిర్మాణం సంబంధిత బడ్జెట్ హెడ్ కింద పరిపాలనా అనుమతి మరియు టెండర్లు పిలిచేందుకు అనుమతి . 2. ఆస్తి పన్ను మరియు ఖాళీ భూమి పన్ను విషయంలో జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు అప్పగించిన అధికారాల మేరకు కమిషనర్ తీసుకున్న చర్యలకు అమోదం (ర్యాటిఫికేషన్) 3. కూకట్‌పల్లి జోన్, మూసాపేట సర్కిల్-23, వార్డు నెం.114, ఖైరతాబాద్ కాలనీ 5వ దశలోని క్రికెట్ ప్రాక్టీస్ పిచ్‌ల నిర్వహణ & ఆపరేషన్ కోసం తాజా ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలవడానికి అనుమతి. 4.ఖైరతాబాద్ కాలనీ 9వ దశలోని ఇండోర్ షటిల్ కోర్టు నిర్వహణ & ఆపరేషన్ కోసం తాజా ప్రస్తుత ఆదాయ వాటా రూ.51,750/-పై 15% పెరుగుదలతో కొత్త ప్రాథమిక ధర నెలకు రూ.59,531/-. ఆధారంగా టెండర్లు పిలవడానికి అనుమతి ఆమోదం 5.బాలానగర్ ఫ్లైఓవర్ కింద ఉన్న ఓపెన్ స్పేస్‌ను క్రీడా ప్రాంగణంగా ఉపయోగించేందుకు లీజుకు ఒక సంవత్సరం పాటు (మరో సంవత్సరం పొడిగించదగినది) అప్పగించడం.

ఆధారంగా టెండర్లు పిలవడానికి అనుమతి ఆమోదం

6. మూసాపేట సర్కిల్-23, ఖైరతాబాద్ కాలనీలోని నెక్సస్ మాల్ ఫ్లైఓవర్ కింద ఉన్న క్రీడా ప్రాంగణం నిర్వహణ & ఆపరేషన్ కోసం తాజా ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలవడానికి అనుమతి ఆమోదం 7.వార్డు నెం.110, చందానగర్ సర్కిల్-21, హుడా పరిధిలోని పీ & టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బాక్సింగ్ కోర్టు నిర్మాణం. పరిపాలనా అనుమతి 8.వార్డు నెం.116, యూసుఫ్ నగర్ (అల్లాపూర్), మూసాపేట సర్కిల్-23లోని వైకుంఠధామ హిందూ శ్మశానం నిర్వహణ & ఆపరేషన్ కోసం జూ×-ఎబఎ-దీ×ణ.

9. అదనపు కమిషనర్ (అడ్మిన్) కు అప్పగించిన కొన్ని అధికారాలకు సంబంధించి కమిషనర్ తీసుకున్న చర్యలకు ర్యాటిఫికేషన్

**స్టాండింగ్ కమిటీ సమావేశం 13 అదనపు అంశాలు**

1) నడిమి చెరువు అభివృద్ధి పనులకు అనుమతి సాఫిల్గూడ నడిమి చెరువులో జంగిల్ క్లియరెన్స్, ఫెన్సింగ్, స్లూయిస్ షట్టర్లు, డ్రైనేజీ మళ్లింపు పనులకు పరిపాలనా అనుమతి.2) ఆనంద్‌నగర్‌మంసూరాబాద్ రోడ్ అభివృద్ధి30 మీటర్ల వెడల్పుతో రోడ్డు అభివృద్ధి, మాస్టర్ ప్లాన్ మార్పు, 195 ఆస్తుల స్వాధీనం కోసం అనుమతి కోరారు.3) ప్రియదర్శిని పార్క్, సరోజినీనగర్ కోణార్క్ దయాగ్నోస్టిక్స్ రోడ్ అభివృద్ధి30, 15 మీటర్ల వెడల్పుతో రోడ్డు అభివృద్ధి, 256 ఆస్తుల స్వాధీనం, మాస్టర్ ప్లాన్ మార్పులపై ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలని ప్రతిపాదన.4) కామినేని జంక్షన్, మన్సూర బాద్ ఎన్‌హెచ్ 65 రోడ్డు అభివృద్ధి30 మీటర్ల వెడల్పుతో రోడ్డు అభివృద్ధి మాస్టర్ ప్లాన్ మార్పులకు ఆమోదం 5) కుషాయిగూడ రోడ్ల బలోపేతం మరుతి ఎన్‌క్లేవ్ నుంచి పోచమ్మ ఆలయం వరకు దెబ్బతిన్న బీటీ రోడ్ల బలోపేతం, రీకార్పెటింగ్‌కు అనుమతి ప్రతిపాదన.6) ఎర్రకుంట నాచారంలో హిందూ బరియల్ గ్రౌండ్‌ను వైకుంఠధామంగా అభివృద్ధి చేయడానికి పరిపాలనా అనుమతి 7) కాప్రా సర్కిల్‌లో పార్కుల అభివృద్ధివాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్, పిల్లల ఆట పరికరాలు, కమ్యూనిటీ హాళ్ల పనులకు అనుమతి ప్రతిపాదన.8) హెచ్ఎమ్‌టి నగర్‌లో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ రైతు బజార్ పక్కన మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి అనుమతి కోరారు. 09) ఇందిరానగర్‌లో బహుళ అంతస్తుల భవనం బీరప్పగూడ, ఉప్పల్ సర్కిల్‌లో మల్టీ స్టోర్డ్ బిల్డింగ్ నిర్మాణానికి అనుమతి ప్రతిపాదన. 10) కాప్రా పరిధిలో రోడ్ల మరమ్మత్తులు గణపతి పూజ స్టోర్ నుంచి నేతాజీ నగర్ వరకు రోడ్డు మరమ్మత్తులు, సీసీ రోడ్లు, డివైడర్ నిర్మాణానికి అనుమతి 11) నాచారం సర్కిల్ కార్యాలయ మౌలిక సదుపాయాలుమల్లాపూర్ వార్డు కార్యాలయంలో మౌలిక వసతుల కల్పనకు అనుమతి ప్రతిపాదన.ఉప్పల్ నుంచి నారపల్లి వరకు ఉన్న ఎలివేటెడ్ కారిడార్‌ను 'శ్రీ బండారి రాజీ రెడ్డి కారిడార్'గా నామకరణం చేయాలన్న ప్రతిపాదనను సరైన నిర్ణయం కోసం రాష్ట్ర ప్రభుత్వానికీ పంపాలని స్టాండింగ్ కమిటీ నిర్ణయించింది.సమావేశంలో జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సయ్యద్ మిన్హాజుద్దీన్, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, పర్వీన్ సుల్తానా, మహ్మద్ సలీం, డా.ఆయేషా హుమేరా,బాత జబీన్, మహాలక్ష్మి రామన్ గౌడ్, మహమ్మద్ గౌస్ ఉద్దీన్ వి.జగదీశ్వర్ గౌడ్, బూరుగడ్డ పుష్ప లు , అదనపు కమిషనర్ లు ,జోనల్ కమిషనర్ లు, విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మునుగోడు ప్రజలే నా బలం..నా బలగం..

**ప్రజలకోసం ఎంత దూరమైనా..ఎంతటి పోరాటానికైనా సిద్ధం**
**ఉప ఎన్నిక తర్వాత ఓటు విలువ పెరిగింది**
**పేద ప్రజల కోసం పోరాడుతూనే ఉంటా**
**చండూర్లో ఇంతవరకు పది శాతమే అభివృద్ధి జరిగింది**
**ఇంటి స్థలాలు లేని నిరుపేదలకు ప్రభుత్వం భూమిని గుర్తించి ఇల్లు కట్టిస్తా**
**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

**ధర్మ ఘంట ఫిబ్రవరి 09, చండూరు :**

నాకు ఏ పదవులు ఉన్నా,లేకున్నా.. మునుగోడు ప్రజలే నాకు ముఖ్యం..నా బలం,నా బలగం అంతా ఈ నియోజకవర్గ ప్రజలేనన్నారు.మీరు నా వెంట ఉంటే మీ హక్కుల కోసం ఎంత దూరమైనా వెళ్తాను..ఎవరితోనైనా కొట్లాడుతానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు.నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీలోని 10 వార్డుల్లో విజయం సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ - సీపీఐ మిత్రపక్షం శ్రేణులు సమర భేరిని మోగించాయి.మున్సిపల్ ఎన్నికల వేళ చండూరు పట్టణం జనసంద్రమైంది.ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన 'సమర భేరి' ప్రచార ర్యాలీ అంగడిపేట నుంచి చండూరు పట్టణం సెంటర్ వరకు అప్రతిహతంగా సాగింది. వేలాదిగా తరలివచ్చిన ప్రజలు,మహిళల కోలాహలంతో చండూరు పురవీధులు కాంగ్రెస్-సీపీఐ జెండాలతో నిండిపోయాయి.ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు..తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసం,నియోజకవర్గ అభివృద్ధి కోసం పదవులను త్యాగం చేసిన చరిత్ర నాది.ఈ చండూరు మున్సిపాలిటీలో



అన్యాయం,అవినీతికి వ్యతిరేకంగా కొట్లాడే సత్తా నాకు ఉంది.మునుగోడు ప్రజలే నా బలం,నా బలగం.మీరు నా వెంట ఉంటే ఎంత దూరమైనా వెళ్తాను,ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనన్నారు.చండూరు అభివృద్ధి కేవలం 10 శాతం మాత్రమే జరిగిందని,మిగిలిన 90 శాతం అభివృద్ధిని పూర్తి చేసి,చండూరును ఒక మోడల్ పట్టణంగా తీర్చిదిద్దే బాధ్యత నేను తీసుకుంటానన్నారు.సొంత ఇల్లు లేని



నిరుపేదలకు,ప్రభుత్వ భూములను సేకరించి,అర్హులైన ప్రతి పేదవాడికి ఇంటి స్థలంతో పాటు పక్కా ఇల్లు కట్టించి ఇస్తానని హామీ హామీ ఇచ్చారు.ఉపఎన్నిక తర్వాత ఇక్కడ ఓటు విలువ పెరిగిందన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు,పేదలందరికీ నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నాము.10వార్డుల అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి,చండూరు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ర్యాలీలో మహిళలు,యువత పెద్ద ఎత్తున పాల్గొని ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి కోడి శ్రీనివాసులు, కుంభం శ్రీనివాస్ రెడ్డి,సంధ్యారెడ్డి,వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా బుకింగ్ యాప్ ను సద్వినియోగం చేసుకోండి

**ధర్మ ఘంట, మందమర్రి ఫిబ్రవరి 09:**

మండలంలోని రైతులందరూ రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి కిరణ్మయి తెలిపారు. సోమవారం ఆమె మండలంలోని డిసిఎంఎస్ పులిమడుగు, ఇతర ఎరువుల దుకాణాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్ ను రైతులకు, ఎరువుల డీలర్లకు వివరించారు. యూరియా పంపిణీలో పారదర్శకత, సరఫరా సమస్యలను తగ్గించడం కోసం ఈ యాప్ ను ఆదివారం నుండి ప్రభుత్వం ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. ఈ యాసంగి సీజన్ నుండి రైతులు యూరియా ఎరువును యూరియా బుకింగ్ యాప్ ద్వారా మాత్రమే బుక్ చేసుకొని, కొనుగోలు చేయాలని, నేరుగా యూరియా పంపిణీ ఉండదని సూచించారు. ఈ యాప్ ను ఆండ్రాయిడ్ గూగుల్ ప్లే స్టోర్ నుండి ఫర్టిలైజర్ యాప్ అను పేరుతో లేదా ఫ్ట్రిజూం://జూశ్రీఖఎ.ష్రశీశీస్త్రశ్రీవ.ఎశీఎ/ర్‌శీతీవ/ఖజూజూం/సవ్ ఖఱశ్రీం?ఱస=ఎశీఎ.శీతీస్త్ర.ఖస్త్రతీఱ.బతీము లింక్ ద్వారా రైతులు తమ మొబైల్ ఫోన్లలో డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. రైతులు తమ మొబైల్ ద్వారా యాప్ లో నమోదు చేసుకొని, సులభంగా యూరియా పొందవచ్చునన్నారు. జిల్లాలోని ఎరువుల విక్రయ కేంద్రాలలో అందుబాటులో ఉన్న యూరియా నిలువలను యాప్ లో పరిశీలించే సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు. పట్టా భూ యజమానులు, అటవీ హక్కుల పట్టాదారులు, నాన్ పట్టా రైతులు,



కౌలుదారులు మాత్రమే యూరియా బుకింగ్ కు అర్హులని, బుకింగ్ సమయంలో రైతుల గుర్తింపును నిర్ధారించేందుకు పట్టా పాస్ పుస్తకంతో అనుసంధానమైన మొబైల్ నెంబర్ కు ఒకసారి మాత్రమే ఉపయోగించే సాంకేత నెంబర్ (ఓటీపి) పంపించడం జరుగుతుందన్నారు. రైతు భూమి లో నమోదు చేసిన సాగు విస్తీర్ణం ఆధారంగా యూరియా సంచుల సంఖ్య స్వయంచాలకంగా నిర్ణయించబడుతుందని, బుకింగ్ విజయవంతం అయిన వెంటనే రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేయబడుతుందని తెలిపారు. యూరియా పంపిణీ సక్రమంగా జరిగేందుకు బుకింగులు విడతల వారిగా అమలు చేయబడుతాయన్నారు.

## నగరపాలక సంస్థ ఎన్నికలంద ఓట్ల లెక్కింపు సిబ్బందికి శిక్షణ...





**ధర్మఘంట,ఫిబ్రవరి09,రామగుండం:**

రామగుండం నగర పాలక సంస్థ ఎన్నికలకు సంబందించి ఫిబ్రవరి 13 న ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాలు పంచుకునే సిబ్బందికి సోమవారం ఎన్ టి పి సి టౌన్ షిప్ లోని కాకతీయ కళ్యాణ మండపంలో శిక్షణ ఇచ్చారు. కౌంటింగ్ సూపర్ వైజర్లు గా 72 మంది , కౌంటింగ్ అసిస్టెంట్ లుగా 144 మందిని నియమించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ , అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు , ఆర్ ఓ ఆంజనేయులు , ఎ సి పి శ్రీహరి , టి పి ఎస్ నవీన్ , శిక్షకులు కేడశీ శ్రీనివాస్, జక్కం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తీర్థయాత్రికుల కొరకు ప్రత్యేక రైళ్ళు



**ఐఆర్సిటిసి - టూరిజం సికింద్రాబాద్ అసిస్టెంట్ మేనేజర్ పివి వెంకటేష్**

**ధర్మ ఘంట, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 09:**

తీర్థ యాత్రలకు వెళ్ళే వారి కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఐఆర్సిటిసి - టూరిజం సికింద్రాబాద్ అసిస్టెంట్ మేనేజర్ పివి వెంకటేష్ తెలిపారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో జిల్లా పౌర సంబంధాల అధికారి ఎం కృష్ణమూర్తి, రైల్వే శాఖ అధికారులతో కలిసి రైల్ టూర్ ప్యాకేజెస్ సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం మార్చి 21, ఏప్రిల్ 14 తేదీ లలో 2 ప్రత్యేక ప్యాకేజీలను భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు ద్వారా హైదరాబాద్ నుండి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మొదటి ప్యాకేజీలో మార్చి 21వ తేదీన ప్రారంభమై 28వ తేదీ వరకు దివ్యదక్షిణయాత్ర జ్యోతిర్లింగంతో (ఎస్ సి జెడ్ బి జి)(తిరువణ్ణామలై, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చి, తంజావూరు) ఉంటుందని. ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 14 వేల 700 రూపాయలు, 3 ఎసి ధర 22 వేల 300 రూపాయలు, 2 ఎసి ధర 28 వేల 700 రూపాయలుగా ఉంటుందని తెలిపారు. ఈ యాత్ర సికింద్రాబాద్, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా కొనసాగుతుందని తెలిపారు. 2వ ప్యాకేజీలో ఏప్రిల్ 14వ తేదీన ప్రారంభమై 24వ తేదీ వరకు సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర (ఎస్ సి జెడ్ బి జి55): ఉజ్జయిని (మహాకాళేశ్వర్ అండ్ ఓంకారేశ్వర్) ద్వారక (నాగేశ్వర్), సోమనాథ్ (సోమ్నాథ్), పూణే (భీమశంకర్), నాసిక్ (త్రయంబకేశ్వర్), ఔరంగాబాద్ (గ్రీష్ణేశ్వర్) ఉంటుందని, ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర 17 వేల 600 రూపాయలు, 3 ఎసి ధర 26 వేల 700 రూపాయలు, 2 ఎసి ధర 34 వేల 600 రూపాయలుగా ఉంటుందని తెలిపారు. ఈ యాత్ర సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ ధర్మాబాద్, ముధ్ఖేడ్ హజూర్ సాహిబ్ నాందేడ్, పూర్ణ మీదుగా కొనసాగుతుందని తెలిపారు. రైలు, బస్సు, హోటల్, అన్ని భోజనాలు (ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం), వాటర్ బాటిల్, టూర్ ఎస్కార్ట్ సేవలతో సందర్శనా స్థలాలు, (అదనపు ఖర్చు లేదు), ప్రయాణ భీమా, రైల్వే స్టేషన్ నుండి దేవాలయాలకు ప్రయాణం పూర్తిగా ఉచితమని తెలిపారు. ప్రతి రైలులో 639 మంది ప్రయాణికులు ఉంటారని, ప్రతి 70 మందికి ఇద్దరు సమన్వయకర్తలు అందుబాటులో ఉండి అన్ని సౌకర్యాలు సమకురుస్తారని, కోచ్ కి ఒక సెక్యూరిటీ గార్డ్, రైలులో సిసి కెమెరాలతో కూడిన భద్రత ఉంటుందని తెలిపారు. టికెట్ బుక్ చేసుకోవాలి అనుకునే వారు వివరాలకు 9701360701, 9281030727, 9281030759 లకు సంప్రదించాలని, మరిన్ని వివరాలకు www.irctctourism.com వెబ్ సైట్ లో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12న సింగరేణిలో సార్వత్రిక సమ్మె ను జయప్రదం చేయండి



**సింగరేణి జేఏసీ కార్మిక సంఘాల నాయకులు**

**ధర్మ ఘంట, మందమర్రి ఫిబ్రవరి 09:**

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను సింగరేణిలో జయప్రదం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ (ఏఐటియుసి, ఐఎన్టియుసి, సిఐటియు, టిబిజికేఎస్, టిఎన్టియుసి, ఐఎఫ్టియు) నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం ఏరియాలోని కేకే 5 గని పై, ఏరియా వర్క్ షాప్, కేకే ఓసిపి లలో కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో వేరు వేరుగా ద్వార సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను 4 కోడ్ లుగా మారుస్తూ, బడా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ రంగ సంస్థలను కట్ట పెట్టడానికి, కార్మిక చట్టాలను రద్దు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ నల్ల చట్టాలతో ప్రధానంగా సంఘం పెట్టే హక్కును కోల్పోతామని, వేతన హక్కు చట్టం ఉండదని, 8 గంటల పని దినాల నుండి ,14 గంటల పని దినాలను పెంచడం జరుగుతుందని తెలిపారు. దీంతో కార్మిక హక్కులు నిర్వీర్యమై, ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేటుపరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. రైతు చట్టాలు, వ్యవసాయ కార్మిక చట్టాలను రద్దు చేస్తూ, కార్మికులను, రైతులను, ఉద్యోగస్తులను నిర్వీర్యం చేస్తూన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజా కంటక ప్రభుత్వంగా మారుతుందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరుగు సార్వత్రిక సమ్మెను సింగరేణి కార్మిక వర్గం, మొక్కవోని ధైర్యంతో పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో

# 11వ తేదీ తర్వాత మీ సంగతి తేలుస్తా..







**చందాలు.. దందాలు చేస్తే.. కింద పడుద్ది జాగ్రత్త.. కారుకూతలు కూస్తే బొక్కలోకి పంపడం ఖాయం.. ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచార ముగింపు సభలో మంత్రి పొంగులేటి 'స్ట్రాంగ్ వార్నింగ్'..**

**ఖమ్మం/ఫిబ్రవరి/9 ధర్మ ఘంట ఏదులాపురం :** "రాజకీయాల ముసుగులో అరాచకాలు చేస్తామన్నా... ఫోన్లలో బెదిరింపులకు దిగినా సహించేది లేదు. 11వ తేదీ ఎన్నికలు ముగియనివ్వండి.. హద్దులు దాటిన ప్రతి ఒక్కరి లెక్క తేలుస్తా. చందాలు, దందాలు చేస్తే కింద పడుద్ది జాగ్రత్త! తింగరి వేషాలు వేస్తే ఊరుకోం.. చట్టప్రకారం మీ అందరినీ బొక్కలో వేయించడం ఖాయం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యర్థులను హెచ్చరించారు. ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల ప్రచార ముగింపు సందర్భంగా వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. దందాలకు కాలం చెల్లింది..ప్రచార పర్వంలో ప్రత్యర్థుల తీరుపై మంత్రి నిప్పులు చెరిగారు. "ఎవరైనా కారుకూతలు కూస్తే చట్టరీత్యా ఉక్కుపాదం మోపుతాం. మీ బెదిరింపులకు ఇక్కడ ఎవరూ భయపడరు. మీ దందాలకు, దౌర్జన్యాలకు ప్రజలు ఈ ఎన్నికలతో ఫుల్ స్టాప్ పెట్టబోతున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరగాలి.. అశాంతి సృష్టించాలని చూస్తే ఉక్కుపాదం మోపుతాం" అని స్పష్టం చేశారు.

**అధికారం లేని మీరు అభివృద్ధి ఎలా చేస్తారు?**

రంగురంగుల కండువాలు వేసుకుని వస్తున్న నాయకులను మంత్రి సూటిగా నిలదీశారు. "అభివృద్ధి చేయాలంటే ప్రభుత్వ సాయం ఉండాలి. అధికారంలో ఉన్న మేమే పనులు చేయగలం. ఏ అధికారం ఉందని మీరు మేలు చేస్తామంటూ ప్రజల వద్దకు వస్తున్నారు? పదేళ్లు అధికారంలో ఉన్న ఆ 'దొర'లకు పేదలకు ఇల్లు ఇవ్వాలనే జ్ఞానం లేదు" అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కొత్త రేషన్ కార్డులు, హాస్టల్ విద్యార్థులకు డైట్ చార్జీల పెంపు వంటి ఎన్నో సంక్షేమ ఫలాలను అందించామని గుర్తుచేశారు.

**ఏప్రిల్‌లో 'ఇందిరమ్మ' ఇళ్లు..**

వచ్చే ఏప్రిల్ నెలలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేపడతామని మంత్రి ప్రకటించారు. "ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకున్న పేదలకు పట్టాలు ఇచ్చే బాధ్యత నాదే. ఏదులాపురాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా" అని హామీ ఇచ్చారు. మున్నేరు వరద బాధితులకు అండగా ఉన్నామని, వచ్చే వర్షాకాలం నాటికి రిటైనింగ్ వాల్ పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు.

సభ అనంతరం వరంగల్ క్రాస్ రోడ్డు నుంచి నాయుడు పేట సర్కిల్ వరకు వేలాది మందితో జరిగిన భారీ ర్యాలీలో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

# అభివృద్ధిని కోరుకునే వారంతా చెయ్యి గుర్తుకు ఓటు వేయాలి

**అభివృద్ధే నా ధ్యేయం... పేదోళ్ల కన్నీళ్లు తుడ్చడమే నా లక్ష్యం..**
**పేదోడు ఏడిస్తే చూడలేని గుణం నాది వారికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటా..**
**అభివృద్ధి కోసం ఎన్ని నిధులైన మంజూరు చేయిస్తా..**
**పూటకోపాటి మారే వారిని గెలిపిస్తే మనకే నష్టం**
**రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



**ధర్మ ఘంట ఫిబ్రవరి 9,నల్లగొండ :**

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన ప్రధాన ధ్యేయమని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల 14, 15, 16,17, 3 డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ రోడ్ షో నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో ఇంకా మిగిలి ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డును పూర్తి చేయడంతో పాటు సమస్యలు లేని కాలనీలుగా తీర్చిదిద్దారని అన్నారు.డివిజన్లో ప్రతి కాలనీకి 24 గంటలు తాగునీరు వచ్చే విధంగా ఇప్పటికే చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు.ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతుందని మరోసారి మంత్రి స్పష్టం చేశారు.పూటకో పార్టీ మారే వాళ్లను,ఇతర పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజలకే నష్టం జరుగుతుందని అన్నారు.కార్పొరేషన్ గా చేసుకున్నందున కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు వస్తాయన్నారు.దీంతో మరిన్ని అభివృద్ధి పనులు చేసుకోవచ్చని పేర్కొన్నారు.ఇప్పటికే 2,200 కోట రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే అన్ని డివిజన్లో ఇచ్చిన హామీలన్నిటిని కచ్చితంగా అమలు చేస్తానని స్పష్టం చేశారు.పేదోడు ఏడిస్తే చూడలేని గుణం నాది.. వారి బాధలు తీర్చడమే నా బాధ్యతగా గుర్తిస్తానని అన్నారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే వారు డివిజన్లోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు వీలుంటుంది అన్నారు.ఇతర పార్టీకి చెందిన అభ్యర్థులు గెలిస్తే వారితో ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు.మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో ప్రజలంతా చెయ్యి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను రికార్డు స్థాయి మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,తిప్పర్తి మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి,డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, 14వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి బొజ్జ శంకర్,15వ డివిజన్ అభ్యర్థి పెరిక నాగరాజు,16వ డివిజన్ అభ్యర్థి పెరిక స్వాతి వినాయక రాజు (చిట్టి), 17వ డివిజన్ అభ్యర్థి జేరిపోతుల అశ్విని భాస్కర్ గౌడ్, 3వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి గాలి వినోద, మాజీ కౌన్సిలర్ మందడి శ్రీనివాస్ రెడ్డి,యువజన కాంగ్రెస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు,పలువురు మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# మున్సిపల్ ఎన్నికల్లో వింతవింతలు
# ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం







**ఎవరైనా చనిపోతే అంత్యక్రియల ఖర్చుల కింద రూ.10 వేలు**
**సంగారెడ్డిజిల్లా ఆందోలుజోగిపేటలో తాళిబొట్టు, మెట్టెలు**
**ఖమ్మం జిల్లా కల్లూరులో బాండ్ పేపర్‌పై ప్రమాణ పత్రం**
**టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, మిక్సీలు తదితర సామాగ్రి పంపిణీ**

హోరాహోరీగా సాగిన మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెర వేసవి కాలం రాకముందు నుంచే కొన్ని రోజులుగా ఎన్నికల వేడి చెన్నూరి అన్వేషి ఎగ్జికూటివ్ ఎడిటర్ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల వేడి కొనసాగుతోంది. హోరాహోరీగా సాగిన తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. పార్టీలు, స్వతంత్ర్య అభ్యర్థులు.. ఈ ఎన్నికల ప్రచారం కోసం రాత్రి, పగలు తేడా లేకుండా తలమునకలై ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 11వ తేదీన ఎన్నికల పోలింగ్ జరగనుండగా చివరిసారి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు, పార్టీలు ప్రచారంలో మునిగిపోతున్నారు. ఈ క్రమంలోనే ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు రకరకాల హామీలు ఇస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓట్ల కోసం కొత్త కొత్త హామీల వర్షం కురిపిస్తూ ఓటర్లనే ఆశ్చర్యానికి గురి చేస్తున్నారు.

**టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, మిక్సీలు తదితర సామాగ్రి పంపిణీ**

సాధారణంగా ఎన్నికలు ఉన్నాయంటే చాలు. మద్యం, డబ్బు, బిర్యానీ, చికెన్, మటన్. ఇంటింటికీ తిరిగి పంచేవారు. కానీ ఈ మున్సిపల్ ఎన్నికల్లో మాత్రం అది కాస్తా హద్దు దాటింది. ఇళ్లల్లోకి కావాల్సిన ఖరీదైన వస్తువులను ఇచ్చేస్తున్నారు. టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, మిక్సీలు, రైస్ కుక్కర్లు, ప్రెజర్ కుక్కర్లు, డిన్నర్ సెట్‌లు, కూలర్లు ఇలా ఒక్కటేంటీ రకరకాల వస్తువులను పంచుతున్నారు.

**ఆడపిల్లల పెళ్లిళ్లు జరిగితే వారికి ఆర్థిక సాయం**

వీటితోపాటు తమ వార్డు పరిధిలో ఉన్న వారి ఇళ్లల్లో ఆడపిల్లల పెళ్లిళ్లు జరిగితే వారికి ఆర్థిక సాయం అందిస్తామని హామీలు కురిపిస్తున్నారు. అంతేకాకుండా పుట్టే ఆడబిడ్డల పేరు మీద కూడా డబ్బులు ఇస్తామని పేర్కొంటున్నారు. ఇంకా కొందరు బాండ్ పేపర్ల మీద హామీలు రాసిస్తుండగా మరికొందరు ఓటర్ల నుంచి ప్రమాణాలు తీసుకుంటున్నారు.

**కల్లూరులో బాండ్ పేపర్‌పై ప్రమాణ పత్రం**

ఖమ్మం జిల్లా కల్లూరు మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. 17వ వార్డులో కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో ఉన్న వేము విజయలక్ష్మి రూ.100 బాండ్ పేపర్‌పై తాను అమలు చేయనున్న వాగ్దానాలు రాసి ఇచ్చారు. తన సొంత డబ్బులతో తన వార్డు ప్రజలకు చేసే పనులకు సంబంధించిన వివరాలను బాండ్ పేపర్‌పై రాసి ప్రచారం చేశారు. తన వార్డు పరిధిలో ఎవరికైనా ఇందిరమ్మ ఇల్లు మంజూరైతే.. ఒక్కొక్కరికీ 20 సిమెంట్ బస్తాలను ఫ్రీగా ఇస్తానని పేర్కొన్నారు. అంతేకాకుండా తన వార్డులో నివసించే నిరుపేద ఆడబిడ్డల పెళ్లికి రూ.5,116 సాయం చేస్తానని చెప్పారు. నిరుపేదలకు పుట్టే ప్రతీ ఆడబిడ్డకు ఒక్కొక్కరికీ రూ.5116 చొప్పున అందిస్తానని వెల్లడించారు.

**ములుగులో ఆడబిడ్డ పెళ్లికి రూ.10వేల సాయం**

ములుగు జిల్లాలోని ములుగు మున్సిపాలిటీ 1వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ తరఫున నేషనల్ జిమ్నాస్టిక్స్ ప్లేయర్ అంగోతు శిరీష బరిలో నిలిచారు. డిగ్రీ వరకు చదివిన అంగోతు శిరీష.. 2014లో పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో జరిగిన 60వ నేషనల్ స్కూల్ గేమ్స్‌లో పాల్గొని జిమ్నాస్టిక్స్‌లో సత్తా చాటారు. పటియాల, కురుక్షేత్రలో జరిగిన నేషనల్ లెవల్ జిమ్నాస్టిక్స్ పోటీల్లోనూ రాణించి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ప్రస్తుతం ఆమె ములుగులో ట్రైనింగ్ ఇస్తున్నారు. ఈ పురపాలక సంఘం ఎన్నికల్లో తనను గెలిపిస్తే తాను పోటీ చేసే వార్డులో పెళ్లి చేసుకునే ప్రతి యువతికి రూ.10 వేల చొప్పున అందిస్తానని హామీ ఇచ్చారు. ఇక ఆడపిల్ల పుడితే వారి పేరు మీద రూ.5 వేలు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని వాగ్దానం చేశారు.

**ఆందోలు జోగిపేటలో తాళిబొట్టు, మెట్టెలు**

సంగారెడ్డి జిల్లా ఆందోలు-జోగిపేట మున్సిపాలిటీలో 10వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీచేస్తున్న చౌదిగారి విజయలక్ష్మి తన భర్త నర్సింహులు, కుమారుడు సాయికుమార్‌తో కలిసి మేనిఫెస్టోను విడుదల చేశారు. తనను 10వ వార్డు కౌన్సిలర్‌గా గెలిపిస్తే యువతుల పెళ్లిళ్లకు పుస్తె, మెట్టెలు కానుకగా ఇస్తానని పేర్కొన్నారు.



**ఎవరైనా చనిపోతే అంత్యక్రియల ఖర్చుల కింద రూ.10 వేలు**

తన వార్డులోని ప్రజలు ఎవరైనా చనిపోతే వారి అంత్యక్రియల ఖర్చుల కింద రూ.10 వేలు ఇస్తామని ప్రకటించారు. పుట్టిన ప్రతి బిడ్డకు సీఎస్‌కే కిట్ ఇస్తామని వెల్లడించారు. వార్డు పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు స్పెషల్ అకౌంట్‌లో రూ.10 లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని చెప్పారు. ఈ నిధులు దుర్వినియోగం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు బంద్...



**ఆప్కారి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మంగమ్మ.**

**ధర్మఘంట,ఫిబ్రవరి09,రామగుండం :**

రామగుండం కార్పొరేషన్ మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా మద్యం దుకాణాలు బందు చేయడం జరుగుతుంది అని రామగుండం ఎక్సైజ్ ఆప్కారి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మంగమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు.. రామగుండం మున్సిపాల్ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు ఫిబ్రవరి 9 సాయంత్రం 5:00 నుండి 11వ తేదీ ఎన్నికల పోలింగ్ మూగిసే వరకు నగరపాలక పరిసర ప్రాంతాల్లో మద్యం దుకాణాలు మూసివేయాలని, ఒకవేళ ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించి మద్యం విక్రయాలు కొనసాగించినట్లయితే వారిపై చట్టపరమైనా శిక్షలు విధించబడునని, ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించరాదని రామగుండం ఎక్సైజ్ ఆప్కారి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మంగమ్మ తెలిపారు.

## చివరి ర్యాండమైజేషన్ కార్యక్రమం పూర్తి




**ధర్మ ఘంట ఫిబ్రవరి 9,**

నల్గొండ :మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సిబ్బంది చివరి ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మున్సిపల్ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు రాష్ట్ర ఎస్ సి ఈ ఆర్టీ సంచాలకులు జి.రమేష్ సమక్షంలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ నిర్వహించారు.ఈ నెల 11న ఎన్నికలు జరగనున్న నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్,మిర్యాలగూడ, నందికొండ,హాలియా,దేవరకొండ, చండూరు, చిట్యాల,మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు గాను మొత్తం 475 పోలింగ్ కేంద్రాలలో 20% రిజర్వ్ కలుపుకొని పోలింగ్ సిబ్బందిని కేటాయిస్తూ ర్యాండమైజేషన్ చేయడం జరిగింది. 571 మంది పీవోలు, 571 మంది ఏపీవోలు, 1713 మంది ఓపిఓలు మొత్తం 2855 మంది సిబ్బందికి ఈ ర్యాండమైజేషన్ లో పోలింగ్ విధులను కేటాయించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జి ఆడాన్సపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## పోలింగ్ రోజున పబ్లిక్ హాలిడే : జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి.

**ధర్మఘంట, ఫిబ్రవరి 09, కరీంనగర్:**

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ నిర్వహించే కేంద్రాల్లో ఈ నెల 10, 11 తేదీల్లో ( పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు) సెలవు ప్రకటించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాలుగా ఉన్న విద్యా సంస్థలు, కార్యాలయాలకు ఈ సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. చట్ట ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కార్పొరేషన్లు, సంస్థల ఉద్యోగులు, సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ రోజున (ఈ నెల 11న) సెలవు వర్తిస్తుందని కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలి




**అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి**

**ధర్మ ఘంట ఫిబ్రవరి 9,నల్గొండ:**


ఈనెల 11న జరిగే ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి అన్నారు.రెండవ సాధారణ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో,ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్,రిసెప్షన్ సెంటర్, టీపోల్ ఎంట్రీ విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చంద్ర తో కలిసి మాట్లాడారు.ఎన్నికల విధులను కట్టుదిట్టంగా పాటిస్తూ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.ఈ శిక్షణ కార్యక్రమాన్ని మాస్టర్ ట్రైనర్ సోమయ్య నిర్వహించి,సిబ్బంది విధులు, బాధ్యతలు, కార్యాచరణ విధానాలను వివరంగా వివరించారు.

## కట్టుదిట్టమైన భద్రతల మధ్య స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు..

**పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి.**

**ధర్మఘంట,ఫిబ్రవరి09,రామగుండం :**







మున్సిపల్ ఎన్నికల నిర్వహణతో పాటు అనంతర కార్యక్రమాలకు సంబంధించిన అవసర చర్యలు చేపట్టుతున్నామని పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి తెలిపారు.సరస్వతి శిశు మందిర్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను డీసీపీ, గోదావరిఖని ఏసిపి ఎం.రమేష్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా డీసీపీ అక్కడి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, మరింత పక్డబందీగా ఏర్పాటు చేయాలని సూచనలు అందించారు.బ్యాలెట్ బాక్సుల డిస్ట్రిబ్యూషన్‌లతో పాటు,పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లో వాటి భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు,ఆర్మ్డ్ గార్డులు,సైన్ ఫ్లెక్సీలు, కౌంటింగ్ సమయంలో ఎవరికీ అనుమతి ఇవ్వాలి, తీసుకోవలసిన జాగ్రత్తలు,పార్కింగ్ తదితర అంశాలపై చర్చించారు.ఏర్పాట్ల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని, ఏమైనా అనుమానాలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని సిబ్బందికి సూచించారు.

ధర్మఘంట

## బిజినెస్

### ప్రభుత్వానికి టెలికాం కంపెనీలు చెల్లించాల్సిన బకాయి రూ. 1.77 లక్షల కోట్లు



2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి భారత ప్రభుత్వానికి టెలికాం కంపెనీలు చెల్లించాల్సిన సర్దుబాటు చేసిన స్థూల రాబడి(ఏజీఆర్) బకాయిలు రూ. 1.77 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి. ఈ మేరకు అధికారిక డేటా వివరాలను ప్రభుత్వం పార్లమెంటుకు తెలియజేసింది. దీని ప్రకారం, అప్పుల ఊబిలో ఉన్న ప్రైవేట్ రంగ వొడాఫోన్ ఐడియా (వీఐ) మొత్తం రూ. 89,952 కోట్లు, భారతీ గ్రూప్ రూ. 51,091 కోట్లు, టాటా గ్రూప్‌పై రూ. 20,426 కోట్లు, ఎంటీఎన్ఎల్‌పై రూ. 14,462 కోట్లు, రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌పై రూ. 1,984 కోట్ల బకాయి చెల్లించాల్సి ఉంది. ఇందులో వొడాఫోన్ ఐడియాకు చెందిన 2006-07 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న ఏజీఆర్ బకాయిలు రూ. 87,695 కోట్లను ఫ్రీజ్ చేశారు. అంటే, చెల్లింపు ప్రక్రియ వాయిదాలో ఉంది. దీనికి సంబంధించి వీఐ బకాయిలను పునఃపరిశీలన కోసం జనవరి 30న టెలికాం విభాగం ఓ కమిటీని ఏర్పాటు చేసిందని ప్రభుత్వం పార్లమెంటుకు తెలియజేసింది. ఈ కమిటీలో భారత ప్రభుత్వానికి చెందిన రిటైర్‌మెంట్ కార్యదర్శి స్థాయి అధికారి, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) నామినేట్ చేసిన ఓ ప్రతినిధి ఉంటారు. ఈ కమిటీ తీసుకున్న నిర్ణయమే తుది ఫలితం కానుంది. అందుకు అనుగుణంగా నిర్ణయం ఉంటుందని ప్రభుత్వం వెల్లడించింది.

### వాణిజ్య ఒప్పంద ప్రభావం పడొచ్చు




మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై వెలువడిన భారత్-అమెరికా సంయుక్త ప్రకటన ప్రభావం ఈవారం మన స్టాక్ మార్కెట్లపై ఉంటుంది. మన వస్తువులపై అమెరికా టారిఫ్‌లు 50% నుంచి 18 శాతానికి తగ్గుతాయి. సముద్ర ఉత్పత్తులు, జౌళి, ఇతర కార్మిక ఆధారిత రంగాలకు ప్రయోజనం కలగనుంది. సాంకేతికంగా చూస్తే నిఫ్టీ-50కి 25,500 పాయింట్ల వద్ద మద్దతు, 25,750 వద్ద నిరోధం కనిపించొచ్చు. ఐడీబీఐ బ్యాంక్‌లో మెజారిటీ వాటా కొనుగోలుకు కోటక్ మహీంద్రా బ్యాంక్, ఫెయిర్‌ఫాక్స్ వంటివి ఆర్థిక బిడ్‌లు సమర్పించనున్న నేపథ్యంలో, ఈ పరిణామాలపై మదుపర్లు దృష్టి సారించొచ్చు. టాటా స్టీల్ మెరుగైన ఫలితాల నేపథ్యంలో ఆ సంస్థ షేర్లు వెలుగులోకి రావొచ్చు. విదేశీ మదుపర్ల ధోరణి కీలకం కానుంది. వరుసగా 3 నెలల పాటు భారీగా విక్రయాలు జరిపిన విదేశీ పోర్టుఫోలియో మదుపర్లు, ఈ నెల తొలివారంలో రూ.8,129 కోట్ల నికర కొనుగోళ్లు జరపడం గమనార్హం.

# ఎస్బీఐలో 10.05 శాతం వడ్డీకే

మనకు ఎప్పుడు ఏ అవసరం పడుతుందో చెప్పలేం. పెళ్లి కోసమో లేదా వెకేషన్ కోసమో.. లేదా ఉన్నట్లుండి ఆస్పత్రిలో చేరాల్సి వస్తే ఖర్చులకు, ఇతర ఎమర్జెన్సీ అవసరాలకు డబ్బు కావాల్సి వస్తుంది.మన దగ్గర లేకపోతే బంధువులనో.. స్నేహితులనో అడుగుతుంటాం. అక్కడ దొరక్కపోతే ఇక బ్యాంకుల్లో లోన్ తీసుకోవడానికే చూస్తుంటామని చెప్పొచ్చు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు చాలా మంది చిన్న అవసరాల కూడా బ్యాంకుల్ని ఆశ్రయిస్తున్నారు. ప్రాసెస్ కూడా ఒకప్పటితో పోలిస్తే వేగంగా జరుగుతుంది. పెద్దగా డాక్యుమెంటేషన్ పని లేకుండానే క్షణాల్లో అకౌంట్లో డబ్బులు జమ చేస్తున్నాయి. కొన్ని బ్యాంకులు ప్రీఅప్రూవ్డ్ లోన్స్ ఆఫర్ చేస్తూ.. బ్యాంకుకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే లోన్స్ అందిస్తున్నాయి. కొంత కాలంగా ఆర్బీఐ కీలక రెపో రేట్లను తగ్గిస్తూ వచ్చిన సంగతి తెలిసిందే. గతేడాది ఏకంగా 125 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించగా.. బ్యాంకులు అందుకు అనుగుణంగా రెపో ఆధారిత వడ్డీ రేట్లను తగ్గించాయి. రెపోకు లింక్ అయి ఉన్న పర్సనల్ లోన్, హోం లోన్, వెహికల్ లోన్ వంటి వాటి వడ్డీ రేట్లు తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో ఎస్బీఐలో కూడా లోన్ వడ్డీ రేట్లు తగ్గాయి. గతంలో కంటే తక్కువ వడ్డీ రేటుకే ఇప్పుడు లోన్లు లభిస్తున్నాయని చెప్పొచ్చు. ఎస్బీఐలో పర్సనల్ లోన్ అనేది రెండేళ్ల టెన్యూర్ ఎంసీఎల్ఆర్‌కు లింక్ అయి ఉంటుంది. ఈ బ్యాంకులో ఇప్పుడు పర్సనల్ లోన్ వడ్డీ రేట్లు కనీసం 10.05 శాతం నుంచే ప్రారంభమవుతున్నాయి. గరిష్ఠ వడ్డీ రేటు 15.05 శాతంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు, డిఫెన్స్, పారా మిలిటరీ, ఇండియన్ కోస్ట్ గార్డ్స్ సిబ్బందికి చాలా తక్కువ వడ్డీకే లోన్లు లభిస్తాయి. ఇంకా మెరుగైన సిబిల్ స్కోరు ఉన్న




ప్రైవేట్ ఉద్యోగులకు కూడా కనీస వడ్డీ రేటుకే లోన్ లభించే అవకాశం ఉంటుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్ ప్రకారం.. రూ. 35 లక్షల వరకు పర్సనల్ లోన్ పొందొచ్చు. ప్రాసెసింగ్ ఫీజులు కూడా ఎక్కువేం ఉండవు. పెద్దగా డాక్యుమెంటేషన్ ఉండదు. హిడెన్ కాస్ట్స్ ఏం లేవు. ఇప్పుడు మనం ప్రారంభ వడ్డీ రేటుతో అలాగే.. 11 శాతం, 12 శాతం వడ్డీ రేటుతో రూ. 5 లక్షల పర్సనల్ లోన్ తీసుకుంటే ఈఎంఐ ఎంత చెల్లించాలో చూద్దాం. రూ. 5 లక్షల లోన్ తీసుకుంటే.. మూడేళ్లకు 10.05 శాతం ప్రారంభ వడ్డీ రేటు చొప్పున నెలకు ఈఎంఐ రూ. 16,145 చొప్పున పడుతుంది. మొత్తం టెన్యూర్‌కు రూ. 81,232 వడ్డీ చెల్లించాల్సి వస్తుంది. ఇదే 11 శాతం వడ్డీ రేటుకు చూస్తే నెలకు ఈఎంఐ రూ. 16,369 గా ఉండగా.. మొత్తం వడ్డీ రూ. 89,297 చెల్లించాలి. 12 శాతానికి చూస్తే మూడేళ్లలో నెలకు ఈఎంఐ రూ. 16,607 పడుతుంది. మొత్తం వడ్డీ రూ. 97,858 పడుతుంది.

# రష్యా ముడిచమురు దిగుమతులకు బ్రేక్!

గత ఏడాది కాలంగా భారత ఇంధన మార్కెట్‌లో రష్యా గుత్తాధిపత్యం స్పష్టంగా కనిపిస్తూ వచ్చింది. 2025 జూన్ నాటికి భారత్‌కు రష్యా నుంచి వచ్చే క్రూడాయిల్ ఇంపోర్ట్స్ రికార్డు స్థాయిలో రోజుకు 20 లక్షల బ్యారెళ్లకు చేరుకున్నాయి. ఆ సమయంలో భారత మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా వాటా దాదాపు 44 శాతంగా నమోదై అగ్రగామిగా నిలిచింది. తక్కువ ధరకు చమురు లభిస్తుండటంతో భారతీయ రిఫైనరీలు రష్యా వైపే మొగ్గు చూపాయి.అయితే, 2025 నవంబర్ తర్వాత పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. అంతర్జాతీయ స్థాయిలో అమెరికా విధించిన కఠినమైన ఆర్థిక ఆంక్షలు మరియు మారుతున్న అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలు భారత చమురు దిగుమతులపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ముఖ్యంగా రష్యా నుంచి వచ్చే చమురు రవాణాపై ఉన్న పరిమితులు మరియు లాజిస్టిక్స్ సమస్యల కారణంగా భారతీయ కంపెనీలు తమ వ్యూహాన్ని మార్చుకోవాల్సి వచ్చింది. దీనివల్ల గతంలో ఉన్న జోరు కాస్తా తగ్గడం ప్రారంభమైంది.తాజా గణాంకాల ప్రకారం, జనవరి 2026 నాటికి రష్యా చమురు వాటా సగానికి సగం పడిపోయి 22 శాతానికి పరిమితమైంది. ప్రస్తుతం రోజువారీ దిగుమతులు 11.6 లక్షల బ్యారెళ్లకు చేరుకున్నాయంటే, మార్కెట్‌లో వచ్చిన మార్పు ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఎన్నడూ లేని విధంగా అతి తక్కువ కాలంలోనే ఇంతటి భారీ పతనం సంభవించడం ఇంధన రంగంలో చర్చనీయాంశంగా మారింది. ఇది ఇతర దేశాల నుంచి చమురు దిగుమతులు పెరిగేందుకు దారితీసింది. దిగుమతులు భారీగా తగ్గినప్పటికీ, ఇప్పటికీ భారత ఇంధన అవసరాల సరఫరాలో రష్యా ఒక కీలక భాగస్వామిగానే కొనసాగుతోంది. అంతర్జాతీయ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, భారత్ తన ఇంధన భద్రతను కాపాడుకోవ డానికి ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతోంది. భవిష్యత్తులో ధరల వ్యత్యాసం మరియు అంతర్జాతీయ పరిణామాలను బట్టి ఈ దిగుమతుల శాతంలో మరిన్ని మార్పులు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు



## స్పోర్ట్స్

## రాహుల్ సెంచరీతో ముంబై ఇంటికి..

# రంజీ సెమీఫైనల్లో కర్నాటక!

భారత జట్టుకే కాదు దేశవాళీలోనూ తాను ఆపద్బాదవుడిని అని చాటుకున్నాడు కేఎల్ రాహుల్. రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో ఈ క్లాస్ బ్యాటర్ సెంచరీతో గర్జించాడు. ముంబై బౌలర్లను చితక్కొడుతూ శతకంతో కర్నాటకను సెమీ ఫైనల్ చేర్చాడు. 325 పరుగుల ఛేదనలో రెచ్చిపోయిన రాహుల్ మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌తో 42 సార్లు ఛాంపియన్ ముంబైని ఇంటికి పంపాడు. దాంతో.. 11 ఏళ్ల తర్వాత టైటిల్ వేటకు అడుగు దూరంలో నిలిచింది కర్నాటక. రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో కేఎల్ రాహుల్ తన తడాఖా చూపించాడు. ముంబై నిర్దేశించిన భారీ ఛేదనలో మూడంకెల స్కోర్‌తో కర్నాటకను సెమీస్ తీసుకెళ్లాడు. ఎంసీఏ బీకేసీ మైదానంలో నాలుగో రోజు మయాంక్ అగర్వాల్(3) విఫలమవ్వగా.. రాహుల్‌నే నమ్ముకుంది కర్నాటక. శార్దూల్ ఠాకూర్, తుషార్ పాండే ఓవర్లో చెత్త బంతులను శిక్షించి లక్ష్యాన్ని కరిగించాడు. రాహుల్(130)కు కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కల్(39) అండగా నిలవగా చక్కని కవర్ డ్రైవ్స్‌తో అలరించిన అతడు అర్ధ శతకం భాగస్వామ్యం నెలకొల్పాడు. అనంతరం స్మరన్ రవిచంద్రన్(83 నాటౌట్)తో కలిసి విలువైనరన్స్ జోడించిన ఈ సొగసరి బ్యాటర్ 147 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అతడికిది 24వ సెంచరీ. రాహుల్ ఖతర్నాక్ శతకంతో నాలుగు వికెట్ల తేడాతో ముంబైని చిత్తు చేసింది కర్నాటక.

**ఆ ఇద్దరు నిలబడడంతో..**



తొలి ఇన్నింగ్స్‌లో కర్నాటకు 53 పరుగుల ఆధిక్యం సమర్పించుకున్న ముంబై.. రెండో ఇన్నింగ్స్‌లో ఛాంపియన్‌లా ఆడింది. వికెట్ కీపర్ ఆకాశ్ ఆనంద్(70) హాఫ్ సెంచరీతో మెరవగా.. ఆఖర్లో తనుష్ కొతియాన్(48 నాటౌట్), తుషార్ దేశ్‌పాండే(47)లు కర్నాటక బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. వీరిద్దరి పట్టుదలతో రెండో ఇన్నింగ్స్‌లో ముంబై 375 పరుగులు చేసి ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

### ఇటలీపై స్కాట్లాండ్ ఘన విజయం.. జార్జ్ మున్సే సూపర్ ఇన్నింగ్స్



టీ20 ప్రపంచ కప్ 2026 (౧20 ఔశీతీశ్రీ‌ం జబజు-2026) లో భాగంగా సోమవారం ఇటలీతో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 207 పరుగులు చేసింది. 208 పరుగుల లక్ష్యఛేదనలో ఇటలీ.. 16.4 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. బెన్ మానెంటి (52), హెన్రీ మానెంటి (37), స్మట్స్ (22) మాత్రమే రాణించారు. స్కాట్లాండ్ బౌలర్లలో మైకేల్ లీస్క్ 4, మార్క్ వాట్ 2, బ్రాడ్ క్యూరీ, బ్రాడ్ వీల్, డేవిడ్సన్ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. ఓపెనర్ జార్జ్ మున్సే (84) అద్భుతమైన హాఫ్ సెంచరీ చేశాడు. మరో ఓపెనర్ మైకేల్ జోన్స్ (37) పరుగులు రాబట్టాడు. ఈ జోడీ తొలి వికెట్‌కు 126 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. తర్వాత వచ్చిన బ్రాండన్ మెక్‌మిలన్ (41 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. రిచీ బెరింగ్టన్ (15) పరుగులు చేశాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్లో మైకేల్ లీస్క్ (22) వరుసగా 4, 2, 4, 6, 6 బాదడంతో స్కోరు 200 దాటింది. ఇటలీ బౌలర్లలో అలీ హసన్, గ్రాంట్ స్టీవర్ట్, థామస్ డ్రాకా, స్మట్స్ తలో వికెట్ తీశారు.

### ఇండియాతో ఆడాలంటే.. 3 కీలక షరతులు పెట్టిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు



**ఇస్లామాబాద్:** టీ20 వరల్డ్‌కప్‌లో ఇండియాతో ఫిబ్రవరి 15వ తేదీన జరగనున్న మ్యాచ్‌ను ఆడబోమని పాకిస్థాన్(ఙుఎఱఞుఅ జతీఱఎఎవ దీశ్ఞుతీ‌ం) చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఆ మ్యాచ్‌ను నిర్వహించేందుకు ఐసీసీ తమ వంతు ప్రయత్నం చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఇద్దరు సభ్యుల బృందం పాకిస్థాన్ వెళ్లింది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చైర్మెన్ మోషిన్ నఖ్వీతో చర్చలు నిర్వహించారు. భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు మూడు కీలక షరతులు పాకిస్థాన్ పెట్టినట్లు తెలుస్తోంది. ఓ మీడియా కథనం ప్రకారం ఆ షరతులు ఇలా ఉన్నాయి. పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు వార్షిక నిధులను ఐసీసీ పెంచాలని కోరింది. ఇక ఇండియా, భారత్ మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లను పునరుద్దరించాలని ఐసీసీని అభ్యర్థించింది. అయితే ఇండియా, పాక్ మధ్య మ్యాచ్ జరుగుతున్న సమయంలో.. ఆటగాళ్లు ఆన్‌ఫీల్డ్ ఎథిక్స్ పాటించాలని, ప్లేయర్లు అందరూ షేక్ హ్యాండ్ ఇచ్చుకోవాలని పాక్ క్రికెట్ బోర్డు ఐసీసీని కోరినట్లు తెలుస్తోంది. టీ20 వరల్డ్‌కప్ నుంచి బంగ్లాదేశ్‌ను బహిష్కరించిన నేపథ్యంలో ఆ దేశానికి మద్దతు ఇస్తూ ఇండియాతో ఆడేందుకు పాకిస్థాన్ నిరాకరించిన విషయం తెలిసిందే.ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను కలిసిన తర్వాత తుది నిర్ణయం వెల్లడించనున్నట్లు నఖ్వీ తెలిపారు.




# 'గాయపడ్డ సింహం' ట్రైజర్ రిలీజ్.. తరుణ్ భాస్కర్ కొత్త అవతారంలో..!

నూతన తరహా సినిమాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు తరుణ్ భాస్కర్ మరోసారి వార్తల్లో నిలిచారు. 'పెళ్లి చూపులు'తో టాలీవుడ్‌కు న్యూ ఏజ్ కథనం ఎలా ఉండాలో చూపించిన ఆయన, 'ఈ నగరానికి ఏమైంది' సినిమాతో కల్ట్ ఫాలోయింగ్ సంపాదించారు. దర్శకుడిగానే కాకుండా నటుడిగానూ వరుస చిత్రాలతో బిజీ అవుతున్న తరుణ్ భాస్కర్ ఇప్పుడు 'గాయపడ్డ సింహం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రానికి కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహించగా, ఫరియా అబ్దుల్లా, మానసా చౌదరి కథానాయికలుగా నటించారు. దర్శకుడు పవన్ సాధినేని సమర్పకుడిగా వ్యవహరించడం విశేషం. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాకు సంబంధించిన టీజర్, ట్రైలర్ కలిపిన "ట్రైజర్" ను తాజాగా విడుదల చేశారు. విడుదలైన ట్రైజర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. కామెడీ, వ్యంగ్యం, యాక్షన్ అంశాలను కలగలిపి సరదాగా రూపొందించినట్లు కనిపిస్తోంది. కథాంశం విషయానికి వస్తేడ అమెరికా వెళ్లాలని కలలు కనే ఓ యువకుడి జీవితంలో చోటుచేసుకునే సంఘటనల చుట్టూ సినిమా తిరుగుతుంది. వీసా రిజెక్ట్ కావడంతో అతడు ఎదుర్కొనే నిరాశ, ఫ్రస్ట్రేషన్, ఆ తర్వాత తీసుకునే నిర్ణయాలు కథకు ప్రధానాంశాలుగా ఉంటాయని ట్రైజర్ ద్వారా అర్థమవుతోంది. మధ్య మధ్యలో వచ్చే యాక్షన్ ఎపిసోడ్‌లు, కేజీఎఫ్ స్పూఫ్ సన్నివేశాలు, అమెరికా వెళ్లకపోయినా హీరో ఇచ్చే బిల్డప్ డైలాగులు వినోదాన్ని పంచుతున్నాయి. ప్రత్యేకంగా ట్రైజర్‌లో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సూచించే విధంగా చూపించిన సన్నివేశాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. అమెరికా వీసా నిబంధనల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న యువత ఆవేదనను ప్రతిబింబించే ప్రయత్నం చేసినట్లు అనిపిస్తోంది. క్యాప్షన్ ద్వారా చిత్ర బృందం కథలో ఉన్న అంతర్గత భావాన్ని స్పష్టంగా చెప్పింది. వేసవి కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి నిర్మాతలు సిద్ధమవుతున్నారు. దర్శకుడిగా ఇప్పటికే విజయాలు అందుకున్న తరుణ్ భాస్కర్‌కు నటుడిగా ఈ సినిమా ఎలాంటి బ్రేక్ ఇస్తుందో చూడాలి. వినోదంతో పాటు సమాజంలోని యువత సమస్యలను టచ్ చేస్తూ తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.



# కన్నడ చిత్రసీమలోకి మీనాక్షి చౌదరి ఎంట్రీ?

టాలీవుడ్‌లో తక్కువ కాలంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మీనాక్షి చౌదరి, కన్నడ చిత్రసీమలోకి అడుగుపెట్టనున్నట్లు వార్తలు వస్తున్నాయి. రక్షిత్ శెట్టి నటించిన సూపర్ హిట్ చిత్రం '777 చార్లీ' సీక్వెల్‌లో ఆమెను హీరోయిన్‌గా ఎంపిక చేశారని ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది. ప్రస్తుతం మీనాక్షి నాగచైతన్యతో 'వృషకర్మ'తో పాటు మరో రెండు చిత్రాల్లో నటిస్తోంది. తన పట్టుదలతో, సరైన అవకాశాలను అందిపుచ్చుకుంటూ మీనాక్షి రాబోయే రోజుల్లో ఇతర ఇండస్ట్రీల్లోనూ తన సత్తా చాటుతుందని అభిమానులు నమ్ముతున్నారు. ఇటీవల కాలంలో తెలుగులో మీనాక్షి వరుస హిట్లతో దూసుకుపోతోంది. ముఖ్యంగా 'గుంటూరు కారం', 'లక్కీ భాస్కర్', ' సంక్రాంతికి వస్తున్నాం ' వంటి చిత్రాలు ఆమె ఖాతాలో భారీ విజయాలుగా నిలిచాయి. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో మీనాక్షి క్రేజ్ నెక్స్ట్ లెవల్‌కు వెళ్లిందని చెప్పొచ్చు.

## బుల్లిరాజు కొత్త సినిమా.. పవర్‌ఫుల్‌గా టీజర్



అనన్య శర్మ, ఎస్ కృష్ణ ప్రధాన పాత్రల్లో వస్తోన్న లేటేస్ట్ మూవీ హై. ఈ సినిమాకు ఎస్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఇమేజ్‌స్పార్క్ ఎంటర్‌టైన్‌మెంట్, మైరా క్రియేషన్స్ బ్యానర్లపై హరీష్ పెద్ది, ఎస్ కృష్ణ, శేఖర్ దివ్వెల నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. టాలీవుడ్ హీరో విక్టరీ వెంకటేశ్ చేతుల మీదుగా ఈ టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్ చూస్తుంటే యూత్‌ఫుల్ క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. టీజర్‌లో సన్నివేశాలు క్రైమ్ స్టోరీని తలపించేలా ఉన్నాయి. సంక్రాంతికి వస్తున్నాం ఫేమ్ బుల్లిరాజు(రేవంత్) ఈ టీజర్‌లో స్పెషల్ అట్రాక్షన్‌గా కనిపించాడు. కాగా.. ఈ సినిమాలో రేవంత్ (బుల్లిరాజు), పల్లవి దొర, కృష్ణ కమల్, సాయికృష్ణ కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి వికాస బాదిసా సంగీతమందిస్తున్నారు.

## మరోసారి భయపెట్టబోతున్న ఆది సాయికుమార్!




'శంబాల' చిత్రంతో రీసెంట్‌గా ఆది సాయి కుమార్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్నారు. మరోసారి అద్భుతమైన కథతో ఆడియెన్స్ ముందుకు వచ్చేందుకు సిద్దంగా ఉన్నారు. ఆది సాయికుమార్ హీరోగా, గ్లామరస్ హీరోయిన్ వేదిక హీరోయిన్‌గా నటించిన హారర్ థ్రిల్లర్ మూవీ 'జంగిల్' త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. సరికొత్త కథనం, ఒళ్లు గగుర్పొడిచే నేపథ్యం, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా రూపొందింది అని చిత్రయూనిట్ చెబుతోంది. ఈ చిత్రాన్ని ఫ్రైడే పిక్చర్స్ బ్యానర్ మీద రాఘవ రెడ్డి పబ్బతి ప్రతిష్టాత్మకంగా తెలుగులో విడుదల చేయడానికి సిద్ధమయ్యారు. థియేట్రికల్, శాటిలైట్, డిజిటల్ రైట్స్‌తో పాటు అన్ని హక్కులను ఫ్రైడే పిక్చర్స్ స్వాధీనం చేసుకోవడం విశేషం. అతి త్వరలోనే గ్రాండ్ రిలీజ్ ప్లాన్ చేస్తోంది టీం. ప్రస్తుతం 'జంగిల్' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. ఫైనల్ వీఎఫ్ఎక్స్ వర్క్స్ శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ మూవీలో ఆది సాయికుమార్ పూర్తిగా భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. అలాగే వేదిక పాత్ర సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని చిత్ర యూనిట్ వెల్లడించింది. హారర్‌తో పాటు సస్పెన్స్, థ్రిల్లర్ అంశాలను సమపాళ్లలో మేళవించిన ఈ సినిమా ప్రేక్షకులను చివరి వరకు కట్టిపడేస్తుందని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. త్వరలో ట్రైలర్‌తో పాటు ఫస్ట్ లుక్‌ను అధికారికంగా లాంచ్ చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఇకపై కంటిన్యూగా అప్డేట్‌లను ఇస్తామని టీం చెబుతోంది.



# ఫైనల్‌గా సెట్స్ మీదకు హనుమాన్ 2!

'హనుమాన్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో సెన్సేషన్ క్రియేట్ చేసిన ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి రాబోతున్న మరో పవర్‌ఫుల్ ప్రాజెక్ట్ 'హనుమాన్ 2'. ఈ సినిమాపై ఇప్పటికే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాగా.. ప్రేక్షకులు అండ్ సినీ లవర్స్‌లో హై ఎక్స్‌పెక్టేషన్స్ నెలకొన్నాయి. అలాగే హనుమంతుడిగా రిషబ్ శెట్టి ఫస్ట్ లుక్ పోస్టర్‌కు కూడా నెట్టింట్ సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ఇదిలా ఉంటే.. ఈ మధ్య కాలంలో హనుమాన్ 2 నుంచి ఒక్క అప్డేట్ కూడా రాకపోవడంతో అసలు ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్తుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్న క్రమంలోనే తాజాగా అదిరిపోయే బజ్ నెట్టింట సందడి చేస్తుంది. చాలా గ్యాప్ తర్వాత ప్రశాంత్ వర్మ 'హనుమాన్2' సినిమాను లాక్ చేసినట్లు తెలుస్తుంది. మార్చి నుండి షూటింగ్ ప్లాన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తుండగా.. వచ్చే ఏడాది గ్రాండ్ పాన్-ఇండియా విడుదలకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.

# ధనుష్‌తో ప్రేమాయణం .. మృణాల్ ఠాకూర్‌పై మరో హీరో పూల వర్షం.. !



బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ ఈ మధ్య కాలంలో డేటింగ్, పెళ్లి రూమర్లతో హాట్ టాపిక్‌గా నిలుస్తూ ఉండడం మనం చూస్తూ ఉన్నాం. ఈ రూమర్స్ మధ్య బాలీవుడ్ హీరో చేసిన పని హాట్ టాపిక్‌గా మారింది. యంగ్ హీరో సిద్ధాంత్ చతుర్వేది మృణాల్‌పై పూల వర్షం కురిపించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. మృణాల్ ఠాకూర్, సిద్ధాంత్ చతుర్వేది కలిసి నటించిన తాజా చిత్రం 'దో దీవానే షెహర్ మే' ప్రమోషన్లలో భాగంగా ఈ జంట ఒక ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవెంట్ వేదిక బయట ఫొటోగ్రాఫర్లతో మాట్లాడుతున్న మృణాల్‌పై సిద్ధాంత్ గొడుగులో నింపుకుని తెచ్చిన పూలతో అకస్మాత్తుగా పూల వర్షం కురిపించాడు. దీనికి మృణాల్ ఇచ్చిన స్మైల్ రియాక్షన్ నెటిజన్లను ఆకట్టుకుంది. అక్కడితో ఆగని సిద్ధాంత్, అదే ప్రమోషనల్ ఈవెంట్ స్టేజ్‌పైనా మరోసారి మృణాల్‌పై పూలు చల్లాడు. ఈ రెండు ఘటనలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో వీరిద్దరి మధ్య ఏదైనా ప్రత్యేక బంధం ఉందా అనే చర్చలు మొదలయ్యాయి. అభిమానులు, నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్లు చేస్తూ ఊహాగానాలు పెంచుతున్నారు. మరోవైపు మృణాల్ ఠాకూర్ తమిళ స్టార్ హీరో ధనుష్‌తో డేటింగ్‌లో ఉందనే వార్తలు కూడా కొంతకాలంగా వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి 14న వీరిద్దరి పెళ్లి జరుగుతుందనే రూమర్లు వచ్చినప్పటికీ మృణాల్ టీమ్ వాటిని ఖండించింది. అవి కేవలం పుకార్లేనని స్పష్టం చేసింది. అయినప్పటికీ ఈ డేటింగ్ వార్తలు మాత్రం పూర్తిగా చల్లారలేదు. సిద్ధాంత్‌తో మృణాల్ తరచుగా కలిసి కనిపించడం కూడా కొత్త చర్చలకు దారితీస్తోంది. అయితే వీరిద్దరూ కలిసి సినిమా చేస్తున్న కారణంగా ప్రమోషన్లలో భాగంగానే కలుస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. కానీ ప్రమోషన్‌లకు అతీతంగా కూడా కలిసి కనిపించారనే వార్తలు రావడంతో ఊహాగానాలు మరింత పెరుగుతున్నాయి. ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ తెలుగు, హిందీ భాషల్లో వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. 'దో దీవానే షెహర్ మే' చిత్రం ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రానుండగా, అడివి శేష్‌తో కలిసి నటించిన తెలుగు సినిమా 'డెకాయిట్' ఏప్రిల్ 10న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో మృణాల్ వ్యక్తిగత జీవితం, కెరీర్ రెండూ కూడా వార్తల్లో నిలుస్తున్నాయి.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

ధర్మఘంట

# అవినీతికి బీజం పడేది ఇక్కడే..మారాల్సింది ఓటరు ఆలోచనే...!



ఎప్పుడైనా ఓటు వేయక ముందు,వేసిన తర్వాత ఒక్కసారి ఆగి ఓటు ఎందుకు వేయాలి? ఎందుకు వేశామని ఆలోచించామా? నా ఓటు నా గ్రామానికి రోడ్డు తెచ్చిందా? నా పిల్లలకు మంచి పాఠశాల, ఆసుపత్రి ఇచ్చిందా? లేదా కేవలం రూ.500 లకు,ఒక సారా బాటిల్ కు లేదా “మనవాడు“ అనే భావన కోసం ఆలోచన లేకుండా వేశామా?అనే ఒక బాధ్యతాయుతమైన ప్రశ్న ఎప్పుడైనా వేసుకున్నామా? లేదు.ఎందుకంటే ఓటును ఒక ఆదాయ మార్గంగా చూస్తున్నాం కాబట్టి.ఏ ఆలోచన లేకుండా వేసే ఓటు అవినీతికి ఆసరాగా మారుతుంది.దేశంలో అవినీతికి బీజం ఇక్కడే పడుతుంది.ఓటు పెట్టెలో పడే ఆలోచన లేని ఓటు భవిష్యత్ తరాలకు భానిసత్వం చూపుతుంది.ఇది మనకు చాలా చిన్న విషయంగా అనిపిస్తుంది. కానీ,అసలు మూలం ఇక్కడి నుండే మొదలవుతుందని మనం అర్థం చేసుకునే స్థితిలో లేకుండా మన మెదళ్ళను కలుషితం చేశారు.

**ఏటికేడు పెరుగుతున్న ఓటు విలువ**

భారత ప్రజాస్వామ్య దేశంలో ఒకనాడు ఓటు అనేది పవిత్రమైనటువంటి కార్యంగా భావించేవారు.నేడు అది అత్యంత అపవిత్రంగా మారినటువంటి నేపథ్యం మనకు కనిపిస్తా ఉంది.ఓటు ఒక్క విలువ ఏటికేడు ఏడింతలు పెరుగుతూ పోతుంది. పెరుగుతున్న విలువ సరైన ప్రతినిధిని ఎన్నుకోవడంలో కాదు,సరైన ధర పలకడంలో పెరుగుతూ ఉంది.ఎన్నికల్లో పోటీ చేసేవారు,పోటీ చేసిన వారికి ఓట్లేసేవారు పోటీపడి మరి ఓటు యొక్క ధరను పెంచేస్తున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మార్చి 1 నుంచి ఎన్నికల ముగింపు వరకు ఎన్నికల సంఘం (ఈసి) రికార్డు స్థాయిలో రూ.10,000 కోట్లు (సుమారు 10 వేల కోట్లు) విలువైన నగదు,మద్యం,డ్రగ్స్, బంగారం,ఫ్రీబీస్ సీజ్ చేసింది. ఇది దేశ చరిత్రలోనే అత్యధికం. 2019తో పోలిస్తే దాదాపు 3 రెట్లు ఎక్కువ. ఇది ఏమిటంటే...మన ఓట్ల కోసం పార్టీలు ఎంత డబ్బు పోస్తున్నాయో చూపిస్తుంది.ఆ డబ్బు తిరిగి ఎలా వస్తుంది? అవినీతి ద్వారానే కదా అనే స్పృహ ఓటరుకు లేదు.అంత ఖర్చు చేసి గెలిచిన వ్యక్తి కాంట్రాక్టులు, లైసెన్సులు,భూములు అమ్ముకోవడం ద్వారా అవినీతిని పెంచి పోషించడం సాధారణ విషయమే కదా? ఇక్కడ మొదలైన అవినీతి చక్రం ఎలా పనిచేస్తుందంటే ఓటరుకు తక్షణ లాభం వర్సెస్ దీర్ఘకాలిక నష్టంగా మారుతుంది.ఓటరు రూ.1000 నుండి రూ.5000 పోటీ చేసిన అభ్యర్థి దగ్గర తీసుకుంటాడు,ఓటు వేస్తాడు, అభ్యర్థి గెలుస్తాడు. గెలిచిన అభ్యర్థి పెట్టిన ఖర్చును రికవర్ చేయడానికి రోడ్లు,బ్రిడ్జీలు, హాస్పిటల్స్ ఇతర రంగాల కాంట్రాక్టుల్లో కాంట్రాక్టర్ల నుండి 20 నుండి 40% కమిషన్ తీసుకుంటాడు.ఆ డబ్బు ఎక్కడి నుండి వస్తుంది.మళ్లీ మనం కట్టే పన్నుల నుంచే వస్తుంది.అంటే... మనమే మన డబ్బును తిరిగి అమ్మేస్తున్నామని అర్థం. ఎందుకిలా మారుతుంది.. ఓటరు చైతన్యం ఎలా కలిగించాలి? సమాజంలో నా ఒక్కడి వల్లనే మార్పు వస్తుందా? నేను నీతిగా ఉన్నంత మాత్రాన అందరూ నీతివంతులు అవుతారా? అందరూ తీసుకొని నేను తీసుకోనంత మాత్రాన గెలిచేవాడు గెలవకుండా పోతాడా? అయినా ఇప్పుడు నీతి న్యాయం ఎక్కడున్నాయి? అంటూ ప్రతి ఒక్కరూ సామాజిక అంగీకారానికి వచ్చేస్తారు. అందరూ తీసుకుంటున్నారు కదా...నేను ఒక్కడినే ఎందుకు వదులుకోవాలి?“ అనే భావన వల్ల ఓటు అమ్మకం “నార్మల్“ అయిపోతుంది.ఇది అవినీతిని సామాజికంగా ఆమోదయోగ్యంగా మారుస్తుంది.పరిశోధనలు చెప్పే సత్యం ఏమిటంటే... భారతదేశంలో రేడియో క్యాంపెయిన్‌ల ద్వారా ఓటర్లకు “కరప్షన్ ఇష్యూ“ గురించి అవగాహన కలిగించగా ఓటు కొనుగోలు చేసే పార్టీల ఓటు షేర్ 6 నుండి 10% తగ్గింది.అంటే అవగాహన వచ్చిన ఓటర్లు అవినీతిపరులను తిరస్కరిస్తున్నారని అర్థం చేసుకోవాలి.కాబట్టి ఓటరే మారాలి. అవినీతిని అంతం చేయాలంటే చట్టాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ముఖ్యమే కానీ, అందరికంటే ముందు ఓటరు మారాలి. ఎందుకంటే ఓటరు ఎన్నుకునే నాయకుడే పాలన నిర్ణయిస్తాడు.ఈ అభ్యర్థి గత 5 నుండి 10 ఏళ్లలో నా ప్రాంతానికి ఏం చేశాడు? (కేవలం హామీలు కాదు,రియల్ వర్క్ చూడండి) వారి హామీలు వాస్తవికంగా సాధ్యమా? లేక ఫ్రీ బీజాలతో ఓట్లు కొనడమేనా?ఈ అభ్యర్థి/పార్టీకి క్రిమినల్ కేసులు ఉన్నాయా? (ఈసీఐ వెబ్‌సైట్‌లో ఆఫడవిట్ చూడవచ్చు) నా ఓటు నా పిల్లల భవిష్యత్తుకు ఏం ఇస్తుంది?ఉద్యోగాలు,విద్య, ఆరోగ్యం ఎలా అందిస్తుంది? రూ.500 తీసుకుని ఓటు వేస్తే 5 ఏళ్లలో నాకు ఎంత నష్టం వస్తుంది? (పన్నుల రూపంలో, అభివృద్ధి లేకపోవడంలో) “మనవాడు“ అని ఓటు వేస్తే...ఆ “మనవాడు“ నా గ్రామానికి ఏం చేశాడు? ఈ ఎన్నికల్లో రూ.10,000 కోట్లు సీజ్ అయ్యాయి.ఆ డబ్బు నా ఓటు కోసమేనా? నేను ఓటు అమ్మితే నా పిల్లలు భవిష్యత్తులో ఎలాంటి దేశంలో బతకాలి? నా ఓటు దేశ అవినీతి చక్రాన్ని ఆపగలదా? నేను ఆలోచించి ఓటు వేస్తే దేశం మారుతుందా? ఇవి ప్రతి ఓటరు తనకు తాను అడుక్కోవాల్సిన 10 కీలక ప్రశ్నలు.

**ఎవరికీ వారే ఒక మార్పు కావాలి**

ఓటు హక్కు కేవలం ఒక హక్కు కాదు.అది దేశ భవిష్యత్తును నిర్ణయించే ఆయుధం.ఆలోచన లేకుండా వేస్తే అది అవినీతికి ఆయుధం అవుతుంది. ఆలోచనతో,వివేకంతో వేస్తే అది దేశాన్ని నిర్మలం చేసే ఆయుధం అవుతుంది. మనమందరం ఓటర్లమే,మనమే మారితే దేశం మారుతుంది.అలోచించి వేసిన ఓటే నిజమైన ఓటు.ఆలోచన లేని ఓటు దేశాన్ని అవినీతిలోకి నెట్టివేస్తుంది.ప్రజాస్వామ్య మూల అర్థాన్ని మార్చివేస్తుంది. ఈ వ్యాసం మీకు వాస్తామని అనిపిస్తే వాట్సాప్ గ్రూపుల్లో, సోషల్ మీడియాలో షేర్ చేయండి.ఒక్కో ఓటరు చైతన్యంగా మారితే దేశం మారుతుంది.

**గంట సోమన్న,సీనియర్ జర్నలిస్ట్.**

## కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో 163 బి.ఎన్.ఎస్.ఎస్ సెక్షన్ అమలు : కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌస్ ఆలం.



**ధర్మఘంట, ఫిబ్రవరి 09 కరీంనగర్:** నగరంలో, జిల్లాలోని పలు మున్సిపాలిటీలలో ఈ నెల 11వ తేదీన జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 163 బి.ఎన్.ఎస్.ఎస్ సెక్షన్ (గతంలో 144 సెక్షన్) విధిస్తూ కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌస్ ఆలం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఎన్నికలు జరుగనున్న ప్రాంతాల్లో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడటంపై నిషేధం. నిషేఆజ్ఞలు అమలులో ఉండే ప్రాంతాలు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, చొప్పదండి, హుజూరాబాద్ మరియు జమ్మికుంట మున్సిపాలిటీల పరిధిలో ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని పేర్కొన్నారు. నిషేధాజ్ఞల సమయం ఫిబ్రవరి 10వ తేదీ ఉదయం 06:00 గంటల నుండి 12వ తేదీ ఉదయం 06:00 గంటల వరకు ఈ నిబంధనలు అమల్లో ఉండనున్నాయి. ఏదైనా చట్టబద్ధమైన సమావేశాలు లేదా కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తే, సంబంధిత అధికారుల నుండి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా, శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని కమీషనర్ విజ్ఞప్తి చేశారు.ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ప్రజా శాంతిని కాపాడటం మరియు స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణే ఈ ఉత్తర్వుల ముఖ్య ఉద్దేశ్యం అని సీపీ పేర్కొన్నారు.

## ఆన్లైన్లో కూడా ఓటర్ స్లిప్పులు డౌన్లోడ్ చేసుకునే సౌకర్యం....



అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణశ్రీ

**ధర్మఘంట,ఫిబ్రవరి09,రామగుండం:** ఫిబ్రవరి 11. 2026 బుధవారం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆన్ లైన్ లో కూడా ఓటర్ స్లిప్పులను డౌన్ లోడ్ చేసుకునే సౌకర్యం ఉందని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ తెలిపారు. పోలింగ్ కేంద్రం చిరునామా , ఓటర్ క్రమ సంఖ్య తెలుసుకోవడానికి ఉపకరించే ఈ ఓటర్ స్లిప్పులను రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం ఆద్వర్యంలో ఇప్పటికే ఇంటింటికీ పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు . అయితే ఇక్కడ ఓటు ఉండి ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు కూడా ఈ స్లిప్పులను పొందడానికి తెలంగాణ రాష్ట్రం ఎన్నికల సంఘం వెబ్ సైట్ సందర్శించి “డౌన్ లోడ్ ఓటర్ స్లిప్ బై ఎపిక్ ఐ డి అర్బన్ 2025” విండో తెరిచి జిల్లా , మునిసిపాలిటీ , వార్డు , ఎపిక్ ఐడి అనగా ఓటర్ గుర్తింపు కార్డు నెంబర్ వివరాలు ఇవ్వగానే ఓటర్ స్లిప్ డౌన్ లోడ్ అవుతుందని అన్నారు . అంతేకాకుండా (టి పోల్) యాప్ ద్వారా కూడా ఓటర్ స్లిప్ డౌన్ లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన ఒరిజినల్ గుర్తింపు కార్డు చూపించి పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

## “టెన్త్“ విద్యార్థులను చదివించండి ఇలా...!



**ధర్మఘంట ఫిబ్రవరి 09 హైదరాబాద్:**పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఎప్పుడు ఏ పరీక్ష అనే విషయాన్ని ప్రభుత్వం విడుదల చేసింది.టెన్త్ సదువుతున్న పిల్లలను ఉదయం 5గంటలకు నిద్ర లేపండి.లేవగానే పుస్తకం పట్టుకో అని కాకుండా, ముందు “కళ్ళను నీళ్లతో తుడుచుకో“ అని చెప్పండి. పిల్లలను నిద్ర లేపి మళ్లీ మనం పడుకునే బదులు వాళ్లను మోటివేట్ చేయడం కోసం పదో తరగతి సదువుతున్న పిల్లల పేరెంట్స్ (తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు)ఈ కొన్ని రోజుల పాటు వేకువజామున నిద్రను తరిమి కొట్టాల్సిందే.మనం మెలకువగా ఉండి,పిల్లల్ని“చదువు“ అంటే మంచిది.ఒక వేళ పిల్లలు నిద్ర ఆపుకోలేక కునుకుపాట్లు పడితే వారిని దయచేసి తిట్టకండి.(ఎట్ ఎనీ కాస్ట్ డోంట్ అబ్యూస్ థెం) గిట్లైతే?! ఇగ నువ్వు పాసయినట్టే, “ఓ..నిద్ర“ ఇగ నువ్వు పాస్ కావు“ ఫెయిల్ ఐతవని మాట్లాడకండి. నిద్ర కళ్ళు ఉంటే?!లేచి నించుని మళ్ళీ చదవమని చెప్పడం బెటర్.ఇక కొన్ని రోజుల పాటు మొబైల్,ఇంటర్నెట్,టీవీ బంద్ చేస్తే మరింత ఉత్తమ ఫలితాలు ఖాయం.వీలైతే ఇంట్లో పాలు ఉంటే?!కాఫీ లేదా టీ పెట్టి ఇస్తే మంచిది.అంతే తప్ప అరచి గాయ్..గాయి చేసి కటువుగా, కర్కశంగా తిడితే? పొద్దున పొద్దున్నే బ్లాంక్ పేపర్ లా ఉండే మైండ్ లో ప్రోత్సాహం/ప్రేరణ బదులు,సదవకపోతే తిట్టే తిట్లే మైండ్ లో దిగిపోతాయి.కాబట్టి ఓపికతో ప్రోత్సాహం ఇవ్వండి, వారికి ఉత్సాహం నింపండి.మన వాళు ్ళ స్టేట్ టాప్ ర్యాంక్ కొట్టాలనే ఓ అద్భుత అస్త్రంను మనం తయారు చేస్తున్న భావనతోనే ఉండాలి.మీ బాబు/పాప టెన్త్ అదరగొట్టాడు కదా కంగ్రాట్స్ అని బంధుమిత్రులు,వాళు ్ళ,వీళ్ళు ఫోన్ చేసి కంగ్రాట్స్ చెప్పాలి. మేడం,సార్ మీ అబ్బాయి/అమ్మాయి ఫోటో కావాలి అంటూ మీడియా మీ వెంట పడాలి. సార్/మేడం మీ అబ్బాయికి/అమ్మాయికి ఫ్రీ సీట్ ఇస్తాం మా కాలేజీలో చేర్చరా అంటూ ప్రాధేయపడాలి.ఇదంతా తపన,శ్రద్ధతోనే సాధ్యం.ఏ మాత్రం అశ్రద్ధ ఉన్నా..ఈ కొన్ని రోజుల పాటు తరిమి కొట్టండి. మాచన రఘునందన్ పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తాహశీల్దార్,వ్యక్తిత్వ వికాస నిపుణులు 9441252121

# అభివృద్ధి ఆధ్యాత్మికం,ఆదర్శం



అంశాలే ప్రధానంగా ప్రచారం నిర్వహించిన కేంద్ర మంత్రి బండి సంజయ్.

అసెంబ్లీ, ఎంపీ ఎన్నికలకు మించి రాత్రింబవళ్లు కార్యకర్తలే గెలుపే లక్ష్యంగా పనిచేసిన కేంద్ర మంత్రి

**ధ్దర్మఘంట ఫిబ్రవరి 9 కరీంనగర్,**ఈసారి మా ఓటు బీజేపీకే అంటూ బహిరంగంగానే చెబుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వైనం.మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. ప్రధాన రాజకీయ పార్టీల ప్రచార సరళి, ఎన్నికల ఎజెండా, అభ్యర్థుల గెలుపు కోసం వేసే ఎత్తుగడలు వంటి అంశాలను పరిశీలిస్తే అన్నింట్లోనూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అగ్రభాగాన నిలిచారు. ఈ ఎన్నికల్లో బండి సంజయ్ ప్రధానంగా మూడు అంశాలను ప్రస్తావిస్తూ ప్రజల్లో ఆలోచన రేకెత్తిస్తూ వారిని ఆకట్టుకునేందుకు ప్రయత్నించారు. మొదటిది అభివృద్ధి నినాదం. రెండోది ఆధ్యాత్మికం కాగా మూడో అంశం ఆదర్శవంతమైన పాలన.కరీంనగర్ కార్పొరేషన్ సహా జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలన్నింటిలోనూ భారతీయ జనతా పార్టీ ప్రచారంలోనూ ముందంజలో ఉంది. ముఖ్యంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నీ తానై ప్రచారంతోపాటు అభ్యర్థుల గెలుపు బాధ్యతలను పూర్తిగా తన భుజాన వేసుకుని పనిచేశారు. ఒకవైపు ప్రచారం..మరోవైపు పార్టీ కార్యక్రమాలు...ఇంకోవైపు పోల్ మేనేజ్ మెంట్ సహా అన్నీ పనులు ఒంటి చేత్తో నిర్వర్తిస్తూ... ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు పెద్దగా కష్టం లేకుండా చేయడంలోనూ బండి సంజయ్ అగ్రభాగాన నిలిచారు. ఎన్నికల ప్రచారంలో బండి సంజయ్ ఈసారి విభిన్న రీతిలో ప్రచారం నిర్వహించారు. హిందుత్వ నినాదాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తారని ప్రత్యర్థ పార్టీలు భావించారు. అందుకు భిన్నంగా పూర్తిగా అభివృద్ధి నినాదంతోనే ప్రజల్లోకి వెళ్లారు. కరీంనగర్ కార్పొరేషన్ సహా జిల్లాలోని మున్సిపాలిటీల అభివృద్ధికి మోదీ ప్రభుత్వం ఇచ్చిన నిధులు... కేంద్రాన్ని ఒప్పించి మెప్పించి తాను తెచ్చిన నిధులతో జరిగిన అభివృద్ధి పనులను ప్రతి మీటింగ్ లోనూ వివరిస్తూ బండి సంజయ్ మాటలకే పరిమితం కాలేదు... చేతల్లో చూపుతున్న అభివృద్ధి కాముకుడు అనే భావనను ప్రజలకు కలిగించడంలో సక్సెస్ అయ్యారు. ఇకో రెండో విషయాన్ని బండి సంజయ్ లో స్వతహాగా దైవ భక్తి, అధ్యాత్మిక చింతన ఎక్కువ. ప్రజల్లో అధ్యాత్మిక చింతన పెంపొందించాలనే ఉద్దేశంతో ఎన్నికల ప్రచారంలో ప్రతి కాలనీ, డివిజన్ లో ఎక్కడ ఆలయాలు అభివృద్ధికి నోచుకోలేదో...వాటిని అభివృద్ధి చేస్తానని మాట ఇచ్చారు. అదే సమయంలో ప్రజలు ఎక్కడ ఆలయం కావాలని కోరితే... అక్కడ నూతన ఆలయాలను నిర్మిస్తానని కూడా హామీ ఇవ్వడం గమనార్హం. ఇక మూడో విషయానికొస్తే కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ తోపాటు ఆయా మున్సిపాలిటీల్లో ఛైర్మన్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే..అవినీతి, కబ్జాదారుల అంతు చూస్తానని, కరీంనగర్ ప్రజలకు రక్షణ కవచంగా నిలుస్తానని చెబుతూ వచ్చారు. అవినీతికి, భూకబ్జాలకు తావు లేకుండా కరీంనగర్ ను అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన పాలన అందించే బాధ్యత తీసుకుంటానంటూ భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. మొత్తంగా బండి సంజయ్ ఎంచుకున్న ఈ మూడు అంశాలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాయి. సంజయ్ ఎక్కడ స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించినా తండోపతండాలుగా తరలివచ్చారు. మండు టెండలోనూ ఓపికగా సంజయ్ ప్రసంగాలను ఆసక్తితోవింటూ.చప్పట్లతో తమ ఆనందాన్ని వ్యక్తం చేయడం విశేషం. మరోవైపు సంజయ్ ప్రచార సరళి, ఎన్నికల ఎత్తుగడ దెబ్బకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పూర్తిగా ఆత్మరక్షణలో పడిపోయాయి. అటు ప్రచార సరళిలో, ఇటు ఎన్నికల ఎత్తుగడలో పూర్తిగా వెనుకబడిపోయారు. ప్రధాన పార్టీల ముఖ్య నేతలు సైతం ఏం చేయాలో తెలియక నిశ్చేష్టులైపోవడం గమనార్హం.ఇక అభ్యర్థుల విషయానికొస్తే... వర్గ పోరుతో కాంగ్రెస్ అభ్యర్థుల విజయాలు పూర్తిగా దెబ్బతీసే ప్రమాదం ఏర్పడింది. ముఖ్య నేతలంతా తమ అనుచరుల గెలుపుకే పరిమితమవుతూ...ఇతర డివిజన్లలో పోటీ చేస్తున్న అభ్యర్థులనూ పట్టించుకున్న దాఖలాల్లేవు. అధికారంలో ఉన్నంత కలం పార్టీ ఫిరాయింపులకు పెద్ద పీట వేసిన బీఆర్ఎస్ పార్టీకి ఇప్పుడు ఫిరాయింపులే తలనొప్పులుగా నిలిచాయి. మున్సిపల్ ఎన్నికలకు ముందే ఆ పార్టీ నుండి పలువురు మాజీ కార్పొరేటర్లు బీజేపీలో చేరారు. ప్రస్తుతం పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థుల్లో చాలా ఎన్నికల ప్రచారంలో ఇంటింటికీ వెళుతూ... తమకు ఓటేయాలని, గెలిచిన తరువాత తాము కూడా బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరుతామంటూ ఓటర్లకు చెబుతూ ఓట్లను అభ్యర్థించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇక బీజేపీ విషయానికొస్తే. అభ్యర్థుల గెలుపు బాధ్యతలను పూర్తిగా తన భుజాన వేసుకుని ఎన్నికలను ఒంటి చేత్తో నడిపించారు. పార్టీ కండువాలు, టోపీలు, కరపత్రాలుసహా ప్రచార సామాగ్రి మొత్తాన్ని తానే అభ్యర్థులకు పంపించారు. పార్టీ కార్యక్రమాలకు అయ్యే ఖర్చునంతా తానే భరించారు. బీజేపీ పక్షాన పోటీ చేసిన అభ్యర్థుల్లో 90 శాతం మంది పేద, మధ్య తరగతి వారే. రాష్ట్రంలో ఎన్నడూ అధికారంలో లేకపోవడం, పదవుల్లో కూడా లేకపోవడంతో వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంది. కుటుంబ నిర్వహణే కష్టంగా ఉన్న అభ్యర్థులు కుటుంబాలు చాలా ఉన్నాయి. అలాంటి వారందరికీ ఎన్నికలకు అవసరమైన ఆర్థిక సాయాన్ని కూడా స్వయంగా బండి సంజయ్ అందించారు. కొంత మంది అభ్యర్థులకు నామినేషన్ పత్రాలకు అవసరమైన డిపాజిట్ సొమ్మును కూడా బండి సంజయ్ పంపించడం గమనార్హం. ఎన్నికల ప్రచార వ్యవధి తక్కువగా ఉండటంతో పొద్దున్నే 6 గంటలు మొదలు రాత్రి 10 గంటలదాకా వారి గెలుపు కోసం కాలికి బలిపం కట్టుకుని గల్లీ గల్లీలోనూ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తూ ఓట్లను అభ్యర్థించారు. ప్రచార సమయం ముగిసిన తరువాత సైతం పోల్ మేనేజ్ మెంట్, మరుసటి రోజు పార్టీ కార్యమాల నిర్వహణపై కసరత్తు చేస్తూ ప్రతి గడప గడపకూ బీజేపీని తీసుకెళ్లడంతోపాటు ఈసారి కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు మున్సిపాలిటీల్లో బీజేపీ గెలుపు తథ్యం అనే వాతావరణం కల్పించడంలోనూ బండి సంజయ్ వందకు వంద శాతం సక్సెస్ అయ్యారని రాజకీయ విశ్లేషకులు, జర్నలిస్టు వర్గాలు చెప్పడం గమనార్హం.

ఏ విధమైన బ్యాక్ గ్రౌండ్ లేని, రాజకీయ అనుభవం లేని, పార్టీ జెండా పట్టకుని పనిచేసిన కార్యకర్తలను పార్టీ అభ్యర్థులుగా బరిలో వారి గెలుపు కోసం బండి సంజయ్ పడుతున్న తపన, చెమటోడుస్తున్న తీరును చూసి కరీంనగర్ ప్రజలంతా “రాజకీయ నాయకులు సాధారణంగా తాము ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే సమయంలో మాత్రమే కార్యకర్తలను వాడుకుని ఎన్నికలయ్యాక పట్టించుకోరు. బండి సంజయ్ మాత్రం తన గెలుపు కోసం పనిచేసిన కార్యకర్తలందరినీ గుర్తు పెట్టుకుని వారికి ఒకవైపు ఆర్థిక సహకారం చేస్తూనే, మరోవైపు ఆ కార్యకర్తలను సర్పంచ్, కౌన్సలర్, కార్పొరేటర్ టిక్కెట్లు ఇవ్వడమే కాకుండా వారి గెలుపు బాధ్యతను సైతం తన భుజానా వేసుకుని రాత్రింబవళ్లు కష్టపడుతున్న తీరు అద్భుతం. కార్యకర్తలపట్ల ఇంతటి ప్రేమ, బాధ్యత కలిగిన లీడర్ ను మేము ఇంతకు ముందెన్నడూ చూడలేదు... ఇక భవిష్యత్తులోనూ చూస్తామనే నమ్మకం లేదు... శభాష్ సంజయ్”అంటూ వేనోళ్ల చర్చించుకోవడం గమనార్హం.



ధర్మఘంట

# అభివృద్ధి ముందుకు సాగడానికి, సంక్షేమ ఫలాలు అందరికీ చేరడానికి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి ...

**ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆలోచన చేసే ప్రభుత్వం మాది ...**
**అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకువచ్చాం ..**
**మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఎన్ని వేల కోట్లయినా ఇస్తాం..**
**ప్రజా ప్రభుత్వంలో పట్టణాల్లో ప్రశాంత వాతావరణం..**
**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**ఖమ్మం/ధర్మ/ఘంట/ఫిబ్రవరి 9**

మధిర పట్టణం లో మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు ఒడి ఒడిగా ముందుకు సాగడానికి, సంక్షేమ ఫలాలు అన్ని వర్గాలకు చేరడానికి ఎన్నికలు జరుగుతున్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన మధిర పట్టణంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్, విద్యా రెండు శాఖలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద ఉన్నాయి వారు ఈ రెండు శాఖలపై ప్రత్యేకంగా దృష్టి సారించి ముందుకు తీసుకు వెళ్తున్నారని తెలిపారు. మురుగు నీటిని శుద్ధి చేసేందుకు రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఎస్టీపీలు మంజూరు చేశారని, పట్టణాల్లో ఆసుపత్రులు, విద్యావ్యవస్థ, ఎలక్ట్రిసిటీ ఈ రంగాల్లో ప్రపంచంలో వస్తున్న పరిణామాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు.గత ప్రభుత్వ కాలంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ప్రతినెలా 15వ తారీకు తర్వాతే వచ్చేవి కానీ మేము అధికారంలోకి రాగానే ప్రతి నెల మొదటి తారీకునే టెన్షనుగా ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జీతాలు జమ చేస్తున్నామని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మా ప్రభుత్వం కృషి చేస్తుంది, ఉద్యోగుల సంక్షేమం కోసం కోటి రూపాయల ప్రమాద బీమా కార్యక్రమాన్ని అమలు చేయబోతున్నాం ఇవన్నీ నిరంతరం కొనసాగాలి, ఉద్యోగులు ప్రభుత్వంతో కలిసి నడవాలి ఉద్యోగ వర్గాలు కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని డిప్యూటీ సీఎం కోరారు. 2047 విజన్ డాక్యుమెంట్ ను ఇటీవల గ్లోబల్ సమ్మెలో విడుదల చేశాం. మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాం ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తెలంగాణ రాష్ట్రం చేరుకుందని తెలిపారు. రాష్ట్రాన్ని 10 సంవత్సరాలు పరిపాలించిన వారు పట్టణాలు, స్థానిక



సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులు, మహిళలు అన్ని రంగాలను గాలికి వదిలేసారని ఆరోపించారు. ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచాలన్న ఆలోచనలను గత ప్రభుత్వం చేయలేదని అన్నారు. అటువంటి వారికి ఓట్లు వేస్తే సన్న బియ్యం పోయి తిరిగి మొద్దు బియ్యం వస్తాయి, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉండదు, ఉద్యోగుల జీతాలు ప్రతినెలా 15వ తారీకు తర్వాతే పడతాయి అన్నారు. గతంలో అధికారంలో ఉన్నవారు పట్టణాల్లో వాళ్లను ఇబ్బందులకు గురి చేశారు శాంతి భద్రతలు లేకుండా పోయాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు జవాబుదారీగా ఉండాలని శాంతియుత వాతావరణం లో పట్టణాలు అభివృద్ధి చెందాలని అధికారులను ఆదేశించాము, అంతటా ప్రశాంత వాతావరణం నెలకు ఉందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ నగరాలు పట్టణాలన్నిటిలో సాధ్యమైనంత మేరకు మౌలిక సదుపాయాలను, మెరుగైన వసతులు కల్పిస్తూ ముందుకు పోతుందని తెలిపారు. అర్హత కలిగిన పేద బడుగు బలహీన వర్గాల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చామని, బహిరంగ మార్కెట్లో 55 రూపాయలు కిలో పలికే మేలు రకం బియ్యాన్ని ప్రతి కుటుంబ సభ్యునికి ఆరు కిలోల చొప్పున లెక్కగట్టి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. డబ్బులు ఆదా అయితే కుటుంబంలో సభ్యుల అవసరాలు తీరుతాయన్న ఆలోచనతో 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం లబ్ధిదారుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు ప్రతినెల ఆ విధులు చెల్లిస్తుందని వివరించారు. వడ్డీ లేని రుణాల కింద రాష్ట్రంలోని మహిళలకు 27 వేల కోట్ల విలువైన చెక్కులను ఇప్పటికే పంపిణీ చేశామన్నారు. ఎన్ని సంఘాలు ఏర్పాటు చేసుకున్న, ఎన్ని వేల కోట్లయినా వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసేందుకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారితో సోలార్ విద్యుత్ ఉత్పత్తి, పెట్రోల్ బంకుల నిర్వహణ, కుటీర పరిశ్రమలు పెట్టించడం, బ్యాంకులతో సమన్వయం చేసుకుంటూ రుణాలు ఇప్పించడం వంటి పనులు చేపట్టామన్నారు. నగరంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యం కల్పించాము మహిళల పక్షాన ప్రతి నెల ఆర్టీసీకి ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందని తెలిపారు. ఉత్పత్తి రంగానికి కావలసింది నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తు ఇ0దుకు అవసరమైన అన్ని రకాల చర్యలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని ముందుకు పోతుందని ఫలితంగా రాష్ట్రంలో కుటుంబ జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయని తెలిపారు. మన బిడ్డలకు ఉద్యోగాలు రావాలంటే స్కిల్స్ ఉన్న కోర్సులు నేర్పించాలి అందుకే రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఐటిఐ లను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దుతున్నామని, ఇవన్నీ కార్పొరేషన్లు, మున్సిపల్ కేంద్రాల్లోనే ఉన్నాయని తెలిపారు. రాబోయే 50 సంవత్సరాలకు మధిర పట్టణ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నట్టు డిప్యూటీ సీఎం వివరించారు. మధిర మున్సిపాలిటీ అభివృద్ధికి రాజకీయాలు వద్దు.. అభివృద్ధి మాత్రమే ప్రధానం అన్నారు. వరద నీరు మధిర పట్టణంలోకి రాకుండా భారీ రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నామని, వైరా నదినీ టూరిజం ప్రాజెక్టుగా అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్క్, ఫుడ్ కోర్ట్ వంటివి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆధునిక స్మశాన వాటిక, మురుగునీరు కనబడకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, భారీ వర్షాలు వరదలు వచ్చిన విద్యుత్ సరఫరా లో అంతరాయం లేకుండా అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా విద్యుత్ సరఫరా ఒంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మురుగునీరు, వరద నీరు కలిసి పారకుండా శుద్ధి చేసి బయటకి వదిలేందుకు ఎస్టిపి నిర్మాణం చేస్తున్నట్టు తెలిపారు. మధిర పట్టణానికి ప్రవేశించే మార్గాల్లో ఆహ్లాదకర వాతావరణ ఉండేందుకు పార్కులు నిర్మిస్తున్నామని తెలిపారు.
మై మధిర క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.

## ప్రారంభ దశలో క్యాన్సర్ ను గుర్తిస్తే మెరుగైన జీవనం పొందవచ్చు....

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
**స్వస్త్ మహిళ స్వస్థ్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్..**

**ఖమ్మ ధర్మ ఘంట ఫిబ్రవరి 9**




ప్రారంభ దశలో క్యాన్సర్ ను గుర్తిస్తే చికిత్స విజయవంతంగా పూర్తి చేసుకొని మెరుగైన జీవనం పొందవచ్చని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో యువికెన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వస్త్ మహిళ స్వస్థ్ భారత్ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ క్యాన్సర్ ను ప్రాథమిక దశలోనే గుర్తించడం చాలా కీలకమని, ప్రాథమిక దశ దాటితే ఆరోగ్య పరిస్థితి విషమం అవుతుందని అన్నారు. కలెక్టరేట్ లో 30 సంవత్సరాలకు పైగా వయస్సు ఉన్న ప్రభుత్వ మహిళ అధికారులు, ఉద్యోగులకు బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ చేసేందుకు క్యాంప్ ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారికి కలెక్టర్ సూచించారు. క్యాన్సర్ లేటుగా గుర్తించి చికిత్స పొంది మనం బ్రతికినప్పటికీ మన లైఫ్ స్టైల్ లో చాలా ఇబ్బందులు ఎదురవుతాయని కలెక్టర్ తెలిపారు. బ్రెస్ట్ క్యాన్సర్ నిర్ధారణ యంత్రాలను అందించిన యువికెన్ ఫౌండేషన్ కు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ యంత్రం ద్వారా ఆరోగ్య మహిళ శిబిరాలలో మహిళలను స్క్రీన్ చేసి అనుమానితులుగా ఉన్న వారికి అవసరమైన నిర్ధారణ పరీక్షలు నిర్వహించి క్యాన్సర్ వ్యాధిని గుర్తించిన వారికి మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

**యువికెన్ ఫౌండేషన్ రీజినల్ మేనేజర్ డాక్టర్ షహనాజ్ భాను మాట్లాడుతూ..**
స్వస్త్ మహిళ స్వస్థ్ భారత్ లో భాగంగా గత ఒకటిన్నర సంవత్సరాలుగా దేశంలోని వివిధ ప్రాంతాలలో యువికెన్ ఫౌండేషన్ తరపున కేన్సర్ పై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. జిల్లాలోని 4 పి.హెచ్.సి. ల పరిధిలో 14 వేల మంది మహిళలకు స్క్రీన్ చేసి 200 మంది అనుమానితులకు నిర్ధారణ పరీక్షలు చేస్తే ఇద్దరికీ బ్రెస్ట్ క్యాన్సర్ నిర్ధారణ జరిగిందని అన్నారు. బ్రెస్ట్ కేన్సర్ ను చెక్ చేసే యంత్రాన్ని నేడు జిల్లా యంత్రాంగానికి అప్పగిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, డి.ఎం. అండ్ హెచ్.ఓ. డా. రామారావు, డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ. డా. చందునాయక్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. యాక్ట్ అమలు..

**ధర్మఘంట,ఫిబ్రవరి09,రామగుండం:**




రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్‌లో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్,పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపా లిటీలు మరియు మంచిర్యాల జోన్ పరిధిలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, చెన్నూర్, క్యాతన్‌పల్లి, బెల్లంపల్లి, లక్సెట్టి పేట్ మున్సిపాలిటీలలో మున్సిపల్ ఎన్నికలు ఫిబ్రవరి 11న జరగనున్న నేపథ్యంలో,పై పేర్కొన్న మున్సిపాలిటీల పరిధిలో ఫిబ్రవరి 9 సాయంత్రం 5:00 గంటల నుండి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఫిబ్రవరి 13 ఉదయం 8:00 గంటల నుండి కౌంటింగ్,ఫలితాల వెల్లడింపు పూర్తయ్యే వరకు సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. యాక్ట్ అమల్లో ఉంటుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.ఈ ఆంక్షల కాలంలో నలుగురికి మించి గుంపులుగా చేరడం పూర్తిగా నిషేధమని తెలిపారు.ఎన్నికల వాతావరణాన్ని ఉద్రిక్తం చేసే రెచ్చగొట్టే వ్యాఖ్యలు,కవ్వింపు చర్యలు,గొడవలకు దారితీసే ప్రవర్తన ఏదైనా చోటుచేసుకున్నట్లయితే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.విధి నిర్వహణలో ఉన్న పోలీసులు,అటవీ అధికారులు,కేంద్ర బలగాలు, హోమ్‌గార్డులు మరియు ఎస్పీఓలకు ఈ నిషేధాలు వర్తించవని స్పష్టం చేశారు.పోలింగ్ కేంద్రాల ఒక కిలోమీటర్ పరిధిలో కర్రలు,కత్తులు, తుపాకులు లేదా ఎలాంటి మారణాయుధాలతో సంచరించడం పూర్తిగా నిషేధమని సీపీ తెలిపారు.తాత్కాలిక నిర్మాణాలైన షామియానాలు, పందిళ్లు ఏర్పాటు చేయడానికి కూడా తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు.మైకులు, లౌడ్‌స్పీకర్ల ద్వారా పాటలు ప్రసారం చేయడం,సభలు నిర్వహించడం, ప్రజలను ఒక వర్గం మీద మరొక వర్గం మీద రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేయడం నిషేధమని తెలిపారు.ఎన్నికల సమయంలో చట్టబద్ధమైన అధికారాన్ని ధిక్కరించే విధమైన ప్రకటనలు, ప్లకార్డులు,గుర్తులు ప్రదర్శించడం కూడా చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.

# తెలంగాణలో ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారం ఎల్లుండే పోలింగ్!

**మున్సిపల్ ఎన్నికల ప్రచారమైకులు సైలెంట్!**
**పోలింగ్‌కు పార్టీలు రెడీ!**
**ఓటు హక్కు వినియోగించుకోనున్న**
**52.43 లక్షల మంది ఓటర్లు**
**ఫిబ్రవరి 13న ఉదయం 8 గంటల నుండి ఓట్ల లెక్కింపు**

**చెన్నూరి అన్వేషి**
**ఎగ్జిక్యూటివ్ ఎడిటర్**





తెలంగాణ లో మున్సిపల్ ఎన్నికల కు సంబంధించిన ప్రచారం ముగిసింది. ప్రచారానికి చివరిరోజైన సోమవారం ఓటర్ల దృష్టిని ఆకర్షించడానికి ప్రధాన పార్టీలు పెద్ద ఎత్తున ర్యాలీలు, ప్రదర్శనలు చేశాయి.ముఖ్యనేతలంతా జనాల్లో ఉన్నారు. సాయంత్రం ప్రచారం ముగియడంతో మైకులు బంద్ అయ్యాయి. ఫిబ్రవరి 11న ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఫిబ్రవరి 13న ఉదయం 8 గంటల నుండి ఓట్ల లెక్కింపు జరుగుతుంది.మూడు ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు బహిరంగ సభలలో ప్రసంగించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ర్యాలీలలో పాల్గొని బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.బీజేపీ తరఫున కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ఎంపీలు ఎన్నికల ర్యాలీల్లో పాల్గొన్నారు. మరోవైపు జనసేన అభ్యర్థులు ప్రచారం చేశారు. వారి తరపున కొందరు సినిమా నటులు ప్రచారంలో పాల్గొన్నారు. ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రచారం పాల్గొంటారనుకున్నా తర్వాత క్యాన్సిల్ అయింది. ఈ ఎన్నికలు 116 మునిసిపాలిటీలలోని 2,582 వార్డులు, ఏడు మున్సిపల్ కార్పొరేషన్లలోని 414 వార్డులలో జరుగుతాయి. మొత్తం 32 జిల్లాల్లోని 2,996 వార్డులలో ఎన్నికలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 8,203 పోలింగ్ కేంద్రాలలో వెబ్-కాస్టింగ్ సౌకర్యాలతో సహా స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా విస్తృత ఏర్పాట్లు చేశారు.

ఓటు హక్కు వినియోగించుకోనున్న
52.43 లక్షల మంది ఓటర్లు

మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 26.80 లక్షల మంది మహిళా ఓటర్లు, 25.62 లక్షల మంది పురుష ఓటర్లు, ఇతరులలో 640 మంది ఓటర్లు ఉన్నారు. మహిళా ఓటర్ల భాగస్వామ్యం ఎక్కువగా ఉంది.

**పోలింగ్, లెక్కింపు సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు**

పోలింగ్, లెక్కింపు సజావుగా నిర్వహించడానికి వీలుగా 16,031 బ్యాలెట్ పెట్టెలు, 137 స్ట్రాంగ్ రూములు, 136 లెక్కింపు కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. ఫలితాల ప్రకటన తర్వాత పట్టణ స్థానిక సంస్థల ఎన్నికైన వార్డు సభ్యులు ఫిబ్రవరి 16న ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తారు. మరోవైపు 25000 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1900 సమస్యాత్మక, 1400 అత్యంత సమస్యాత్మకంగా పోలింగ్ కేంద్రాలను గుర్తించి సీసీటీవీ మానిటరింగ్‌తో పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. ఎలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. మద్యం దుకాణాలను మూసివేశారు.

## ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి..



**ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు..**
**మీడియా సమావేశంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ..**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫిబ్రవరి 8 ధర్మ ఘంట**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం ముగియడంతో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాలతో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ డిఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ తేదీన జరగబోయే ఎన్నికలు సజావుగా జరిగేలా పోలీస్ శాఖకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు కొత్తగూడెం పట్టణ పరిధిలోని 33 డివిజన్లలో 34,000/- ల రూపాయల విలువగల 40 లీటర్ల మద్యాన్ని, 2,70,000/- రూపాయల విలువ గల 5.5 కేజీల ప్రభుత్వ నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్టర్ను ఉల్లంఘించినందుకు గాను మూడు కేసులు నమోదు చేయడం జరిగిందని,110 కేసుల్లో 258 మంది సమస్యాత్మక వ్యక్తులను బైండోవర్ చేయడం జరిగిందని వివరించారు.33 డివిజన్లలోని 41 పోలింగ్ స్థానాలలో 110 పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఇందులో 65 పోలింగ్ కేంద్రాలు సున్నితమైనవిగా,45 సాధారణ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందన్నారు.ఓటర్లను ప్రలోభ్ పెట్టే విధంగా ఎవరైనా మద్యం నగదు ఇతరత్రా వస్తువులను సరఫరా చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా శాంతిభద్రతలకు విగాథం కలిగించేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని అన్నారు.

# సహజ విత్తన-జన్యు సంపద రక్షణకు ప్రభుత్వాలు పూనుకోవాలి

**తెలంగాణ రైతాంగ ఉమ్మడి ప్రకటన.**

**ధర్మ ఘంట ఫిబ్రవరి 09,కడ్తాల్** :విత్తనాలు, జాతుల జన్యు మార్పిడి పై పూర్తి నిషేధం విధించాలని, మొక్కల రకాలపై స్థానిక సమాజాలకుండే హక్కులను కాపాడాలని రైతులు, విత్తన సంరక్షకులు, స్థానిక సామాజిక సంస్థలు, మహిళలు, పర్యావరణ - విద్యావేత్తలు, విధాన నిర్ణేతలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ సంయుక్తాధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్మాస్పల్లి లో మూడు రోజుల పాటు జరిగిన తెలంగాణ ద్వితీయ వార్షిక విత్తన పండుగ ముగింపు సమావేశం లో ఈ మేరకు వారు విత్తనాలు, రైతుల హక్కుల పై ఆమోదించిన 'తెలంగాణ ఉమ్మడి ప్రకటన 2026' ను విడుదల చేశారు. వారసత్వ విత్తనాలు, మొక్కల రకాల పై స్థానిక సమాజాలకు ఉండే సహజ హక్కులను కాపాడాలని, మన విత్తనాల డిజిటల్ సీక్వెన్స్ సమాచారాన్ని తీసుకొని మేధో హక్కుల పరిరక్షణ ప్రక్రియల ద్వారా జరుగుతున్న బయో పైరసీని నిరోధించాలని కోరారు. జన్యు మార్పిడి విత్తనాల వల్ల స్థానిక విత్తనాలు కలుషిత మైనప్పుడు కారకులైన కార్పొరేట్ కంపెనీలను బాధ్యులను చేస్తూ చట్టాలు, ఒప్పందాలను కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వాలను కోరారు.వాణిజ్య పంటల కంటే




స్థానికంగా తగిన పోషకమైన ఆహార పంటలకు ప్రాధాన్యత నిస్తూ ప్రకృతి వ్యవసాయానికి మద్దతు నివ్వాలని ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు విత్తనాల అందుబాటును పరిమితం చేసే యు పి ఓ వి సభ్యత్వంతో పాటు సంబంధిత విత్తన చట్టాలను, విత్తన జన్యు వనరులపై వాణిజ్య సంబంధిత మేధో హక్కులను కల్పించే అంతర్జాతీయ ఒత్తిళ్లను నిరోధించాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశాయి. స్థానిక సంఘాలు, సంస్థలు, రైతులు, మహిళా రైతులు నిర్వహిస్తున్న విత్తన బ్యాంకులను ప్రోత్సహిస్తు, 2018 లో ఐక్యరాజ్య సమితి రైతు హక్కుల ప్రకటన ప్రస్తావించిన విత్తనాలు, ఇతర హక్కులకు అనుగుణంగా రైతులు, గ్రామీణ వర్గాల హక్కులను కాపాడటానికి తగిన జాతీయ చట్టాలను రూపొందించి అమలు చేయాలని ప్రభుత్వాలను కోరారు. భారతీయ జన్యు సంబంధ, జీవ సంస్కృత వారసత్వ సంపద, జీవ వైవిధ్యాన్ని పేటెంట్ల మేధో హక్కుల శకంలో ఏ రూపంలో ఉన్నా తాము తిరస్కరిస్తున్నట్లు తెలంగాణ ఉమ్మడి ప్రకటన 2026 పేర్కొంది. విత్తనాలు పై అంతర్జాతీయ ఒప్పందాలు జాతీయ చట్టాలు, మన గొప్ప వారసత్వాన్ని కాపాడడంలో విఫలమయ్యాయని ఈ ప్రకటన వెల్లడించింది. స్థానిక జనాభాచే నిర్వహించే విత్తన, జీవావరణ పద్ధతులతోనే జీవ వృద్ధి చెందుతుందని, వాటి పునరుజ్జీవన కార్యక్రమాల నిర్వహణకు తమ మద్దతు ఉంటుందని తెలంగాణ ద్వితీయ వార్షిక విత్తన పండుగ లో రైతులు, పర్యావరణ వేత్తలు, విద్యా వేత్తలు, మహిళలు, స్వచ్ఛంద సంస్థలు ఏకాభిప్రాయంగా ప్రకటించాయి.

ధర్మఘంట

# మున్సిపల్ ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి..







**ఎన్నికల విధుల రిటర్నింగ్ అధికారులు కౌంటింగ్ కేంద్రంను కట్టుదిట్టంగా పర్యవేక్షించాలి..**

**ప్రతి పోలింగ్ కేంద్రానికి సామాగ్రి డిపాజిట్ చేసే వరకు ఆర్వో లు బాధ్యత వహించాలి..**

**ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, ఓట్ల లెక్కింపు కేంద్రాలను తనిఖీ చేసి, ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం/ ఫిబ్రవరి /9 ధర్మ ఘంట**

మున్సిపల్ ఎన్నికలను పూర్తిస్థాయిలో నిష్పక్షపాతంగా నిర్వహించాలని, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియను అధికారులు పకడ్బందీగా ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.దఫిబ్రవరి 11న జిల్లాలో ఐదు మున్సిపాలిటీ లలో నిర్వహించే మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్, పెద్దతండాలోని ప్రియదర్శని కళాశాలలో ఏర్పాటు చేసిన ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిషిప్షన్, కౌంటింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ సెంటర్ల లను కలెక్టర్ అనుదీప్ తిరుగుతూ క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిబ్రవరి 10న ఎన్నికల సిబ్బంది అందించే సామాగ్రి పంపిణీకి ముందస్తు ప్రక్రియనుపై దిశానిర్దేశం చేశారు. పోలింగ్ సామాగ్రిని, పోస్టల్ బ్యాలెట్ పత్రాలు, పూర్తి సామాగ్రి ఉందో లేదో ఎలా సరిచూసుకోవడం, బ్యాలెట్ బాక్స్, ఓటర్ లిస్ట్, బ్యాలెట్ పేపర్స్ చెక్ చేసుకోవడం, పోలింగ్ రోజున ఉదయమే సిబ్బంది పోలింగ్ స్టేషన్ వద్దకు చేరుకునేలా విధంగా వాహనాల ఏర్పాట్లుతో రూట్ ఆఫీసర్లు భాద్యత వహించాలని, ఎన్నికల సామాగ్రి పంపిణీ నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటూ, సమయానికి అనుగుణంగా సిబ్బందికి భోజనం ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, పెద్ద మున్సిపాలిటీ అయిన ఏదులాపురం నందు ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమైనదని, ప్రతీ అంశం పైన క్షుణ్ణంగా అవగాహన చేసుకొని విధులను సమర్ధవంతంగా నిర్వర్తించాలని అన్నారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామాగ్రి సేకరించడం, బ్యాలెట్ పేపర్స్ ఇవ్వడం, పివో డైరీ నింపడం, అన్ని ఫార్మ్ల ఎలా నింపాలి, ఏజెంట్స్ సిగ్నేచర్ ఎక్కడ తీసుకోవాలి, పోలింగ్ పూర్తి అయిన తర్వాత బ్యాలెట్ బ్యాక్స్ సీలింగ్, స్ట్రాంగ్ రూం సెంటర్ కు తరలింపు తదితర అంశాల మీద పూర్తి అవగాహన ఉండాలని, ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు వారికి ఏర్పాటు చేసిన చోటనే ఉండేలాగా చర్యలు చేపట్టాలని తెలిపారు.డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లు పెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేయాలని, అక్కడ అవసరమైన సదుపాయాలు భోజనం, పోలింగ్ సిబ్బందికి సునాయసంగా తెలిసేలా సైన్ బోర్డ్స్, వాహనాల పార్కింగ్ అవసరమైన స్థలం ఏర్పాటు చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన పోలింగ్ సిబ్బంది విధులకు హాజరయ్యే విధంగా రిటర్నింగ్ అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. స్ట్రాంగ్ రూం వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఉండాలని, కౌంటింగ్ కేంద్రాల వద్ద నిబంధనల మేరకు అన్ని చర్యలు చేపట్టాలని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు పోలింగ్ బృందాలు చేరుకున్నాయో లేదో రిటర్నింగ్ అధికారి చెక్ చేయాలని, సరైన సమయానికి చేరుకునేలా ఫాలో అప్ చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో అవసరమైన సామాగ్రి పంపిణీ చేసామో లేదో చెక్ చేయాలని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ముందు పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. పోలింగ్ కు ముందురోజు ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం రిటర్నింగ్ అధికారి నవీన్ బాబు, ఖమ్మం రూరల్ తహసీల్దారు రాంప్రసాద్, ఎంపీడివో లు సురేందర్, ఎర్రయ్య, మున్సిపల్ కమీషనర్ మున్వర్ అలీ, ప్రియదర్శిని కళాశాల యాజమాన్యం

## జీహెచ్ఎంసీ పాలకవర్గ ఐదేళ్ల ప్రగతి ప్రస్థానం
## మౌలిక వసతులు, వరద నివారణ, సామాజిక సాధికారత, హరితాభివృద్ధికి ప్రాధాన్యం

**ధర్మఘంట. హైదరాబాద్, ఫిబ్రవరి 09,**

ఫిబ్రవరి 10, 2026తో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికైన పాలకవర్గం ఐదేళ్ల పాలన ముగియ నుంది. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి నాయకత్వంలోని ఈ పాలకవర్గం నగర మౌలిక సదుపాయాల అభివృద్ధి, వరద నివారణ చర్యలు, సామాజిక, మహిళా సాధికారత, జీవ వైవిధ్య పరిరక్షణ రంగాల్లో విస్తృతమైన ముద్ర వేసింది.







**ఐదేళ్లలో సాధించిన ప్రగతి వివరాలు.**

ఇంజినీరింగ్ మెయింటెనెన్స్ విభాగం

+ఎవీజ ఇంజినీరింగ్ మెయింటెనెన్స్ విభాగం

రహదారుల నిర్మాణంమరమ్మతులు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణంనిర్వహణ, నాలాల డిసిల్టింగ్, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధి, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, జంక్షన్ అభివృద్ధి, ఓపెన్ స్పేసులుస్మశానాల చుట్టూ కంపౌండ్ గోడలు, వర్షపు నీటి నిల్వహార్వెస్టింగ్ నిర్మాణాలు వంటి విస్తృత పౌర ఇంజినీరింగ్ పనులను విజయవంతంగా చేపట్టింది.

ఫిబ్రవరి 2021 నుంచి ఇప్పటివరకు 23,287 అభివృద్ధి పనులు పూర్తి చేసి, రూ.5,117.25 కోట్ల వ్యయం చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 202526లో 10,488 పనులు (రూ. 2,787.55 కోట్లు) చేపట్టగా, అందులో 5,056 పనులు (రూ. 1,092.56 కోట్లు) ఇప్పటికే పూర్తయ్యాయి.

**వరద నివారణస్టార్మ్ వాటర్ నిర్వహణ**

నగరంలో తరచూ ఎదురయ్యే నీరు నిలిచే సమస్యను నియంత్రించేందుకు +ఎవీజ 10 ప్రాంతాల్లో 11 రేన్ వాటర్ హోల్డింగ్ & హార్వెస్టింగ్ నిర్మాణాలు చేపట్టి రూ.15.69 కోట్లు ఖర్చు చేసింది. ఇవి భారీ వర్షాల సమయంలో వరదలను తగ్గించడంతో పాటు భూగర్భ జలాల రీఛార్జ్‌కు దోహదపడుతున్నాయి.స్టార్మ్ వాటర్ డ్రెయిన్ల విభాగంలో ఫిబ్రవరి 2021 నుంచి ఇప్పటివరకు 1,636 పనులు పూర్తి చేసి రూ.816.21 కోట్లు వెచ్చించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 202526లోనే 971 పనులు (రూ. 518.59 కోట్లు) చేపట్టి ముంపు సమస్యల నివారణకు చర్యలు చేపట్టారు.

రోడ్లుభద్రతజంక్షన్ అభివృద్ధిగత ఐదేళ్లలో నగరవ్యాప్తంగా 8,542 రహదారి పనులు పూర్తి చేసి రూ.2,469.78 కోట్లు ఖర్చు చేశారు. రోడ్ సేఫ్టీ డ్రైవ్2025 కింద 27 వేలకుపైగా గుంతలు పూడ్చడం, క్యాచ్ పిట్ మరమ్మతులు, మిడియన్ అభివృద్ధి, కవర్ మార్పులు చేపట్టి ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చారు.నగరంలో 82 జంక్షన్లు అభివృద్ధికి గుర్తించగా, ఇప్పటివరకు 56 జంక్షన్లు రూ.38.15 కోట్ల వ్యయంతో పూర్తయ్యాయి. వీటిలో పాదచారి భద్రత, ట్రాఫిక్ ప్రవాహం మెరుగుదల, సౌందర్యవృద్ధి ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి.

**పాదచారుల భద్రతపౌర వసతుల పెంపుదల**

అధిక వేగంతో వాహనాలు నడిచే మార్గాల్లో పాదచారి భద్రత కోసం రూ.76.85 కోట్ల వ్యయంతో 23 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు చేపట్టగా, అందులో 15 పూర్తయ్యాయి.

అదేవిధంగా మల్టీ పర్పస్ కమ్యూనిటీ ఫంక్షన్ హాళ్లు, మోడల్ స్మశానాలు అభివృద్ధి చేసి పౌర వసతులను బలోపేతం చేశారు.

**హరిత హైదరాబాద్ దిశగా అడుగులు**

జీహెచ్ఎంసీ నగర జీవ వైవిధ్య విభాగం నగర హరిత విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో 1,164 పార్కులు ఉన్నాయి. 201617 నుంచి 202425 వరకు 821.90 లక్షల మొక్కలు నాటగా, లక్ష్యం 891 లక్షలు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 202526లో వనమహోత్సవం కింద లక్ష్యంగా పెట్టుకున్న 25 లక్షల మొక్కలు 100 శాతం సాధించారు. 46 ప్రాంతాల్లో మియావాకి అడవులు, అర్బన్ ఫారెస్ట్ పార్కులు, వెర్టికల్ గార్డెన్లు, సెంట్రల్ మిడియన్లు, చెరువుల బఫర్ ప్రాంతాల్లో మొక్కల నాటకం ద్వారా నగర పర్యావరణ ముఖచిత్రం మారింది.

**అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ పట్టణ పేదల సాధికారత**

మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు +ఎవీజ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (ఖజణ) విభాగం పట్టణ పేదల జీవన ప్రమాణాల మెరుగుదలపై దృష్టి సారించింది. పేద కుటుంబాలను స్వయం సహాయక సంఘాలుగా (ూఎ+ం) సంఘటితం చేసి ఆర్థిక స్వావలంబన దిశగా నడిపించడమే ఖజణ ప్రధాన లక్ష్యం. వడ్డీ లేని రుణాలు (ూా=) పథకం కింద 07 శాతం వరకు వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తోంది. నవంబర్ 2025లో రూ.39.81 కోట్లు విడుదల చేయగా, 33,116 ూఎ+ం, 3,31,160 మంది మహిళలు లబ్ధిపొందారు. ఏప్రిల్ 2022 నుంచి ఫిబ్రవరి 2026 వరకు 13,027 కొత్త ఏర్పాటు చేసి 1,30,270 మంది సభ్యులను సంఘటితం చేశారు.

**ఆర్థిక భాగస్వామ్యంఉపాధి కార్యక్రమాలు**

జాతీయాకృత బ్యాంకుల ద్వారా ూఎ+ంలకు రుణ సదుపాయం కల్పించగా, 43,197 ూఎ+ంకు రూ.5,099.41 కోట్ల బ్యాంక్ లింకేజ్ జరిగింది.

ఇందిరా మహిళా శక్తి (×మీా) కార్యక్రమం కింద 9,147 మంది వ్యక్తులకు రూ.247.05 కోట్లు, 878 గ్రూప్ యూనిట్లకు రూ.63.02 కోట్లు మంజూరు చేశారు.

అలాగే 38 ఇందిరమ్మ మహిళా శక్తి కాంటీన్లు రూ.2.58 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేశారు.

స్వయం ఉపాధి కార్యక్రమం (ాజూ) కింద 1,762 మందికి ఆర్థిక సహాయం అందించారు. నిరాశ్రయులకు ఆశ్రయం పరిధిలో 10 షెల్టర్ హోమ్స్, 7 పేషెంట్ అటెండెంట్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ కాలంలో 1,067 నిరాశ్రయులను గుర్తించగా, 137 మందిని ఆశ్రయ గృహాలకు తరలించి, 930 మందిని వారి స్వస్థలాలకు పంపించారు.

**అంతర్జాతీయ గుర్తింపుభవిష్యత్ దిశ**

హైదరాబాద్ నగరానికి వరల్డ్ గ్రీన్ సిటీ అవార్డు2022, వరుసగా ట్రీ సిటీ హోదా వంటి అంతర్జాతీయ గుర్తింపులు లభించాయి. 10 శాతం గ్రీన్ బడ్జెట్, వాతావరణ సహన చర్యలు, జీవ వైవిధ్య వ్యూహాలతో +ఎవీజ పాలకవర్గం సమతుల్య, సమగ్ర పట్టణాభివృద్ధికి బలమైన పునాది వేసింది. మౌలిక వసతుల అభివృద్ధి, సామాజిక సాధికారత, పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యం ఇస్తూ హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి, సమగ్ర మహానగరంగా తీర్చిదిద్దే దిశగా పాలకవర్గం దృఢమైన అడుగులు వేసింది.

# కాంగ్రెస్ పార్టీని ఓడించండి

**వరంగల్ :** అన్న ఎన్టీఆర్‌ను, ఆ తర్వాత చంద్రబాబు, వైఎస్సార్, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్‌లను చూశామని, కానీ రేవంత్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని మనం చూడలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. హామీల గురించి అడిగితే 'లాగులో తొండలు విడిచిపెడుతా', 'గుడ్లు పీకి గోటీలు ఆడుతా', 'పేగులు తీసుకుని మెడలో వేసుకుంటా' అని అంటున్నారని, కానీ ఇంతమంది ముఖ్య మంత్రులను మనం చూసినా వారెవరూ ఇలా మాట్లాడలేదని అన్నారు.భూపాలపల్లి, పరకాలలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాను రద్దు చేయనని ముఖ్యమంత్రి చెబుతున్నారని, అసలు ఆయన రద్దు చేయడానికి, జిల్లాను ఆయన చేశాడా అని ప్రశ్నించారు. జిల్లాను రద్దు చేస్తే భూపాలపల్లి ప్రజలు వీపు చింతపండు చేస్తారని కేటీఆర్ అన్నారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిడితే ఊరుకునేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. "నీ టైమ్ అంతా రెండేళ్లే. ఆ తర్వాత గులాబీ జెండా ఎగురుతుంది. ఆ తర్వాత నువ్వు పాతాళంలో దాక్కున్నా వదిలి పెట్టం, పొట్టోడా. కేసీఆర్‌తో పాటు మా కార్యకర్తలను అంటే ఊరుకునేది లేదు" అని అన్నారు. తిడితే తనను, ఇతర నాయకులను తిట్టుకోవచ్చని, కానీ కేసీఆర్‌ను, బీఆర్ఎస్ కార్యకర్తలను తిడితే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు.ఎంతమంది దేవుళ్లు ఉంటే అంతమంది దేవుళ్లను మొక్కుకున్నా అధికారంలోకి వచ్చాక వదిలి పెట్టేది లేదని అన్నారు. ఆయన పేరు అనుముల రేవంత్ రెడ్డి కాదని, లాగుల తొండల్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో పాలన పక్కకు పెట్టి కుంభకోణాలకు తెరలేపారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని విమర్శించారు.సింగరేణిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బావమరిది కలిసి దోచుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ప్రజలను ఆ పార్టీ నాయకులు ముంచుతారని హెచ్చరించారు. రూ.4 వేల పెన్షన్, తులం బంగారం, రైతుబంధు పెంపు ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడిస్తే హామీలు అమలవుతాయని ఓటర్లకు సూచించారు.

## రూ. 4.76 కోట్ల గంజాయి కాల్చివేత..





**ఖమ్మం/ ఫిబ్రవరి/9 ధర్మ ఘంట**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలోని ఆరు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో నమోదైన 47 కేసుల్లోని 953 కేజీల గంజాయిని కాల్చివేతకు ఖమ్మం డిప్యూటి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి అదేశాలు జారీ చేశారు. ఈ మేరకు స్టేషన్లలో కేసుల వారిగా గంజాయిని ఒక దగ్గరకు చేర్చి మొత్తంగా 953 కేజీల గంజాయిని ప్రభుత్వ అమోదిత ఏడబ్ల్యూఎం కన్సంటింగ్ లిమిటేడ్ కాల్చివేత పరిశ్రమలో సోమవారం కాల్చివేశారు. ఈకంపెనీలో తల్లాడ మండలం గోపాలపేట గ్రామంలో ఉంది. కాల్చివేసిన గంజాయి విలువ రూ. 4.76 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు.ఖమ్మం జిల్లాలోని ఖమ్మం 1 ఎక్సైజ్ స్టేషన్‌లో 9 కేసుల్లో 42 కేజీలు, ఖమ్మం -2 స్టేషన్‌లో5 కేసుల్లో 57 కేజీల, మధిర స్టేషన్‌లోని 7 కేసుల్లో 193 కేజీల, కొత్తగూడం జిల్లాలోని పాల్వంచ స్టేషన్‌లో 2 కేసుల్లో 114 కేజీలు, మణుగూర్ స్టేషన్‌లో ఒక కేసులో 21 కేజీలు, భద్రాచలం స్టేషన్‌లో 23 కేసుల్లో 625 కేజీల గంజాయిని కాల్చి వేసినట్లు డిప్యూటి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి తెలిపారు.

## సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ ఫ్లాగ్ మార్చ్.. పోలీస్ రికార్డ్స్ లో ఎక్కవద్దు..



**సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య..**

**ధర్మ ఘంట ఫిబ్రవరి 09,సూర్యాపేట :** సూర్యాపేట మున్సిపాలిటీ పరిధి ఎన్నికల నిర్వహణలో భాగంగా గుర్తించి సమస్యాత్మక ప్రాంతాలు రాజీవ్ నగర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, తులసమ్మ హోటల్ ప్రాంతం, ముత్యాలమ్మ గుడి ప్రాంతం, సీతారాంపురం, మామిల్లగడ్డ కాలనీలలో సూర్యాపేట పట్టణ పోలీసుల అధ్వర్యంలో పోలీసు ఫ్లాగ్ మార్చి నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ ఎన్నికల నియమవాలని పటిష్టంగా అమలు చేయడంలో భాగంగా జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు సూర్యాపేట మున్సిపాలిటీ కేంద్రం మరియు మున్సిపాలిటీలో విలీన గ్రామాలలో పోలీస్ ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాల ద్వారా స్థానిక పౌరులలో ఓటర్లలో ఎన్నికల నియమాలు పట్ల అవగాహన కలుగుతుందని నమ్మకం భరోసా ఏర్పడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలని ఇన్స్పెక్టర్ కోరారు. ఎవరైనా ఎన్నికలవేళ తగాదాలు పెట్టుకున్న గొడవలు పడ్డ ఎన్నికల సంబంధ కేసుల్లో ఒకసారి చిక్కుకుంటే ఎన్నికలు వచ్చే ప్రతిసారి పోలీస్ చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఎవరు కూడా ఎన్నికల సమయంలో ఎన్నికల తగాదాలలో పోలీసు రికార్డులోకి ఎక్కకూడదని కోరారు. ప్రతి ఒక్కరూ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవడానికి రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సైలు ఏడుకొండలు, సాయిరాం, ఐలయ్య, శివతేజ మహేందర్ నాథ్, వెంకన్న, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను అధిక సంఖ్యలో గెలిపించండి.....

**బీజేపీ సూర్యాపేట జిల్లా కౌన్సిల్ సభ్యులు కత్తుల నరేష్ విజ్ఞప్తి....**

**ధర్మ ఘంట ఫిబ్రవరి 09, సూర్యాపేట:**



జిల్లా వ్యాప్తంగా జరగనున్న ఐదు మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని భారతీయ జనతా పార్టీ సూర్యాపేట జిల్లా కౌన్సిల్ సభ్యులు కత్తుల నరేష్ కోరారు. ఈ ఎన్నికలతో బీజేపీ తెలంగాణలో కొత్త మార్పుకు శ్రీకారం చుట్టబోతుందని వెల్లడించారు. రాష్ట్రాన్ని గతంలో పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం.ప్రజలకు చేసిందేమి లేదని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే ఆ పార్టీ పబ్బం గడిపిందని ఎద్దేవా చేశారు.అదే దారిలోనే కాంగ్రెస్ పాలన కొనసాగుతుశీదని,దీన్ని ప్రజలు గమనించాలని చెప్పారు. ఈ రాక్షస కాంగ్రెస్ పార్టీ పాలనలో ఇచ్చిన హామీలు గాలికి వదిలేసి దందాలు,సెటిల్మెంట్లు అంటూ సామాన్య ప్రజలను పీక్కు తింటున్నారే తప్ప ఇచ్చిన హామీలు నెరవేర్చలేక పోయారని విమర్శించారు.ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీలను ముకుమ్మడిగా బొంద పెట్టకపోతే తెలంగాణ ప్రజల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం పొంచి ఉన్నందన్నారు. అన్ని మున్సిపాలిటీలు అభివృద్ధి చెందాలంటే కేంద్రంలో అధికారం ఉన్న బిజెపితోనే సాధ్యం అవుతుందని,అందుకే సూర్యాపేట జిల్లాలో ఉన్న అన్ని మున్సిపాలిటీల్లోని ప్రజలు బిజెపి అభ్యర్థులకు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## పోలింగ్ సందర్భంగా ప్రచార కార్యక్రమాలపై నిషేధం : జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి.

**ధర్మఘంట,ఫిబ్రవరి 09, కరీంనగర్:**

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న పరిధిలో ఫిబ్రవరి 09వ తేదీ సాయంత్రం 5.00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని, ఎన్నికలు ముగిసేంత వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో ఎవరు కూడా బహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదని అన్నారు. ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి, ఎం.సి.సి బృందాలు, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ఈ నెల 9వ తేదీ సోమవారం సాయంత్రం 5.00 గంటల నుండి 11వ తేదీ పోలింగ్ ముగిసేంత వరకు మద్యం షాపులను మూసివేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పురస్కరించుకుని ఈ నెల 13న కూడా మద్యం దుకాణాలు మూసివేయాలని, కౌంటింగ్ ముగిసేంత వరకు డ్రై డే అమలు లో ఉంటుందని తెలిపారు.